

ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ — సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డాక్టర్ ప్రణవ్ పండ్యా

సంపాదకులు
**కందర్ప రామచంద్ర రావు**

సంపుటి 8 - సంచిక 10
**ఫిబ్రవరి 2008**
సర్వజిత్ పుష్యం-మాఘం
**విడిప్రతి రూ॥ 8.00**
**సం॥ చందా రూ॥ 90**
**3 సం॥ చందా రూ॥ 250**
**10 సం॥ చందా రూ॥ 750**
**శాశ్వత చందా రూ॥ 1800**

Please send drafts in favour of
**SRI VEDAMATA GAYATRI TRUST BUSINESS DIVISION, HYDERABAD**

సలహాలు, సూచనలకు :
శ్రీ అశ్విని సుబ్బారావు
040-23700722


## లోచూపు అలవరచుకుందాం

ఇతరులను గురించి తెలుసుకునే ముందు, ఇతరుల భావనలను పరిచయం చేసుకునే ముందు- వ్యక్తి తన గురించి మరింతగా తెలుసుకోవాలి. తన మనస్సు యొక్క భాషనూ, తన ఆకాంక్షలనూ భావనలనూ వ్యక్తి మరింత స్పష్టంగా తెలుసుకోగలుగుతాడు, వినగలుగుతాడు, పరిశీలించగలుగుతాడు. ఇతరులనూ, మొత్తం ప్రపంచాన్నీ మార్చడానికి ప్రయత్నించడంకన్న తనను తాను సంస్కరించుకోవడం సులువు. మనం మన అంతఃకరణను ఎంతగా సంస్కరించుకుంటే ఈ ప్రపంచం అంతగా సంస్కరించబడినట్లు మనకు కానవస్తుంది.

మనం అద్దంలో మన ముఖాన్ని చూస్తాము. దాని మురికిని తొలగించి, దాన్ని అందంగా తయారుచేస్తాము. మనస్సు సంతోషిస్తుంది. అంతఃకరణ కూడ ఒక ముఖమే. చేతన అనే అద్దంలో దాన్ని చూడాలి. పరిశీలించాలి. అప్పుడు దాని మురికీ, దాని అందమూ కానవస్తాయి. దాని లోపాలను తొలగించాలి. మురికిని తొలగించాలి. ఆత్మ పరీక్ష జరపాలి. ఈ క్షాళన ద్వారా ఆత్మ సౌందర్యాన్ని వెలికితీయడమే నిజమైన ఉపాసన. మురికి అంతా తొలగిపోయినప్పుడు ఉజ్వలమూ, స్వచ్ఛమూ, సుందరమూ అయిన ఆత్మ యొక్క స్వరూపం వెలికివస్తుంది. అప్పుడు అంతరంగంలో అంతా సత్ చిత్ ఆనంద మయంగా కానవస్తుంది.

మనల్ని మనం ప్రశ్నించుకోవాలి-మన ఆలోచనలు మురికిగా, మలినంగా ఉన్నాయా? మన మనస్సు కాముక భావనలకు వశం అవుతూన్నదా? ఇంద్రియాలనుండి జనించే వాసనలపట్ల మనకు వ్యామోహం ఉన్నదా? ఆ పరమసత్తా మన లోపల ఉన్నప్పటికీ- మనం భయపడుతున్నామా? ఈ ప్రశ్నలకు 'అవును' అనే సమాధానం వస్తే- మనం మన సంస్కరణకు నడుము బిగించాలి. వాస్తవానికి- మనల్ని మనం సంస్కరించుకోవడమే ప్రపంచానికి మహత్తర సేవ. పై ప్రశ్నలకు 'లేదు' అనే సమాధానం వచ్చిన రోజున ప్రపంచంలోని సుఖ శాంతులన్నీ మనకు వశం అవుతాయి.

★★★

అందరూ మానవాళిని మార్చగోరుతారు. తమను తాము మార్చుకోరు- టాల్‌స్టాయ్.

# విషయ సూచిక


**ముఖచిత్రం :** దక్షిణ రాష్ట్రాల కార్యశాల దృశ్యాలు

1. **సంపాదకీయం:**
   లోచూపు అలవరచుకుందాం 1
2. **విషయ సూచిక** 2
3. **సద్గురు వచనామృతం :**
   సాఫల్యానికి సోపానం శిష్టాచారం 2
4. **వేద మంత్రం:**
   సద్గుణాలవల్ల  సుఖ శాంతులు 3
5. **దక్షిణ రాష్ట్రాల కార్యశాల :** 4
6. **వసంతపంచమి వ్యాసం-1 :**
   సర్వసమర్పణ ద్వారా సంపాదించాను సిద్ధులు 13
7. **వసంతపంచమి వ్యాసం-2 :**
   కరుణాసముద్రులు పరమపూజ్య గురుదేవులు 16
8. **వసంతపంచమి వ్యాసం-3**
   వసంతపంచమి సందేశం : సర్వస్వ సమర్పణ 18
9. **ధారావాహిక : ప్రగతికి ప్రాతిపదిక ఆదర్శ కుటుంబం-12**
   స్వాధ్యానికి ప్రాధాన్యం 20
10. **తత్వచింతన :** ప్రతిపనీ కావాలి ప్రార్థన 22
11. **ఆచరణలో అధ్యాత్మ :** దైవత్వం నిండాలి మనిషిలో 24
12. **సాధన విజ్ఞానం :** సాధనలో ప్రాధాన్యం మనస్సుకు 25
13. **మనం- మన ఆరోగ్యం :**
   పంచతత్వాలతో చికిత్స-1 26
14. **ధారావాహిక : దేవసంస్కృతి సౌరభం-9**
   అంతటా దర్శించు ఆ పరమాత్మను 28
15. **ధారావాహిక : భక్తి గాథ-4**
   వక్తిత్వాన్ని అమృతమయంచేస్తుంది భక్తి 30
16. **ధారావాహిక : పతంజలి యోగదర్శనం-11**
   ధ్యానం 32
17. **ధారావాహిక : గాయత్రీ** మహావిజ్ఞానం-27
   సోహం సాధన 35
18. **ధారావాహిక : నా స్మృతిపథంలో గురుదేవులు-19**
   బత్తాయిరసం నాచేత త్రాగిస్తావా? 36
19. **ధారావాహిక : దివ్యజీవన దర్శనం-47**
   పవిత్రీకరణ ప్రక్రియ-3 39
20. **నావారితో నామాట : నాలుగేళ్లలో శతజయంతి-10**
   పరిశోధనల విస్తరణకు పథకం 45
21. **సద్గురు లీలామృతం** 47
22. **దేవసంస్కృతి విశ్వవిద్యాలయం :**
   హైదరాబాదు దూరవిద్యా కేంద్రంలో కోర్సులు 48


## సద్గురు వచనామృతం



### సాఫల్యానికి సోపానం శిష్టాచారం

వినమ్రతతో, మాధుర్యంతో, శిష్టతతో, సభ్యతతో కూడిన వ్యవహరణ మనిషిని సాఫల్యపు శిఖరాగ్రానికి చేర్చుతుంది. పేదవాడయినా మర్యాదా మన్ననలు కలిగిఉన్న విద్యార్థి యొక్క చదువు ఆగిపోదు. ఉద్యోగంలో శిష్టాచారం ఒకోసారి అర్హతలోని కొరతను పూరిస్తుంది. శిష్టాచారంతో సభ్యంగా వ్యవహరించే వ్యక్తికి సిఫార్సుల అవసరం ఉండదు. వినమ్రతా, మధుర వ్యవహరణా క్రూరాతిక్రూరుడైన శత్రువును సైతం జయిస్తాయి. సానుభూతీ, సహాయ సహకారాలూ శిష్టాచారవంతునికీ, శీలవంతునికీ వారసత్వంగా వచ్చిపడతాయి. ఇంటా బయటా, దేశ విదేశాలలో- ఎక్కడ ఉన్నా, వినమ్రత శిష్టాచారాలు మనిషికి ఆప్తమిత్రునిలా సాయపడతాయి. వినమ్రుడైన వ్యక్తి విరోధుల మధ్య సైతం తన మార్గాన్ని నిర్మించుకోగలుగుతాడు.

శిష్టాచారం, సభ్యత కలిగిన వ్యక్తి సహనశీలి అవుతాడు. శిష్టుడు ఇతరులపట్ల చెడ్డగా వ్యవహరించడు. ఎదటి వ్యక్తి తనపట్ల చెడ్డగా వ్యవహరించినా, అతడు అతిగా బాధపడడు. ప్రతీకారం తలపెట్టడు. కోపగించుకోడు. ఎదటి వ్యక్తి తనకు విరుద్ధంగా ప్రవర్తించినా, అతడి మనఃశాంతి చెక్కు చెదరదు. ప్రతీకారంగా దుష్ప్రవర్తనకు దిగకపోవడం ద్వారా తన వ్యతిరేకి సిగ్గుపడేటట్లుచేస్తాడు అతడు. శిష్టతకూ, సభ్యతకూ సంఘర్షణకర పరిస్థితులు ఎదురుకావడం బహు అరుదు.

★★★

**భగవన్నామాన్ని ఏ సమయంలో అయినా స్మరించవచ్చు- స్వామి చిదానంద.**

వేద మంత్రం

# సద్గుణాలవల్ల సుఖ శాంతులు

**గమ్భీరాం ఉదధీంరివ క్రతుం పుష్యసి గా ఇవ ।**
**ప్ర సుగోపా యవసం ధేనవో యథా హృదం కుల్యా ఇవాశత ॥**

**(ఋగ్వేదం 3/45/3)**

**భావార్థం:** సముద్రంతో సమానమైన గంభీర బుద్ధి, పృథ్వితో సమానమైన క్షమ, పాలనా సామర్థ్యం, గోసమానమైన దానగుణం, నది యొక్క నిరంతర ప్రవాహగుణం ఉన్నవారికే సంపూర్ణ సుఖం లభిస్తుంది.

**సందేశం:** నరుడి నుండి నారాయణుడుగా మారమని శాస్త్రాలు మనుష్యుణ్ణి ఆదేశించాయి. ఈ మార్గావలంబనతో ప్రపంచంలో సుఖం, శాంతి, సమృద్ధి కలుగుతాయి. కానీ నేడు నరుడు నరుడుగా అయినా లేడు. మనుష్యని మనుష్యత్వం మృతప్రాయమయింది. నలువైపులా హత్యలు, కొట్లాటలు, దొంగతనాలు. బలాత్కారాలు, దురాచారాలు మొదలైనవి కన్పిస్తాయి. మనుష్యులలో క్రోధం, క్షోభ, నైరాశ్యం పెరుగుతూ ఉన్నాయి.

కానీ మనుష్యుడు ఇంత అసహాయుడు కాడు. దేవత అయ్యేంత అపరిమిత శక్తి అతనిలో ఉన్నది. నేటి పరిస్థితులలో సఫలత లభించటంలో కొన్ని ఇబ్బందులు తప్పక ఉండవచ్చు. కానీ అతని ధ్యేయంలో, దృఢ నిశ్చయంలో ఏ లోటూ రాకూడదు. సాధనాలకంటే, పనిముట్ల కంటే, పరిస్థితుల కంటే మనుష్యని ఇచ్ఛాశక్తి గొప్పది. అతడు అనుకుంటే వీటన్నిటిని నిర్మించ గలడు, లేదా నిర్మించబడిఉన్నవాటిని నాశనం చేయగలడు. నారాయణుడు ఎక్కడో బయట నుండి రాడు. అతడు ప్రతి మనిషి అంతఃకరణలోనే ఉన్నాడు. మనం అటువైపు దృష్టిపెట్టటం లేదు. అటు చూడనే చూడము. ఆయన మాట వినిపించుకోము. ఇందువల్లననే మనం అసహాయులం అని అన్పిస్తుంది. నిరాశ, దుఃఖం అందుకే మనల్ని ఆవరిస్తాయి. పరమాత్మ మనుష్యనికి అపారశక్తి, దైవీ గుణాలు ఇచ్చినందున– అతడు ధీర, గంభీర, అవిచలిత భావంతో దాన, పరమార్థ కార్యాలు చేస్తూఉండటం అవసరం. మనం క్రియాశీలంగా ఉండాలి.

మన హృదయంలో దేవత్వాన్ని స్థాపించుకోవటానికై మనస్సు, బుద్ధి, అహంకారాలకు తగిన అభ్యాసం అవసరం. గుర్రానికి కళ్ళెం ఉండాలి, అది సారథి చేతిలో ఉండాలి. సారథి మహారథి ఆదేశాలను పొల్లుపోకుండా పాలించాలి. మానవ జీవనంలో మనసు సారథి వంటిది. సమస్త సుఖ దుఃఖాల, కల్పనల కర్తృత్వం మనస్సుకు చెందుతుంది. అదే మనుష్యని పెంచుతుంది, త్రుంచుతుంది.

అటువంటి స్వేచ్ఛాచారియైన మనస్సుకు అభ్యాసం అవసరం. దానికి మంచి విషయాలు రుచించటం మొదలైతే, అది చెడు వైపు వెళ్ళదు. మంచి ఆలోచనలతో నిండిపోతే, చెడుకు తావుండదు; సద్గుణాలు, సత్ప్రవృత్తులు వృద్ధి అవుతాయి.

వ్యక్తిలో, సమాజంలో దేవత్వ భావన వికసించటానికై, జీవన విలువలను అంగీకరించటం తప్పనిసరి. జీవన మూల్యాలు పరమేశ్వరుని చేరుకొనే సోపానాలు. మానవత్వానికి గీటురాయి సజ్జనత్త్వపు మూలతత్వము. మానవోన్నతికి ఇదే మూలాధారం. మానవత్వం, పశుత్వాల మధ్యనున్న విభజన రేఖయే జీవన మూల్యం అని అనవచ్చు. మహాత్ముల అడుగుజాడలలో నడచి శ్రద్ధ, యజ్ఞం, తపం, దయ, దానం, అహింస, క్షమ, త్యాగం, మృదుత్వం, ఉదారత, తేజస్సు వంటి అనేకానేక సద్గుణాలను అలవరచుకుంటే– సర్వత్రా సుఖం, శాంతి సంభవమే.

దేవతల ప్రవర్తన నుండి ఈ అమూల్య ఆదర్శాలను స్వీకరించటానికి ప్రయత్నించాలి.

★★★

ధనగర్వాన్నీ, విద్యాగర్వాన్నీ, బలదర్పాన్నీ పెరుగనివ్వకు.

# కార్యకర్తలకు కాయకల్ప చికిత్స
## మారుమ్రోగిన శంఖారావం : గాయత్రీప్రదేశ్‌గా ఆంధ్రప్రదేశ్
# చరిత్రను సృష్టించిన హైదరాబాదు కార్యశాల
## మండలవారీ లక్ష్యాలు : అమలుకు కార్యాచరణ పథకాలు

***కురుస్తోంది నాపై గులాబీల వాన.***
***పరవశిస్తోంది నా హృదయం.***
***ఇనుమడిస్తోంది నా కార్యదీక్ష.***

–ఇవీ ప్రతి కార్యకర్త మదిలో మెదలిన భావాలు. హైదరాబాదు కార్యశాల ముగింపు సమావేశంలో ఆదరణీయ డాక్టర్ ప్రణవ్ పండ్యాజీతో సహా శాంతికుంజ్ వరిష్ఠ ప్రతినిధులు వీడ్కోలుగా కార్యకర్తలపై గులాబీలు చల్లుతూన్న శుభవేళ అది. మరపురాని మహత్తర దృశ్యం అది. యుగ పరివర్తనపట్ల కార్యకర్తల విశ్వాసం మరింత దృఢమై, మరింత గాఢమై కార్యదీక్షగా పరిణమించిన పావన ముహూర్తం అది.

### ఉత్తేజపరచిన ఉద్బోధ

2007 డిసెంబరు 22,23,24 తేదీలలో హైదరాబాదులో దక్షిణ జోన్‌లోని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల గాయత్రీ పరివార్ కార్యకర్తల కార్యశాల జరిగింది. 1500 మంది పాల్గొన్నారు.

కార్యశాల వేదికకు ఇరువైపులా అమర్చబడిన స్క్రీన్‌లపై హిందీ, తెలుగు భాషలలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వబడింది.

ఆదరణీయ డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ, శ్రీ గౌరీశంకర శర్మజీ, డాక్టర్ బ్రిజ్‌మోహన్ గౌర్‌జీలు దీప ప్రజ్వలన చేసి, గురుసత్తా చరణాలకు పుష్పాలు సమర్పించడంతో 22 మధ్యాహ్నం కార్యశాల ప్రారంభమయింది. శాంతికుంజ్ వరిష్ఠ ప్రతినిధులను శ్రీ అశ్విని సుబ్బారావు, శ్రీ హనుమంతరావు, శ్రీ మార్నెళ్ల విశ్వనాథ ప్రసాద్‌లు పూలమాలలతో స్వాగతించారు. శ్రీ కాళీచరణ శర్మ కార్యక్రమాలకు ప్రయోక్తగా వ్యవహరించారు. విప్లవ స్ఫూర్తితో నిండిన ప్రజ్ఞాగీతాన్ని శాంతికుంజ్ నుండి వచ్చిన యుగ గాయకులు శ్రీ గోవింద పాటీదార్, శ్రీ ఓంకార్ పాటీదార్, శ్రీ వసంత్ యాదవ్‌లు ఆలాపించారు.

మొదటి సమావేశంలో చేసిన ప్రారంభోపన్యాసంలో ఆదరణీయ డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ "మహోద్యమం యొక్క విరాట్ యాత్ర–మన అదృష్టం, మన కర్తవ్యం" అనే అంశంపై ఉద్బోధ చేశారు. కార్యకర్తలకు అక్షయ స్ఫూర్తిని ప్రసాదించారు.

### శ్రీ వీరేశ్వర ఉపాధ్యాయజీ మార్గదర్శనం

సాయంత్రం జరిగిన సమావేశంలో ఆదరణీయ శ్రీ వీరేశ్వర ఉపాధ్యాయజీ "సాధనపై ఆధారపడిన సంస్థ మన దేవ కుటుంబం" అనే విషయంలోని ఆధ్యాత్మిక, దార్శనిక, వ్యావహారిక సూత్రాలను ఎంతో హృదయంగమంగా వివరించారు. అనంతరం శ్రీ కాళీచరణ శర్మజీ "సృజన శిల్పులు అనుసరించవలసిన సూత్రాలు" అనే విషయంపై కార్యకర్తలకు చక్కని మార్గదర్శనం చేశారు.

ఆ రోజు ఉదయం ఆదరణీయ డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ గాయత్రీ చేతనా కేంద్రంలో పత్రికా విలేఖరులను ఉద్దేశించి ప్రసంగించారు.

### సూక్ష్మ శక్తుల అనుభూతి

23 ఉదయం 6 నుండి 7 గంIIల వరకు ధ్యానం, ఆదరణీయ డాక్టర్ ప్రణవ పండ్యాజీ మంగళ ప్రవచనం జరిగాయి. తెరమీద ధ్యానం వీడియో సాగింది. కార్యకర్తలకు శాంతికుంజ్, దేవాత్మ హిమాలయముల సూక్ష్మ శక్తుల అనుభూతి కలిగింది. డాక్టర్ గారు దిగువ పది విధములైన ధ్యానములను పేర్కొని, వాటిని చేయడంలో తీసుకోవలసిన మెలకువలను వివరించారు–

అందరినీ గౌరవించు; ఎవ్వరినీ ఆరాధించకు- ఐన్‌స్టీన్.

1. స్వసంకేత ధ్యానం. 2. ఉదయిస్తున్న సూర్యునిపై ధ్యానం. 3. జ్యోతి అవతరణ ధ్యానం. 4. హిమాలయాలపై ధ్యానం. 5. దర్పణం ఎదుట ధ్యానం. 6. ఓంకార ధ్యానం. 7. శాసపై ధ్యానం. 8. నాదయోగ సాధన. 9. ఇష్టదైవ ధ్యానం. 10. శాంతికుంజ్‌ను మానసికంగా దర్శించే ధ్యానం.

అనంతరం డాక్టర్ గారిని కార్యకర్తలు బృందాలుగా కలుసుకున్నారు.

## విశ్వవిద్యాలయ అద్భుత ప్రగతి

ఆ తర్వాత డాక్టరు గారు "మన దేవసంస్కృతి విశ్వవిద్యాలయం- విజయాలు, భావి పథకాలు" అనే విషయంపై ప్రసంగించారు. అనంతరం విశ్వవిద్యాలయంపై వీడియో ప్రదర్శించబడింది. శ్రీ సుభాష్ శర్మ (చెన్నై), శ్రీ జి. గణేశ్ (విశాఖపట్టణం)లతో సహా పదిమంది కార్యకర్తలు విశ్వవిద్యాలయానికి విరాళాలను ప్రకటించారు. అనంతరం ప్రశ్నలు-సమాధానాల కార్యక్రమం జరిగింది.

## కార్యయోజనపై సామూహిక చర్చలు

అనంతరం దిగువ అంశంపై సామూహిక చర్చలు జరిగాయి- దక్షిణ భారతంలో యుగాంతర చేతనను విస్తరింపజేయడానికై తీసుకోవలసిన కార్యక్రమాలు- 1. గాయత్రి, యజ్ఞముల ప్రసారం. 2. దక్షిణ రాష్ట్రాలలో యుగ సాహిత్య ప్రచురణ, ప్రచారం. 3. కుల తత్వాన్ని, గ్రుడ్డి నమ్మకాలనూ నిర్మూలించడం. 4. కార్యకర్తల శిక్షణ శిబిరాల ఏర్పాటు.

నాటి మధ్యాహ్నం శ్రీ హెచ్.వి.సింగ్‌జీ అర్థానుశాసనంపై ప్రసంగించారు. ఆ తర్వాత సమూహిక చర్చలు జరిగాయి. మూడు నెలల, ఆరునెలల, సంవత్సరం కార్యయోజనలపై విస్తృతమైన ఆలోచనా మథనం జరిగింది. దేవస్థాపన, పత్రికకు చందాదారులను చేర్పించడం, ప్రజ్ఞా/ మహిళా మండలుల స్థాపన, శిక్షణ శిబిరాల ఏర్పాటు మున్నగు అంశాలు ఆ యోజనలలో ఇమిడిఉన్నాయి.

చర్చలలో తెలంగాణా గ్రూపునకు శ్రీయుతులు పరమానంద ద్వివేది, హనుమంతరెడ్డి, రాజు ఆరసే మార్గదర్శనం చేశారు. గుంటూరు మండలం గ్రూపునకు శ్రీ ఉమేశ్ శర్మ, ప్రొఫెసర్ మారెళ్ల శ్రీరామకృష్ణ, శ్రీ తోషణ్ సాహు మార్గదర్శనం చేశారు. హైదరాబాదు మండలం గ్రూపునకు డాక్టర్ తుమ్మూరి, శ్రీమతి ఉషా జయస్వాల్ మార్గదర్శనం చేశారు. కోస్తా రాయలసీమ మండలం గ్రూపునకు డాక్టర్ బ్రిజ్‌మోహన్ గౌడ్‌జీ, శ్రీమతి ప్రశాంతి శర్మ మార్గదర్శనం చేశారు. తమిళనాడు, కేరళ గ్రూపునకు శాంతికుంజ్ ప్రతినిధులు శ్రీయుతులు పీయూష్ రస్తోగి, జయరామ్ మోట్లానీ, బిందేశ్వర ప్రసాద్, ఋషభ్‌సింహ్ మార్గదర్శనం చేశారు. కర్ణాటక గ్రూపునకు శ్రీయుతులు ఉత్తమ్ గాయక్వాడ్, రాకేశ్‌రావ్‌లు మార్గదర్శనం చేశారు.

## సంజీవని విద్యపై వీడియో ప్రదర్శనం

అనంతరం డాక్టర్ బ్రిజ్‌మోహన్ గౌడ్‌జీ "సమయదానమే యుగ ధర్మం" అనే విషయంపై ప్రసంగించారు. కార్యకర్తలకు సమయదానం ఫారమ్‌లు నింపడానికై పంచబడ్డాయి. శ్రీ వీరేశ్వర ఉపాధ్యాయజీ "గాయత్రీ మహావిద్య, విద్యావిస్తార సంవత్సరం, మన కర్తవ్యం" అనే విషయంపై ప్రసంగించారు. సంజీవని విద్యపై తెలుగు వీడియో సి.డి. ప్రదర్శించబడింది.

## ప్రొ॥ శ్రీరామకృష్ణ, డా॥ తుమ్మూరి, శ్రీ అశ్విని సుబ్బారావుల దిశానిర్దేశం

24 ఉదయం 6 గంటలకు కార్యకర్తలు మూడు శరీరాలపై విశేష ధ్యానం చేశారు. అనంతరం ఆదరణీయ శ్రీ గౌరీశంకర శర్మజీ "మీనుండి శాంతికుంజ్ ఆశిస్తున్నవి" అనే విషయపై ప్రసంగించారు. ప్రొఫెసర్ మారెళ్ల శ్రీరామకృష్ణ, డాక్టర్ తుమ్మూరి ప్రజ్ఞా / మహిళా మండలుల రూపురేఖల పై ప్రసంగించారు. శ్రీ అశ్విని సుబ్బారావు యుగ సాహిత్యంపై ప్రసంగించారు.

అనంతరం ఆదరణీయ డాక్టరు గారు "యుగనిర్మాణ ఉద్యమం-సృజన శిల్పులకు వీడ్కోలు" అనే విషయంపై ప్రసంగించారు.

## అనువాదకులకు సన్మానం

అనంతరం ఆదరణీయ డాక్టర్ సాహబ్ అనువాదకులను గాయత్రి మంత్రం కండువాలతో సత్కరించారు. వారికి ఆడియో, వీడియో సిడి సెట్‌లను

ఆరోగ్యంగా ఉన్నప్పుడే పురుషార్థాలను సాధించగలవు -స్కంద పురాణం.

బహూకరించారు. సత్కరించబడిన అనువాదకులు– ప్రొఫెసర్ మారెళ్ల శ్రీరాకృష్ణ, డాక్టర్ తుమ్మూరి, శ్రీ కె.రామచంద్ర రావు, శ్రీ డి.వి.ఆర్.మూర్తి, శ్రీ వి. సత్యనారాయణ గుప్త, శ్రీ బాసంగి శ్రీరాములు, శ్రీ సి.వి.శ్యామల రావు, శ్రీ పరుచూరు నాగేశ్వర రావు, శ్రీమతి కె. అరవిందమ్మ, శ్రీమతి పి.హైమవతీ శాస్త్రి, శ్రీమతి ప్రశాంతి శర్మ, శ్రీమతి ఉషా జయస్వాల్.

## కార్యకర్తలపై గులాబీల జల్లు

ఆ తర్వాత శాంతికుంజ్ ప్రతినిధులు పూర్ణ సమయదానులకూ, దేవసంస్కృతి విశ్వవిద్యాలయాలనికి ఉపకార వేతనాలను దానం చేసినవారికీ సన్మానం చేశారు. అనంతరం శ్రీ అశ్విని సుబ్బారావు కార్యశాల విజయానికి సహకరించినవారందరికీ ధన్యవాదాలు తెలిపారు. శాంతికుంజ్ వరిష్ఠ ప్రతినిధులకు కండువాలతో సత్కారం జరిగింది. శాంతికుంజ్ ప్రతినిధులు కార్యకర్తల వరుసల మధ్యకు వచ్చి, వారిపై గులాబీల వర్షం కురిపించారు. శాంతిపాఠం, జయఘోషలతో కార్యశాల జయప్రదంగా సమాప్తమయింది.

## ఉజ్వల అధ్యాయానికి శ్రీకారం

హైదరాబాదు కార్యశాల దిగ్విజయం రాష్ట్ర గాయత్రీ పరివార్ చరిత్రలో నూతన అధ్యాయానికి, ఉజ్వల అధ్యాయానికి నాంది పలికింది. ఎందుకంటే– కార్యశాల ద్వారా కార్యకర్తలలో సిద్ధాంతంపై, కార్య ప్రణాళికపై లోతయిన అవగాహన ఏర్పడింది. మూడు రోజుల నిర్విరామ మథనం వారిలో భావనాత్మకమైన నవోత్తేజాన్ని రగిలించింది. శాంతికుంజ్ వరిష్ఠ ప్రతినిధుల విశిష్ట మార్గదర్శనం వారిలోని ఆదర్శవాదానికీ, కర్తవ్య నిష్ఠకూ పదునుపెట్టింది. సామూహిక చర్యల సారంగా మండల స్థాయిలో నిర్దిష్ట లక్ష్యాలు రూపుదిద్దుకోవడంతో– ప్రతి కార్యకర్తయొక్క మనో ఫలకాలపై తన కర్తవ్యపు విస్పష్ట చిత్రం ముద్రించబడింది. ఫలితంగా– మిషన్ కార్యం "టేక్ ఆఫ్" దశను చేరుకున్నది. ఇక– వాయువేగ మనోవేగాలతో పురోగమనం నిశ్చయం.

★★★

## "మా జీవితాలు ధన్యమైనాయి" కార్యకర్తల అనుభూతులు

ముగింపు సమావేశంలో కార్యకర్తలు తమ అనుభూతులను ఇలా వ్యక్తం చేశారు–

### శ్రీమారెళ్ల విశ్వనాథ ప్రసాద్

నా విజయమంతా గురుదేవులు, మాతాజీల చలవే. అందుకు రెండు ఉదాహరణలు చూపుతాను. (1). మా నాన్నగారి లెక్చరర్ ఉద్యోగానికి ఎక్స్‌టెన్షన్ రావడం గురుదేవుల మహిమయే. ఆరోజుల్లో ఎవ్వరికీ ఇవ్వబడలేదు ఎక్స్‌టెన్షన్. (2). నేను న్యాయవాది వృత్తిని నిర్వహిస్తూ అధ్యాపకునిగా కూడ పనిచేశాను. అధ్యాపక వృత్తిని వదిలివేయమని మాతాజీ అన్నారు. నేను ఆ మాట వినలేదు. చివరికి– తప్పనిసరి పరిస్థితులలో నేను ఆ వృత్తిని వదిలి న్యాయవాద వృత్తికే పరిమితం కావలసివచ్చింది.

నేను మిషన్‌కు సేవకుణ్ణి, వర్కరును. మనమంతా మిషన్‌కు సైనికులుగా పనిచేద్దాం.

### శ్రీ పేరిశాస్త్రి

కార్యశాల కోసం జరిగిన విస్తృతమైన ఏర్పాటుకు ఎంతో ఆనందం కలుగుతోంది. 'కార్యశాలలో పాల్గొనడంతో నా జన్మ ధన్యమయింది'– అని కార్యకర్తలందరూ అనుభూతిపొందుతున్నారు. నా జీవితంలో మరో దివ్య అనుభూతి– ఉదయిస్తున్న సూర్యునిలో నేను గురుదేవులను చూచాను. మనం ఇకనుంచి జీవితాన్ని ఏదోవిధంగా గడపవద్దు. జీవితాన్ని నిజంగా జీవిద్దాం. మనలో ప్రతి ఒక్కరూ యుగ సాహిత్యాన్ని తమతో తీసుకువెళ్లాలి.

### శ్రీమతి రాజ్యలక్ష్మి

శాంతికుంజ్ శిబిరంలో పాల్గొంటున్న అనుభూతి కలిగింది నాకీ కార్యశాలలో పాల్గొనడంలో. రాష్ట్రంలోని 30,000 గ్రామాలలోనూ యుగ సాహిత్యాన్ని ప్రసారం చేద్దాం.

### శ్రీమతి విజయశ్రీ

మనమంతా ఈ మూడు రోజులూ పూర్తిగా కుటుంబ వాతావరణంలో గడిపాము. శాంతికుంజ్ అంతా ఇక్కడికి తరలివచ్చింది. గురుదేవుల ఆత్మకథ చదివినప్పుడు కలిగిన ప్రేరణ నన్ను కార్యకర్తగా చేసింది. మనమంతా ఇకనుంచి పూర్తి సమయాన్ని ఇచ్చి పనిచేద్దాం. మరొక అనుభవం– తొర్రూరు యజ్ఞంకోసం మేము 20 గ్రామాలలో పర్యటించాము. ఆ యజ్ఞంలో 6000 మంది పాల్గొన్నారు. ప్రజలనుండి వచ్చిన స్పందన అద్భుతం, అపూర్వం.

ఒక్క ప్రాణికి ఉపకారంచేసినా, అది మాధవ సేవయే -స్వామి విద్యాప్రకాశానంద.

# శతజయంతి లక్ష్యాలు : కార్యకర్తల కర్తవ్యం
## ఆదరణీయ డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ ఉద్బోధ

కార్యశాల స్వాగతోపన్యాసంలో ఆదరణీయ డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ ఇలా ఉద్బోధించారు-

యుగ నిర్మాణ ఉద్యమం అనే విరాట్ మహోద్యమాన్ని 1953 గాయత్రి రోజున యుగఋషి మధురలోని గాయత్రీ తపోభూమిలో ప్రారంభించారు. పూజ్యవరుల మాటలలో- గత వైభవాన్ని తిరిగి తీసుకువచ్చే భగీరథ ప్రయత్నం ఆ ఉద్యమం; ఆత్మీయత ఆధారంగా నిర్మాణమైన సాధకుల సంస్థ గాయత్రీ పరివార్.

### 21వ శతాబ్దం-ఉజ్వల భవిష్యత్తు

పరివర్తన మహోత్సవం ఇది. ఉజ్వల భవిష్యత్తు మహాకాలుని ప్రేరణ; పరమేశ్వరుని ఇచ్ఛ; సమయపు పిలుపు; యుగధర్మం యొక్క పాంచజన్య శంఖారావం.

### రామకృష్ణ పరమహంస ప్రకటన

"నేను మరోమారు వాయవ్య దిశలో జన్మఎత్తవలసి వస్తుంది"- అని శ్రీరామకృష్ణ పరమహంస ప్రకటించారు. కలకత్తానుండి వాయవ్య దిశగా ఒక రేఖ గీస్తే, ఆ రేఖమీద ఆవల్‌ఖేడా ఉంటుంది. వారే పరమపూజ్య గురుదేవులుగా ఆవల్‌ఖేడాలో అవతరించారన్న సంకేతం ఆ మాటలలో ఇమిడి ఉంది.

"మా గురుదేవుల కృప ఉంటే, ఒకరేమిటి లక్షలమంది వివేకానందులు ఉద్భవిస్తారు"- అని స్వామి వివేకానంద అన్నారు. నేడుకూడ ఆ సత్తాయే మనమధ్య ఉన్నది.

### స్వామి వివేకానంద భవిష్యవాణి

స్వామి వివేకానంద వివిధ సందర్భాలలో ఇలా అన్నారు-

"50 సంవత్సరాలలో ఒక మహా ప్రవక్త, ఒక దివ్య ఆత్మ అవతరిస్తారు. ప్రచండమైన సంకల్ప బలం కలిగి ఉంటారు ఆయన. మహాశక్తివంతమైన ఒక సంస్థను ఆయన స్థాపిస్తారు. ఆ సంస్థ వంద సంవత్సరాలలో అత్యంత బలీయం అవుతుంది." (1898లో)

"ఎలుకలు సైతం ధైర్యం కలిగిఉండే తరుణం వస్తుంది. సామాన్యంగా కనిపించే వ్యక్తులు సైతం సంఘటితులై అద్భుత కార్యాలను నిర్వహిస్తారు; నవయుగ ఆవిర్భావానికి నాంది పలుకుతారు."

"కృతయుగ ప్రారంభంలో బ్రాహ్మణ వర్ణం ఒక్కటే ఉండేది. రానున్న కృతయుగంలో అన్ని వర్ణాలూ తిరిగి బ్రాహ్మణ వర్ణంలోకి మారుతాయి."

"భారతదేశ భవిష్యత్తు ఉజ్వలం కావాలంటే, చెల్లా చెదరై ఉన్న ప్రజల సంకల్ప బలాన్ని సమీకరించి సమైక్యపరచే ఒక సంస్థ నిర్మాణం కావాలి."

"సంఘ సంస్కర్తలకూ, అధ్యాత్మవేత్తలకూ, తత్వవేత్తలకూ శిక్షణను ఇచ్చే ఒక సంస్థ వచ్చే వంద సంవత్సరాలలో ఆవిర్భవిస్తుంది. తద్వారా దేశమంతటిలో జ్ఞాన మందిరాల స్థాపన జరుగుతుంది. అవి భౌతిక, ఆధ్యాత్మిక జ్ఞానాలను ప్రసారం చేస్తాయి. యుగ పరివర్తన యోజన అవుతుంది అది." (1898లో)

స్వామీజీ యొక్క ఈ భవిష్యవాణి యుగ నిర్మాణ ఉద్యమ ఆవిర్భావాన్ని స్పష్టంగా సూచిస్తోంది.

### శ్రీ అరవిందుల భవిష్య వాణి

యోగి శ్రీ అరవిందులు ఇలా ప్రకటించారు-

"విశిష్ట సమయాలలో విశిష్టమైన విప్లవాలు జరుగుతాయి. అప్పుడు భగవత్ శక్తి అవతరిస్తుంది. అది తన అత్యద్భుత శక్తితో మానవుల అంచనాలన్నింటినీ తారుమారు చేస్తుంది."

"శాస్త్ర విజ్ఞానం, మేధస్సు అలాంటి విప్లవాలను గుర్తించలేవు. కొన్ని సమయాలలో మనం భగవంతుని ఉనికిని అనుభూతిచెందుతాము. పరమేశ్వరుడే ఆ నాయకుడు. ఆయన తన లక్ష్యాలను సాధిస్తాడు- ఆయన ఉపయోగించే సాధనాలను గుర్తించడం మానవమాత్రులకు అసాధ్యం అయినా."

**ధర్మాన్ని తెలుసుకుంటే చాలదు. దాన్ని ఆచరిస్తేనే ఫలితం లభిస్తుంది.**

"భారతదేశంలో రెండు మహామంత్రాలు ఉన్నాయి. ఒకటి వందేమాతరం. మాతృభూమి కోసం మేలుకొన్న జాగృత ఆత్మల సామూహిక శంఖారావం అది. రెండవది మరింత రహస్యమైనది, నిగూఢమైనది. అది ఇంకా బహిర్గతం కాలేదు."

ఈ మంత్రం గాయత్రీ మహామంత్రమా?

"గమనించండి. అవతారాలు దిగివస్తున్నాయి. మహాపురుషులు జన్మిస్తున్నారు ఒకరి తర్వాత ఒకరు. కృతయుగ సంస్థాపన కోసమై ఒక మహా అవతారం దిగివస్తున్న లక్షణాలు కావా ఇవన్నీ?"

శ్రీ అరవిందులు ఈ భవిష్యవాణి ద్వారా యుగ పరివర్తననూ, కృతయుగ సంస్థాపననూ స్పష్టంగా సూచిస్తున్నారు.

పరమపూజ్య గురుదేవులు ఇలా వ్రాశారు-

"సాధకులూ, తాపసులూ బ్రహ్మముహూర్తంలో మేలుకుంటారు. సాధన చేస్తారు. ప్రాపంచిక సుఖాలలో మునిగిన వ్యక్తులు ఆ సమయంలో గాఢ నిద్రలో ఉంటారు. ఈ రోజుల్లో 21 శతాబ్దపు బ్రహ్మ ముహూర్తం నడుస్తోంది."

యుగం మారుతూన్నదని భవిష్యవేత్తలూ, అతీంద్రియ శక్తి కలిగిన మహనీయులూ, వైజ్ఞానికులూ అందరూ ఒకే స్వరంతో ప్రకటిస్తున్నారు. విశ్వమంతటిలో పరివర్తన వస్తోంది. వచ్చే పదిహేను సంవత్సరాలలో భారతదేశం అగ్ర రాజ్యంగా ఆవిర్భవిస్తుంది.

## మహత్తర కార్యాలు మూడు

మనం ఒక వాస్తవాన్ని గుర్తించాలి. ఒక సామూహిక ఉద్యమంతో కాక- మనం సాక్షాత్తు భగవానునితో, అవతార చేతనతో ముడిపడి ఉన్నాము.

పరమపూజ్య గురుదేవులు ఇలా ప్రకటించారు-

"స్వరాజ్య ఉద్యమంకన్న ఎన్నో రెట్లు పెద్దదయిన కార్యం ఇది- వ్యక్తి వ్యక్తిలో దేవత్వ ఆవిర్భావం, భువిపై దివి అవతరణ."

"మహా విప్లవాలు సృజన కోసం, సంతులనం కోసం మాత్రమే వస్తాయి."

"మనం చేయవలసిన పనులు మూడు-

1. దుర్బుద్ధిని సరిదిద్దడం- భావ విప్లవం.
2. ప్రజలలో సద్భావాలను మేలుకొలపడం. సంకుచితత్వాన్ని నిర్మూలించడం. సమయదానం-అంశదానం.
3. చీకటిని వెలుగుగా మార్చడంకోసం దీపయజ్ఞం.

## కార్యశాల విశేషాలు

❖ కార్యశాలలో ఆదరణీయ డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ ప్రజ్ఞా పురాణం నాలుగు భాగాలను ఆవిష్కరించారు. వాటిని అనువదించినవారు శ్రీమతి నేమాని గౌరీసావిత్రి.

❖ కార్యశాలలో శ్రీ అశ్విని సుబ్బారావు తమ లఘు ప్రసంగాలలో తాము మిషన్‌లో ఎలా చేరిందీ వివరించారు. ప్రజ్ఞా పురాణం కథలు రెండు వినిపించారు. డాక్టర్ సాహబ్‌తో తమ అనుభవాలను వర్ణించారు. ఇవన్నీ కార్యకర్తలను విశేషంగా ఆకట్టుకున్నాయి.

❖ ప్రొఫెసర్ మారెళ్ల శ్రీరామకృష్ణ గారి లఘు ప్రసంగాలలో వారి హృదయాంతరాళంలోని అనుభూతీ, ఆవేదనా సూటిగా స్పష్టంగా, వాడిగా వేడిగా దూసుకువచ్చి, కార్యకర్తల హృదయాలను కరదిలించాయి.

❖ హైకోర్టు న్యాయవాది శ్రీ మారెళ్ల విశ్వనాథ ప్రసాద్ గారు కార్యశాలలో కార్యకర్తలకు భోజనాలు ఏర్పాటు చేశారు. కూకట్‌పల్లి మునిసిపాలిటీ మాజీ చైర్మన్ శ్రీ హనుమంతరావు తమ విద్యాలయ సముదాయాన్ని కార్యశాల నిర్వహణకు ఇచ్చారు. వీరిద్దరి సహకారం కార్యశాల విజయానికి ఎంతగానో దోహదపడింది.

❖ శాంతికుంజ్ వరిష్ఠ ప్రతినిధుల ప్రసంగాలకు శ్రీమతి ప్రశాంతి శర్మ చేసిన అనువాదం సాఫీగా, సరళంగా సాగి, హిందీ భాష అర్థంకాని కార్యకర్తలకు ఎంతో ఉపకరించింది.

❖ కార్యశాలలో శ్రీమతి అనసూయమ్మ, శ్రీ వెంకటనారాయణ పాడిన తెలుగు పాటలు కార్యకర్తలను మంత్రముగ్ధులను చేశాయి.

❖ కార్యశాల జరిగేనాటికి 1008 ప్రజ్ఞామండలుల స్థాపన లక్ష్యం కాగా- 1004 ప్రజ్ఞామండలులు అప్పటికి స్థాపించబడడం విశేషం.

❖ కార్యశాలలో కార్యకర్తలు లక్ష రూపాయలు విలువ చేసే యుగ సాహిత్యాన్ని కొనుగోలుచేయడం మరో విశేషం.

❖ ఒక మహిళా కార్యకర్త వీల్‌చైర్‌లో వచ్చి కార్యశాలలో పాల్గొనడం కార్యకర్తల కర్తవ్య నిష్ఠకు మచ్చుతునక.

బలహీనులు బలవంతులతో విరోధం పెంచుకోకూడదు -విదురుడు.

## మనం సాధించిన విజయాలు

- ❖ గాయత్రీ మహావిద్యయొక్క పునరుద్ధరణ, దాన్ని అందరికీ అందించడం.
- ❖ యజ్ఞం ఒక ఉద్యమం అయింది. యజ్ఞమయ జీవనం ప్రారంభమయింది.
- ❖ జీవించే కళగా ఆధ్యాత్మిక సంజీవనీ విద్యను ప్రతిష్ఠించడం.
- ❖ సమయదానాన్ని యుగధర్మంగా రూపొందించడం.
- ❖ మూలసూత్రాలుగా ఏకత, సమత, మమత, శుచిత.
- ❖ సంఘటిత శక్తి అనే దుర్గామాత ఆవిర్భావం.
- ❖ సామూహిక సాధనను జనమానసంలో ప్రతిష్ఠించడం.
- ❖ వైజ్ఞానిక అధ్యాత్మికవాదం ద్వారా మేధావి వర్గాన్ని ప్రభావితం చేయడం.
- ❖ అశ్వమేధ యజ్ఞాల నిర్వహణ.
- ❖ దేశమంతటికీ మిషన్ పని విస్తరణ.
- ❖ అంతర్జాతీయ స్థాయిలో శక్తివంతమైన సంస్థగా మిషన్‌కు గుర్తింపు.
- ❖ నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాల స్థాయిలో దేవసంస్కృతి విశ్వవిద్యాలయ వికాసం.
- ❖ జోనల్ స్థాయిలో సంస్థ వికేంద్రీకరణ. హైదరావాదులో 2006 ఫిబ్రవరిలో దక్షిణ భారత జోనల్ కేంద్ర స్థాపన.
- ❖ 16 స్థలాలలో జోనల్ కార్యశాలల నిర్వహణ. హైదరాబాదు కార్యశాల 17వది.
- ❖ ఉద్యమ బృందాల ద్వారా వివిధ స్థలాలలో సప్త ఉద్యమాలను వేగవంతంచేయడం.

## కోతకు వచ్చింది పంట

పూజ్య గురుదేవులు కొత్తరంగంలో బాధ్యతను స్వీకరించారు. ఇక ప్రజలను మేలుకొలపడమే పరిజనుల బాధ్యత. పంట కాపునకు వచ్చింది. ఈ సమయాన్ని జారవిడుచుకోకండి.

### హైదరాబాదు కార్యశాల నిర్ణయాలు

**కార్యశాలలో కార్యకర్తల సామూహిక చర్చల ఫలితంగా ఆయా మండలాలలో జరిగిన నిర్ణయాలు**

| విషయం | | మండలం | | |
|---|---|---|---|---|
| | | గుంటూరు | తెలంగాణా | కోస్తా, రాయలసీమ |
| పూర్ణ సమయదానులు సంఖ్య | | 7 | 6 | 5 |
| ఆరునెలల సమయదానుల సంఖ్య | | 5 | 15 | 3 |
| మూడునెలల సమయదానుల సంఖ్య | | 13 | 11 | 15 |
| నెల సమయదానుల సంఖ్య | | 60 | 75 | 35 |
| సాప్తాహిక సమయదానుల సంఖ్య | | 80 | 100 | 200 |
| యుగశక్తి గాయత్రి పత్రిక చందాదారుల పెంపుదల | | 2008 | 1055 | 2100 |
| ప్రజ్ఞా / మహిళా మండలులు | | 500 | 200 | 256 |
| సాహిత్య స్థాపన | రూ॥500/- | 10మంది | 20మంది | 10మంది |
| | రూ॥10,000/- | 5మంది | 5మంది | 6మంది |
| కార్యకర్తల శిక్షణ శిబిరాలు జరిగే స్థలాలు | | 5 | 10 | 12 |

**అందరినీ గ్రుడ్డిగా నమ్మకు. ఎవ్వరినీ నమ్మకుండా ఉండకు.**

## మన బాధ్యతలు

1. దేవసంస్కృతి విశ్వవిద్యాలయంనుండి ఉత్తీర్ణులై వచ్చే విద్యార్థుల ద్వారా యువజనులలో చైతన్యాన్ని రగిలించడం; పూర్ణ యోగ విస్తరణ. విద్యా విధానంలో విప్లవం.
2. ప్రపంచ భాషలలో యుగ సాహిత్య ప్రచురణ.
3. పరిశోధన పత్రాలను ప్రపంచంలోని పత్రికలలో ప్రచురింపజేయడం.
4. 108 జోనల్ కార్యాలయాల ద్వారా సంస్థయొక్క వికేంద్రీకరణ-విస్తరణ.

## శతజయంతికి మన లక్ష్యాలు

పూజ్య గురుదేవుల శతజయంతికి 1000 రోజులు మాత్రమే మిగిలిఉన్నాయి. అప్పటివరకు మన లక్ష్యాలు:

1. మన పత్రికల పాఠకుల సంఖ్యను పదిరెట్లు పెంచడం. ప్రస్తుతం ఈ సంఖ్య 12 లక్షలు.
2. వాతావరణం మొత్తాన్ని గాయత్రీమయం చేయడం.
3. బ్రహ్మవర్చస్ యొక్క పరిశోధన ప్రక్రియతో, దేవసంస్కృతి విశ్వవిద్యాలయంతో మేధావి వర్గాన్ని సన్నిహితం చేయడం.
4. దేశమంతటిలో యువజన మండలుల స్థాపన.
5. 4000 ప్రజ్ఞా సంస్థాన్‌లనూ, 108 జోనల్ ఉపజోనల్ కేంద్రాలనూ పటిష్టంచేయడం.
6. దేవసంస్కృతి విశ్వవిద్యాలయానికి 500 అనుబంధ కళాశాలల స్థాపన. దేశ విదేశాలలో దూరవిద్యా కేంద్రాల స్థాపన.
7. 15 మహానగరాలలో గాయత్రీ చేతనా కేంద్రాల స్థాపన.
8. అన్ని విశ్వవిద్యాలయాలలో, కళాశాలలలో పరమపూజ్య గురుదేవుల సాహిత్య స్థాపన.
9. డిజిటల్ బుక్-ఆడియో బుక్-వీడియో సిడి ద్వారా సంస్థ సందేశాన్ని వ్యక్తి వ్యక్తికీ అందించడం.
10. ఇంటర్నెట్-వెబ్‌సైట్‌ల ద్వారా ప్రసారం.
11. ప్రజ్ఞా చానల్ ద్వారా సాంస్కృతిక రంగంలో భావనాత్మక పరివర్తన.
12. ఉద్యమ బృందాల ద్వారా అన్ని ఉద్యమాలనూ వేగవంతం చేయడం.
13. ఇతర ప్రగతిశీల సంస్థలతో కలసి పనిచేయడం.
14. 100 దేశాలలో మిషన్ శాఖల స్థాపన.

## కార్యశాల సందర్భంగా విశేష కార్యక్రమాలు

2007 డిసెంబరు 23 సాయంత్రం హైదరాబాదు పబ్లిక్ గార్డెన్‌లోని జూబిలీ హాలులో జరిగిన ప్రముఖుల సమావేశంలో ఆదరణీయ డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ "మీ ప్రపంచాన్ని నిర్మించేది ఎవరు?" అనే విషయంపై ఉపన్యాసం ఇచ్చారు. కుటుంబ వ్యవస్థ దిగజారిపోతూన్నందుకు వారు విచారాన్ని వ్యక్తపరచారు. పరమేశ్వరుని శక్తిని గుర్తించవలసిందిగా వారు ఆహుతులకు విజ్ఞప్తి చేశారు. సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన గౌరవనీయ రాష్ట్ర గవర్నరు శ్రీ ఎన్.డి.తివారీజీ ఆదరణీయ డాక్టర్ సాహబ్‌కు పాదాభివందనం చేసిన తర్వాత వేదికపై తమ ఆసనాన్ని స్వీకరించారు. వారు గాయత్రీ పరివార్‌నూ, డాక్టర్ సాహబ్‌నూ వేనోళ్ల ప్రశంసించారు.

24వ తేదీ మధ్యాహ్నం రంగారెడ్డి జిల్లా బార్ ఎసోసియేషన్‌లో ఆదరణీయ డాక్టర్ సాహబ్ ప్రసంగించారు. మనం పదార్థవాదులము కాకూడదనీ, సంవేదనశీలురుగా, సహృదయులుగా ఉండాలనీ వారు హితవు చెప్పారు. కుటుంబ వ్యవస్థ యొక్క ప్రాముఖ్యాన్ని గుర్తించినప్పుడే మనిషి జీవితం సార్థకం అవుతుందని వారు సూచించారు. ఆ సమావేశంలో హైకోర్టు న్యాయవాది శ్రీ మారెళ్ల విశ్వనాథ ప్రసాద్ న్యాయవాదులకు యుగ సాహిత్యాన్ని బహూకరించారు.

15. 2011 ఫిబ్రవరి 8 (వసంత పంచమి)నుండి 2012 జనవరి 28 (వసంత పంచమి) వరకు దేశ విదేశాలలో విరాట్ కార్యక్రమాల నిర్వహణ.

## పూజ్య గురుదేవుల వాగ్దానం

పూజ్య గురుదేవులు ఇలా ప్రకటించి ఉన్నారు- "శాంతి కుంజ్‌ను నడిపించిన ఋషియుగ్మం తమ శరీరాలను విడిచిపెట్టిన తరవాత సైతం ఈ పుణ్యభూమిలో తమ అస్తిత్వాన్ని నిలిపిఉంచుతామని మాట ఇచ్చారు. తరువాతి స్థితిలో వారి సాధన తీవ్రతరం అవుతుంది."

## అవకాశాన్ని జారవిడుచుకోకండి

"మనిషి భవిష్యత్తు తీర్చి దిద్దబడుతోంది. కొన్ని వేల, లక్షల సంవత్సరాల తరువాత అటువంటి విలక్షణ సమయం మళ్ళీ వచ్చింది. ఈ అవకాశాన్ని వదులుకున్న వారు పశ్చాత్తాపపడకతప్పదు."

★★★

భయ దుఃఖాలను త్రెంచేది రామనామమనే ఖడ్గం -కంచర్ల గోపన్న.

# సమీపిస్తోంది లక్ష్యం : సర్వసమర్పణకు సమయం

## కార్యకర్తలకు డాక్టర్ సాహబ్ సందేశం

కార్యశాల వీడ్కోలు సమావేశంలో ఆదరణీయ డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ కార్యకర్తలకు పరమపూజ్య గురుదేవులు చేసిన మార్గదర్శనాన్ని గుర్తుచేస్తూ ఇలా అన్నారు-

### అహంకారం హాలాహలమే

అహంకారం అనే హాలాహలం బారినుండి కార్యకర్త తప్పించుకోవాలి. కార్యకర్తలపట్ల ప్రజలలో శ్రద్ధ మొలకెత్తుతుంది. అతడిపై సన్మానాల వర్షం కురుస్తుంది. ఆ కీర్తిని జీర్ణించుకోవాలంటే- సాధన అవసరం.

అరగని ఆహారం-విషం. అరగని ధనం దుర్వ్యసనమయం. అరగని బుద్ధి కుతంత్రాలమయం. అరగని బలం గర్వకారణం. అరగని కీర్తి అహంకార కారకం.

అరగని కీర్తి గర్వంగా మారి, పిచ్చెక్కిన ఏనుగులా తనతోపాటు సహచరులనూ, సంస్థనూ నష్టపరుస్తుంది. అహంకారాన్ని తృప్తిపరచే ప్రయత్నంలో కార్యకర్తయొక్క ఆలోచన, నడవడి, వ్యక్తిత్వం పతన మవుతాయి. ఫలితంగా సంస్థలో అంతఃకలహాలు చెలరేగుతాయి.

అహంకారం కారణంగా- రాజకీయపార్టీలు చీలిపోతున్నాయి; మహాభారత యుద్ధం జరిగింది; యాదవ వంశం నశించింది; మతాలలో చీలికలు వస్తున్నాయి; సుందోపసుందులు నాశనమైనారు.

కార్యకర్తకు లభించే సన్మానం సేవాధర్మానికి సమాజం ఇచ్చే గౌరవం. అది తనకు జరిగే గౌరవంగా కార్యకర్త భావించకూడదు.

### అయిదు బలహీనతలు

కార్యకర్త అయిదు బలహీనతలకు లొంగిపోకుండా జాగ్రత్తపడాలి. అవి-

లోకేషణ (అహంకారం), పుత్రేషణ (వాసన), విత్తేషణ (తృష్ణ), మంచేషణ (వేదిక ఎక్కాలనే వాంఛ), మైకేషణ (మైకులో మాట్లాడాలనే వాంఛ), ఫొటేషణ (ఫొటోలో పడాలనే వాంఛ).

ఆధ్యాత్మిక మార్గంలో పయనించే బాటసారులము మనం. ఆ రంగంలో పెద్దరికానికి ఆధారం వినమ్రత.

కార్యకర్త ఇతరులను ముందునిలబెట్టి, తాను వెనుకఉండాలి. అతనికి ఆత్మస్తుతి తగదు. అతడు తన సహచరులకు కీర్తిని పంచాలి.

కార్యకర్త సమయదాన, అంశదానాలతోపాటు కీర్తిదానాన్ని కూడ చేయవలసిఉంటుంది.

కామ క్రోధాలు రజోగుణం నుండి జనించినవి. అన్నింటినీ మ్రింగివేసేవీ, మహాపాపులూ అయిన శత్రువులు అవి- అని భగవద్గీత బోధిస్తోంది.

వినమ్రతకూ, నిరాడంబరతకూ ఉదాహరణలు : కృష్ణ భగవానుడు రాజసూయ యాగంలో అతిథుల కాళ్లు కడిగాడు. కాంగ్రెసు సంస్థలో ఏ పదవీ లేకుండానే- గాంధీజీ గౌరవాన్ని పొందారు. రాజ్యం నీది అంటే నీది అని రాముడూ భరతుడూ దానితో బంతి ఆట ఆడుకున్నారు. మగధ సామ్రాజ్యానికి ప్రధానామాత్యుడయిన ఆర్య చాణక్యుడు పూరిగుడిసెలో నివసించాడు. జనక మహారాజు నాగలితో పొలం దున్నేవాడు. రాజు ఇచ్చిన పట్టు చీరెలతో, నగలతో ఇంటికి వచ్చిన భార్యను- 'నీవు నా భార్యవు కావు' అన్నాడు న్యాయాధిపతి రామ శాస్త్రి. మామూలు దుస్తులతో వచ్చిన తర్వాతనే ఆమెను ఇంటిలోనికి రానిచ్చాడు. సిక్కుల గురుద్వారాలలో సామూహిక శ్రమదానం జరుగుతూ ఉంటుంది.

**భోగాలతోపాటు రోగాలూ పెరుగుతాయి.**

కార్యకర్త తన మాటలలో 'నేను'కు బదులు 'మేము' అనే మాట వాడాలి.

కార్యకర్త ఇతరులకు పెద్దరికం ఇవ్వాలి. స్వచ్ఛంద సేవకుడుగా పనిచేస్తున్నందుకు గర్వించాలి.

కార్యకర్తలకు వ్రాసిన ఒక లేఖలో పరమపూజ్య గురుదేవులు ఇలా బోధించారు-

''మిషన్ కార్యం భవిష్యత్తులో ఎన్నోరెట్లు పెరుగుతుంది. ఇందుకోసమై మీ కార్యదీక్ష శిఖరాగ్రాన్ని అందుకోవాలి.

"శ్రమ, ఏకాగ్రత, త్యాగం, అహంకార రాహిత్యం- ఇవే మనిషిని ఉన్నతుణ్ణి చేస్తాయి."

"కార్యకర్త జ్ఞానయోగిలా ఆలోచించాలి. కర్మయోగిలా కార్యశూరత చూపాలి. భక్తి యోగిలా సహృదయతను పెంపొందించుకోవాలి."

గంట ఉపన్యాసం ఆధారంగా కాక- 24 గంటల ప్రవర్తన ఆధారంగా ప్రజలు కార్యకర్తను అంచనావేస్తారు.

కార్యకర్త గురువాక్యాన్ని బ్రహ్మవాక్యంగా పరిగణించాలి.

కార్యకర్త నిర్వహణ సామర్థ్యం, ఉపన్యసించే, వ్రాసే కళ, జమాఖర్చులు వ్రాసే అలవాటు, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిఉండాలి.

వానప్రస్థ సంప్రదాయాన్ని పునరుద్ధరించాలి.

## వామనుని మూడడుగులు

కార్యకర్తలు వామనునివలె మూడడుగులు వేయాలి.

మొదటి అడుగు- నేటినుండి శతజయంతి వరకూ, రెండవ అడుగు 2012 నుండి 2015 వరకు. మూడవ అడుగు 2015 నుండి 2020 వరకు. 2020 నాటికి ప్రజ్ఞా ప్రకాశం విశ్వవ్యాప్తం అవుతుంది. భారత్ జగద్గురువు స్థాయికి చేరుతుంది.

## ప్రయోజనకరమైన కరపత్రాలు

కార్యశాలలో కార్యకర్తలకు సిద్ధాంతపరంగా, కార్యక్రమాల పరంగా ఎంతో ప్రయోజనకరమైన 14 కరపత్రాల గుచ్ఛం ఇవ్వబడింది. కరపత్రాలలోని అంశాలు-

1. కార్యకర్తలే నా అవయవాలు
2. యుగనిర్మాణ సత్సంకల్పాలు
3. పరమపూజ్య గురుదేవుల మార్గదర్శనం
4. శిఖ-యజ్ఞోపవీతం
5. యుగనిర్మాణ యోజన
6. వందసూత్రాల కార్యక్రమం
7. సంస్కార పరంపర
8. ప్రజ్ఞా పరిజనులకు ఏడు నియమాలు
9. పురస్కారానికి పాత్రుల మవుదాం
10. ప్రజ్ఞాపరిజనులకు ఏడు మహావ్రతాలు
11. వానప్రస్థ సంస్కారం
12. ఒక్క కుండీ యజ్ఞానికి సామాగ్రి
13. గాయత్రీ యజ్ఞం
14. పసుపుపచ్చ క్రాంతిసేన

పరమపూజ్య గురుదేవులు తమ వ్యధను, వేదనను ఇలా వ్యక్తంచేశారు-

"మాకోసం సేవ-సహాయం చేసిన వారి రుణం ప్రతిపైసనూ మేము చెల్లిస్తాము. మాకు స్వర్గం పట్ల ఆశ లేదు. ముక్తి పొందాలన్న ఆకాంక్ష లేదు. ఈ జన్మలో ఎవరెవరు ఎంతెంత ఉపకారం మా కోసం చేసారో, దాని ఒక్కొక్క కణం వడ్డీతో సహా మా 84 లక్షల జన్మల ద్వారా చెల్లించనివ్వవలసిందిగా ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తాము."

ఈ మూడడుగులూ వేయడంలో కార్యకర్తలందరికీ పరమపూజ్య గురుదేవులు ఇస్తున్న పిలుపు- డూ ఆర్ డై, కరో య మరో, విజయమో వీరస్వర్గమో.

★★★

**ఆధ్యాత్మికతతో చేసే ప్రతి పనీ పూజయే, యోగమే -స్వామి చిదానంద.**

వసంతపంచమి వ్యాసం-1 : గురుదేవుల అమృతలేఖిని

# సర్వసమర్పణద్వారా సంపాదించాను సిద్ధులు

## ఇచ్చిపుచ్చుకునే స్నేహం, ఇచ్చే స్నేహం

సాధారణంగా ఒకే వయస్సు, ఒకే అర్హతా కలిగిన వ్యక్తులమధ్య ఇచ్చిపుచ్చుకోవడం ఆధారంగా స్నేహం ఏర్పడుతుంది. ప్రేమికుడూ - ప్రేమికురాలూ సౌందర్యం, సహకారం ఆధారంగా స్నేహం చేస్తారు; ఒకరి కోసం ఒకరు త్యాగాలు చేస్తారు.

స్నేహానికి మరో ఆధారం ఉంది. తల్లి దండ్రులకూ, పిల్లలకూ మధ్య ఉండే అనుబంధం అది. తల్లి శిశువును నవ మాసాలు తన గర్భంలో నిలుపుతుంది. దానికి తన రక్త మాంసాలను ధారపోస్తుంది. దుర్భరమైన బాధను అనుభవిస్తుంది. తన రక్తాన్ని పాలుగా మార్చి దాని కడుపు నింపుతుంది. తన నిద్రనూ, సౌకర్యాలనూ వదులుకుని శిశువును పెంచుతుంది. ఇందుకు ప్రతిఫలంగా శిశువు ఆమెకు ఏమి ఇస్తుంది?

తండ్రి పిల్లల పోషణ బాధ్యత వహిస్తాడు వాళ్లకు చదువు చెప్పిస్తాడు. వైద్యం చేయిస్తాడు. పెళ్లిళ్లు చేస్తాడు. వృత్తి ఉద్యోగాలలో చేర్చుతాడు. చనిపోయినప్పుడు తన సంపదను వారసత్వంగా ఇస్తాడు. ఇందుకు ప్రతిఫలంగా పిల్లలు తండ్రికి ఏమిస్తారు? ఏమీ అందకపోయినా, ఈ సాన్నిహిత్యం జీవితమంతా సాగుతుంది. ఇవ్వడమే సాగుతుంది. పుచ్చుకోవడం బహు అరుదు.

ప్రాపంచిక దృష్టిలో ఇచ్చి పుచ్చుకునే స్నేహానికి ఆధారం ఏదీ లేకపోయినా- సూక్ష్మమైన ఒక స్నేహ సూత్రం సంతానాన్నీ తల్లి దండ్రులనూ బంధించి ఉంచుతుంది. వీరు నావాళ్లు- అని ఉభయులూ భావిస్తారు. తల్లి కొద్దిసేపు దూరమయితే శిశువు ఏడుస్తుంది. తల్లి పరుగు పరుగున వచ్చి తన ఒడిలోకి తీసుకోగానే శిశువు నవ్వుతుంది, తల్లిని అల్లుకుపోతుంది. తల్లి వద్ద ఉండి చిరిగిన దుస్తులు ధరించి, మజ్జిగ అన్నం తిని- శిశువు సంతోషంగా ఉంటుంది. ఆమెను వదులుకుని సంపన్నులవద్ద ఉండడానికి అది ఇష్టపడదు. తల్లి విషయమూ అంతే. శిశువు తనదని భావిస్తుంది కనుక, ఆమె దానికోసం కష్టాలను సహిస్తుంది. తండ్రికూడా ఇలాగే భావిస్తాడు. ఈ స్నేహ సంబంధం లేనప్పుడు- ఇతరుల పిల్లలమీద ఇంత మమకారం ఎందుకు ఉంటుంది? ఎవరైనా ఇంత త్యాగం ఎందుకు చేస్తారు?

## అంతా మార్గదర్శక సత్తా మహిమ

నా శరీరమూ, మెదడూ సామాన్య స్థాయికి చెందినవి. నాకు లభించిన ప్రాపంచికమైన సాధన సంపత్తీ, సహకారం చెప్పుకోదగినవి కావు. అయినా- నేను చేయగలిగింది నా అర్హతకూ, ప్రతిభకూ, సంపదకూ వేయిరెట్లు హెచ్చు అని నాకూ, ఇతరులకూ అనిపిస్తోంది. మరి- నాకిది ఎలా అందింది? జూదంలో గెలవలేదు. లాటరీలో వచ్చిపడలేదు. అకస్మాత్తుగా అదృష్టం కలసిరాలేదు. జరిగినదానిలో, చేసినదానిలో, అందినదానిలో 99 శాతం కాకపోయినా 90 శాతం ఒక దేవ సత్తా నాకు ఇచ్చినదే. ఆ దేవ సత్తాను నేను ఒకోసారి గురువనీ, ఒకోసారి మాస్టర్ అనీ, ఒకోసారి బాస్ అనీ, ఒకోసారి మార్గదర్శకులు అనీ, ఒకోసారి కనిపించే దేవుడనీ పిలుస్తాను.

## దానానికి షరతు

ఆయన ఇదంతా ఊరికే ఇచ్చారా, దానంగా ఇచ్చారా? అలా జరిగి ఉంటే- ఆ దాత మాకన్న మరింతగా దీన స్థితిలో ఉన్నవారికి దీన్ని ఇచ్చి ఉండేవారు. అయితే ఆయన ఒక ప్రత్యేకతను చూచారు, పాత్రతను చూచారు. పాత్రత మాత్రమే సరిపోలేదు. దానికి సమర్పణలను ఒక్కొక్కటిగా చేర్చాను. ఈ సమర్పణ నాలుకతో జరగలేదు. అంతరాత్మద్వారా జరిగింది. ఒప్పందం జరిగినప్పుడు, దానితో ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కాని ఒక షరతు జోడించబడింది. ఇవ్వబడేది ఉన్నత ఆశయం కోసమే

**జీవితాన్ని చూచి వణకిపోయేవాడు మూడువంతులు మరణించినట్లే.**

వినియోగపడాలి; నా స్వంత లోభ, మోహ, అహంకారాల ప్రదర్శనకు అందులో అణువంతయినా వినియోగపడకూడదు. ఏ ఉన్నత కార్యక్రమం సూచించబడుతుందో దానికోసమే దానం వినియోగపడాలి. ఇదీ ఆ షరతు. ఈ షరతు అక్షరాలా అమలు జరిగింది.

స్వార్థ సాధన కోసం గాడిదను సైతం తండ్రిగా చేసుకుంటారు జనం. ఏదో పెద్ద కోరిక తీరాలనే తహతహ ఉన్నప్పుడు, ఏదో సిద్ధి ద్వారా ఏదో అద్భుత కార్యంద్వారా అతడు తమను ఉద్ధరించాలని వాంఛించినప్పుడు- ఒక వ్యక్తిని గురువని చెప్పుకోవడానికి జనం వెనుకాడరు. ఈరోజుల్లో ఇలాంటి గురు శిష్య పరంపర సాగుతోంది. ఒకరు వరం కోరతారు; ఒకరు జేబుకొడతారు. మా విషయంలో కూడ అలా జరిగిఉంటే- అది హాస్యాస్పదంగా మిగిలిపోయేదే.

అయితే- నా మనస్సులో ఎన్నడూ ఎలాంటి కోరికా, ఎలాంటి యాచనా ఉదయించనేలేదు. నా ఆశయం ఒకే ఒకటి- ఎలాగయినా వ్రతాన్ని పాటించడం; నా అంతరాత్మ నిందించే లోపం ఎక్కడా రాకుండా చూడడం.

## అక్షరాలా అమలయిన షరతు

జన్మ జన్మల పాత్రత అది. సాధువుగా, బ్రాహ్మణుడుగా రూపొందడానికి పూర్తి నిజాయితీతో, విజ్ఞతతో, బాధ్యతతో, సాహసంతో నేను ప్రయత్నించాను. ఈ పరీక్షలో ఎప్పుడూ ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణుడనయాను. కనుక ఉపకార వేతనాన్ని పొందే హక్కును సంపాదించాను. ఈ జన్మలో ఈ ఒప్పందం వజ్రపు సిరాతో వ్రాయబడింది- నాదంతా మీదయితీరుతుంది; మీనుండి అందే వారసత్వం నుండి కొంత కాజేసే ఆలోచన రానివ్వను; మీ ప్రతి సంకేతాన్నీ నా కర్తవ్యంగా, నా స్వార్థంగా పరిగణిస్తాను.

ఈ నిర్ణయం జరిగిన తర్వాత మేము ఆ సిద్ధ పురుషుని దత్తపుత్రులముకాక స్వంత పుత్రులము అయినాము. వారి దానాలు వర్షించసాగాయి. ఇవ్వబడినది ఏ పని కోసం ఇవ్వబడిందో అది ఆ పని కోసమే ఖర్చు చేయబడింది. మనస్సులో దొంగ ప్రవేశించలేదు. దొంగతనం చేయాలనే సలహా ఎన్నడూ పాటించబడలేదు. ఈ వాస్తవం పలుమారులు పరీక్షించబడింది. అయినా- ఏ ప్రలోభమూ, ఏ ఒత్తిడీ నన్ను దారి తప్పించలేక పోయాయి.

## పాత్రతనుబట్టి సిద్ధుల దానం

సిద్ధులు చెత్త చెదరాలు కావు- తుడిచి అవతల పారవేయడానికి. వాటిని ఎంతో శ్రమించి సాధించవలసి ఉంటుంది. ప్రపంచంలో అడిగేవారికి లోటు ఎక్కడ ఉంది? వ్యక్తిగత లాభం కోసం అవసరం ఉన్నవారూ, లేనివారూ కూడ కోరికలు కోరుతూఉంటారు. అయితే- ఇచ్చేవాడు ఆలోచించవలసి ఉంటుంది- ఎవరికి ఇవ్వాలో, ఎందుకు ఇవ్వాలో. దర్శనంచేసుకున్నంతమాత్రాన, కాళ్లు పట్టుకున్నంతమాత్రాన, అడుగులకు మడుగులొత్తినంత మాత్రాన- ఖాతా చూడనిదే బ్యాంకు మేనేజరు డబ్బు విడుదల చేయడు. అలాంటప్పుడు- ఆధ్యాత్మిక సంపద కలిగిఉన్న వ్యక్తి ఆలోచించకుండా, పాత్రతనూ ఉపయోగాన్నీ గమనించకుండా ఎవరికిపడితే వారికి ఆ సంపదను ఇచ్చివేయడం సాధ్యమయే విషయం కాదు.

కుమార్తెకు వరుణ్ణి వెదికేటప్పుడు తండ్రి పిల్ల సుఖపడుతుందా లేదా అని శ్రద్ధగా పరిశీలిస్తాడు. పాత్రతలేని వ్యక్తి స్వయంగా వచ్చి పిల్లను పెళ్లి చేసుకుంటానని చెప్పితే, పిల్లచేత ఉద్యోగం చేయించి ఆ డబ్బుతో జల్సా చేయాలని ఆలోచిస్తే- పిల్ల తండ్రి అందుకు అంగీకరించడు. సిద్ధ పురుషులకు ఈ మాత్రం వివేకం ఉండదా? పుచ్చుకునేవాడు ఏదయినా అడగవచ్చు. అయితే, ఇచ్చేవాడు వేయి మారులు ఆలోచించాలి- ఇవ్వాలా వద్దా అని, ఇస్తే ఎంత ఇవ్వాలని.

రామకృష్ణ పరమహంస సిద్ధ పురుషులు. వేలాదిగా జనం ఆయనవద్దకు వచ్చేవారు. వారందరికీ తమ తమ

ప్రేమ యుద్ధంవంటిది - మొదలుపెట్టడం సులభం, ముగించడం కష్టం.

అవసరాలూ, కష్టాలూ, సమస్యలూ ఉండేవి. అందరూ సహాయం కోరేవారు. పరమహంస అందరికీ అతిథి సత్కారం చేశారు. ఎవ్వరినీ వట్టి చేతులతో పంపలేదు. అందరికీ సాధ్యమైనంత సాయం చేశారు. అందరికీ ఆ సాయంవల్ల ప్రయోజనం కలిగింది. ఈ ప్రక్రియ సాగుతోంది.

అయినా- తన స్థానాన్ని అందుకునే వ్యక్తి, తన సంప్రదాయాన్ని కొనసాగించే వ్యక్తి దొరుకుతాడా అని ఆయన పరీక్షించేవారు. ఈ అన్వేషణలో చాలా సమయం గడచిపోయింది. వారసుడుగా చేయదగిన వ్యక్తి ఎవరూ తనవద్దకు వచ్చినవారిలో దొరకలేదు.

చివరికి ఎంతో కష్టంమీద వివేకానంద దొరికాడు. అతడిని ప్రోత్సహించడంలో ఆయన లోటుచేయలేదు. అతడు సన్నిహితం అయినప్పుడు అతడి కోరిక తీర్చలేదు. తన వాంఛను పూర్తిచేసుకున్నారు.

వివేకానంద ఉద్యోగంకోసం వెదకుతున్నాడు. పరమహంస తలచుకుంటే ఆ కోరికను క్షణంలో పూర్తిచేయగలిగేవారు. కాని పూర్తిచేయలేదు.

కాళీమాత విగ్రహంవద్దకు ఆయన అతడిని పంపారు. ఆ మాతను అడగమని అతడికి చెప్పారు.

అక్కడ అతడు మాతయొక్క విరాట్ రూపాన్ని చూచి, తనను తాను మార్చుకున్నాడు. ఇలా అన్నాడు- 'మాతా! నేను ఉద్యోగం అడగడానికి రాలేదు. నాకు భక్తి కావాలి. శక్తి కావాలి. శాంతి కావాలి.' అతడికి అవి అందాయి కూడా. తన పూర్వపు కోరికను తీర్చుకుని ఉంటే- అతడు ఏదో కార్యాలయంలో ఉద్యోగిగా చేరి గుమస్తాగా మిగిలిపోయేవాడు. దేశ విదేశాలలో భారతీయ సంస్కృతి సందేశాన్ని అందించే అదృష్టం అతడికి కలిగేది కాదు.

పరమహంస శరీరాన్ని వదిలేముందు తన కాలిని వివేకానందుని తలపై ఉంచారు. అతడి శరీరంలో విద్యుత్తు ప్రవహించింది. కళ్లు తెరచి పరమహంస ఇలా అన్నారు- 'నావద్ద ఉన్నదంతా నీకు అప్పగించాను. నిస్సారమైన ఈ శరీరం ఇక పనికి రాదు. దీనికి అంత్య సంస్కారం జరిపే ఏర్పాట్లు చెయ్యి.' అలా చెప్పి, పరమహంస కన్ను మూశారు.

వివేకానందుని ఆత్మబలం పరమహంస ఆత్మబలం స్థాయికి పెరిగింది. ఆయన మాట్లాడేటప్పుడు పరమహంస ఆయన నాలుకపై విరాజిల్లుతున్నారనే అనుభూతి కలిగేది. ఆయన తనవద్దకు వచ్చినవారిని పరమహంస ప్రభావితం చేసినంతగా ప్రభావితం చేశారు. సద్గురువు ఇచ్చిన నిజమైన దానం ఇది. దానిని దొంగిలించలేము, కొనగలుగుతాము.

మేము కూడ కొన్నాము. గురువుగారి ఉదాత్త ఆదేశానికి మాకున్నదంతా కణకణం అర్పించాము. మాకోసం ఏదీ మిగుల్చుకోలేదు. పాలు నింపాలంటే గ్లాసులోని నీళ్లను పారబోయాలి. మేము మా నీళ్లు పారబోశాము, పాలు సంపాదించాము. ఈ సాహస చర్యద్వారా మేము పోగొట్టుకున్నదేదీ లేదు, సంపాదించుకున్నదే ఉంది. తొలినాళ్లలో మా మూర్ఖత్వానికి నవ్వుకున్నవారు సైతం ఈ వాస్తవాన్ని అంగీకరిస్తున్నారు. అది మూర్ఖత్వం కాదనీ, బుద్ధికుశలత అనీ ఇప్పుడు వారు ఒప్పుకుంటున్నారు.

పరిజనుల ప్రాపంచిక ప్రయోజనాల కోసం, లోక కళ్యాణం కోసం ఇంతవరకు మా శరీరంద్వారా చేయగలిగింది అంతా మా ఉపాసనా సాధనల ఫలితం కాదు. దానివెనుక దివ్య దానమే పనిచేస్తూవచ్చింది. ఇప్పుడు మేముకూడ ఈ జీవితాన్ని ముగిస్తూ ఆలోచిస్తున్నాము- మిగిలిఉన్న వేయిరెట్ల పనిని పూర్తిచేయగలిగి, మావలెనే దైవ అనుగ్రహాన్ని పొంది, తమ జీవితాలను ధన్యం చేసుకోగలిగే ప్రతిభామూర్తులు ఎక్కడ దొరుకుతారా అని.

★★★

## నారాకోడూరులో శక్తిపీఠంలో తొమ్మిదిరోజుల సాధనా శిబిరం

నారాకోడూరులో గాయత్రీ శక్తిపీఠంలో ఏప్రిల్ 6 నుండి 16 వరకు సాధనా శిబిరం జరుగుతుంది.

**వైరాగ్యానికీ పరోపకారానికీ సన్నిహిత సంబంధం ఉంది -స్వామి వివేకానంద.**

వసంతపంచమి వ్యాసం-2

# కరుణాసముద్రులు పరమపూజ్య గురుదేవులు

వసంతపు సుగంధం వాతావరణాన్ని నింపుతోంది. మావి చిగుళ్లతో ప్రకృతి శోభాయమానం అవుతోంది. పరమపూజ్య గురుదేవుల అంతరంగం కూడ ఈ వాతావరణంతో మమేకం అవుతోంది. హిమాలయంనుండి వచ్చే వాయువులలో వారు తమ సద్గురు సందేశపు గానాన్ని వింటున్నారు. సూర్య భగవానుని తీవ్రత పెరిగేకొలదీ వారి తపస్సులో నవ చేతన కలగలుస్తోంది. వసంత పర్వం వారిని పరవశింపజేస్తుంది. వసంతం అనే పదం వినబడగానే వారి ప్రాణాల పులకింత వేయిరెట్లు పెరుగుతుంది. సద్గురువు యొక్క శక్తితో వారు తమ కరుణామృతాన్ని పావనం చేశారు. ఈ అమృతాన్ని వర్షించి, వారు లక్షలాది మృతులకు ప్రాణదానం చేశారు.

మహత్తర తపోబలానికీ, అపార కరుణకూ మహా సంగమం వారు. వారి అంతరంగం నుండి గురుభక్తి ప్రవహిస్తోంది. వారి కన్నుల నుండి కరుణ ధార ప్రవహిస్తోంది. వారి మెదడులో మహాప్రజ్ఞ స్థిరపడింది. వారి ప్రాణములలో ప్రచండ తపో జ్వాలలు ఎగసిపడ్డాయి. అసాధ్యాలన్నీ వారి విరాట్ వ్యక్తిత్వంలో కరిగి సాధ్యాలుగా మారేవి.

నేడు తమ గదిలో పచారుచేస్తూ వారు ఎన్ని అసాధ్యాలను సాధ్యం చేస్తున్నారో! వారి గదిలోని వాతావరణం వారి మౌనంతో కలగలిసిపోయింది. వారు ఆ వాతావరణంలో తమ ఆంతరిక చేతన యొక్క స్పందనను మిళితంచేస్తూ ఎదుట కూర్చున్న శిష్యుణ్ణి ఇలా ఆదేశించారు– “వెళ్లు. క్రిందినుంచి ఎవరినయినా పిలుచుకురా.”

ఆ శిష్యుడు క్రింది అంతస్థులో కూర్చుని ఉన్న ఒక వరిష్ఠ కార్యకర్తను పిలుచుకువచ్చాడు. వసంత పంచమి ఏర్పాట్లను పర్యవేక్షిస్తూన్న వరిష్ఠ కార్యకర్తలను పిలవవలసిందని వారు అతడిని ఆదేశించారు. ఇంకా ఇలా అన్నారు– ‘నన్ను కలియడానికి వచ్చినవారు క్రింది అంతస్థులో ఉన్నారేమో చూడు.’ అతడు ఇలా జవాబు చెప్పాడు– ‘ఒక వ్యక్తి కూర్చుని ఉన్నాడు. అయితే అతడు ముఖ్యమైన వ్యక్తి కాడు.’ గురుదేవులు తీవ్ర స్వరంతో ఇలా అన్నారు– “ముఖ్యమైనవాడో కాడో నీకెలా తెలుసు? ఆ వ్యక్తిని తీసుకురా.” “అలాగేనండి”– అని అతడు మెట్లు దిగుతున్నాడు. అతడి ముఖంలో కొంత హైరానా ఉంది.

ఆ హైరానా సహజమే. వాస్తవం ఏమంటే– ఇదే కాక గురుదేవుల పనులన్నీ ఇబ్బంది కలిగిస్తూనే ఉంటాయి. ఎందుకంటే – పరమపూజ్య గురుదేవుల మాటలు ఎన్నడూ తర్కానికీ, హేతువాదానికీ లొంగవు. ఉపనిషత్తులోని అవాఙ మానస గోచరమ్ (వాక్కుకూ, మనస్సుకూ అందనిది) అనే పదం గురుదేవులకు అక్షరాలా అన్వయిస్తుంది. వారి మాటలను పెక్కు సంవత్సరాలుగా వింటూవచ్చిన ఈ సామాన్య శిష్య–కార్యకర్తకు ఆ విషయం అర్థమయింది. నిజానికి– పరమతత్వంయొక్క సాకార రూపం అయిన వారిని తర్క పరిధిలో ఎలా బంధించగలము? కనుకనే వారు ఒకోసారి ఉన్నతాధికారులనూ, కోటీశ్వరులనూ కలుసుకోవడానికి ఇష్టపడరు; మామూలు పల్లెటూరి మనుషులను వెదకి వెదకి ప్రేమతో పిలిపిస్తారు.

ఈరోజు పరిస్థితి అలాంటిదే. ఈ క్షణాలలో మెట్లు ఎక్కి పైకి వచ్చిన వారు అతిసామాన్యులైన పల్లెటూరి దంపతులు. వారి ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉన్నదని వారి వేష భూషలు తెలుపుతున్నాయి. వారి ముఖాలపై తీవ్ర వేదన కానవస్తోంది. వారి కళ్లు కన్నీళ్లతో నిండి ఉన్నాయి. వస్తూనే ఆ భార్యా భర్తలు గురుదేవులను ఎంతో ఆత్రంగా చూచారు. వారిలోని ఈ దైన్యాన్ని చూచి గురుదేవులలోని కరుణ పెల్లుబికింది. మొట్టమొదట వారు ఆ దంపతులను ఓదార్చారు. అయినా వారు బిగ్గరగా ఏడ్వసాగారు. ఆ ఏడుపు కొన్ని నిముషాలు సాగింది. గురుదేవులు వాళ్లిద్దరినీ ప్రశాంతంగా పరికిస్తున్నారు. అమృత సంజీవని అయిన వారి దృష్టి వారిద్దరికీ ఎంతో ఊరట కలిగించింది. వాళ్లు స్థిమితపడ్డారు. భార్య తన బాధను ఇలా వెళ్లబోసుకుంది– “గురుదేవా! మా పిల్లవాడు తప్పిపోయాడు. నెల రోజులు గడిచాయి. వాడి జాడ తెలియలేదు. వాడు ఎక్కడ ఉన్నాడు? వాడికి ఏమయింది?” ఆవెంటనే భర్త ఇలా అన్నాడు– “గురూజీ! పిల్లవాడు కనబడకుండాపోయినప్పటినుంచీ ఈమె తినడం, త్రాగడం మానివేసింది. ఏదో ఒకటి చేసి ఈమెకు ఊరట కలిగించండి. ఈమె రోజంతా ఏడుస్తూనే ఉంటోంది.”

ఒక దురభ్యాసానికయే ఖర్చుతో ఇద్దరు పిల్లలను పోషించవచ్చు.

గురుదేవులు మౌనం వహించారు. ఆతర్వాత ఇలా అడిగారు– "మీ పిల్లవాడి వయస్సు ఎంత?" 'మూడు సంవత్సరాలు"– అని భార్యాభర్తలు ఇద్దరూ ఒకేసారి చెప్పారు. మళ్లీ ఏడ్వసాగారు. ఏడుస్తూ ఏడుస్తూ వారిలా వేడుకున్నారు– "గురూజీ! ఏదో ఒకటి చేసి మా పిల్లవాడిని మాకు ఇప్పించండి. మీరు ఏదయినా చేయగలరు. మాకు వచ్చిన ఈ ఆపదను తొలగించండి."

గురుదేవులు ఏమీ పలకలేదు. అలా మౌనంగా ఉండిపోయారు. కొద్ది నిముషాలపాటు ఆ గదిలో నిశ్శబ్దం రాజ్యమేలింది. ఆతర్వాత వారు నెమ్మదిగా ఇలా అన్నారు–

"చూస్తాను నాయనా. మీకోసం నేను ఏమి చేయగలనో చూస్తాను. అయితే ఒక్క విషయం ఖాయం. నేను ప్రయత్నిస్తాను. ఆ రూపంలో కాకపోయినా– మరో రూపంలో మీ పిల్లవాడు మీకు దొరుకుతాడు. నేను మీకోసం భగవంతుణ్ణి ప్రార్థిస్తాను."

గురుదేవుల ఈ వాగ్దానాన్ని విన్న ఆ దంపతుల దుఃఖ భారం కొంత తగ్గింది. వారు భక్తి భావంతో గురుదేవులకు ప్రణామంచేసి వెళ్లిపోయారు. కొద్దిసేపటివరకు మెట్లమీద వారి అడుగుల చప్పుడు వినిపించింది. ఆ తర్వాత తలుపు తెరుచుకున్నది. అది మూతబడిన శబ్దం వినిపించింది.

గదిలో పరమపూజ్య గురుదేవులు ఏడ్వసాగారు. మహాసమర్థులైన తమ గురువు ఇలా ఎందుకు ఏడుస్తున్నారో ప్రక్కన కూర్చున్న ఈ శిష్యునికి అర్థం కాలేదు. అతడు ఇబ్బందిగా గురుదేవులను అలా చూస్తూఉండిపోయాడు. ఆతర్వాత ఇక ఉండబట్టలేక ధైర్యంచేసి గురుదేవులను ఇలా అడిగాడు– "గురూజీ! మీరు ఎందుకు ఏడుస్తున్నారు?" గురుదేవులు బొంగురు గొంతుతో ఇలా అన్నారు–

"వీరి పిల్లవాణ్ణి ఎక్కడ వెదకను? ఆ పిల్లవాణ్ణి వాళ్ల బంధువులే చంపివేశారు. నిర్దాక్షిణ్యంగా హత్య చేశారు."

ఆ దంపతుల వ్యథ గురుదేవుల అంతఃకరణను ద్రవింపజేసింది.

ఈ శిష్యుడు ఇలా అడిగాడు– "గురుదేవా? ఇక ఏమి జరుగుతుంది? మీరు వాళ్లతో చెప్పారు కదా......" అతడు ఆ వాక్యం పూర్తి చేయకముందే గురుదేవులు ఇలా అన్నారు–

"నాకు తెలుసు బాబూ– నేను ఏమి చెప్పానో. వారి పిల్లవాడు వారికి మరో రూపంలో దొరుకుతాడని నేను చెప్పాను. నాకిప్పుడు ఒకే దారి ఉంది. వారి పిల్లవాడి ఆత్మతో సంపర్కం ఏర్పరచుకుని, అతడిని మళ్లీ వారికి పిల్లవాడుగా చేయడం. అలా జరుగుతుంది. ఈసారి ఆ ఆత్మయొక్క సంస్కారాలను సముజ్వలం చేసి దానిని గ్రహ స్థితి సక్రమంగా ఉన్న ఘడియలో జన్మింపజేస్తాను. ఈసారి భూమిమీదకు వచ్చిన ఆ జీవాత్మ సుఖిస్తాడు, దీర్ఘాయువు అవుతాడు, తన తల్లి దండ్రులను ఎంతగానో సుఖపెడతాడు."

ఈ మాటలు విని, ఈ శిష్యుడు నిశ్చేష్టుడు అయిపోయాడు. ఏమి ఆలోచించాలో, ఏమి చేయాలో అతడికి పాలుపోలేదు.

అతడికి అర్థమయిన విషయం ఒక్కటే. గురుదేవులు రూపాన్ని ధరించిన కరుణ; పరమేశ్వరుని ఆర్ద్ర సంవేదనలే ఆకారాన్ని ధరించి గురుదేవులుగా మారాయి. పరమ కరుణామయులయిన ఇలాంటి గురుదేవులను పొందిన తర్వాత– ఇక తనను గురించి చింతించవలసిన అవసరం ఏముంది?

అతడు ఇలా ఆలోచిస్తూఉండగా– మెట్లమీద అడుగుల చప్పుడు వినిపించింది. శాంతికుంజ్‌లోని వరిష్ఠ కార్యకర్తలు గురుదేవులవద్దకు వస్తున్నారు. వసంత పంచమి ఉత్సవం గురించి వారు గురుదేవుల ఆదేశాలను పొందవలసి ఉంది.

అయితే– ఈ శిష్యుడు మాత్రం కరుణామయులయిన గురుదేవులను నీళ్లు నిండిన కళ్లతో అలా చూస్తూఉండిపోయాడు.

★★★

## పండుగలు

**ఫిబ్రవరి 2008**

| | |
|---|---|
| 11 | వసంత పంచమి |
| 21 | రవిదాస్ జయంతి |

**మార్చి 2008**

| | |
|---|---|
| 1 | సమర్థ రామదాసు జయంతి |
| 6 | మహాశివరాత్రి |
| 9 | రామకృష్ణ పరమహంస జయంతి |
| 22 | హోలీ |

పెదవులతో చేసే నామస్మరణ కన్న చేతులతో చేసే సేవ మిన్న.

వసంతపంచమి వ్యాసం-3

# వసంతపంచమి సందేశం : సర్వస్వ సమర్పణ

## భక్తి గంగ

మావి చిగుళ్ల సుగంధంతో వసంతం తిరిగి మన హృదయాలను తాకింది. వసంత పవనాలు తిరిగి మన సంవేదనలలో సమర్పణ స్వరాన్ని నింపాయి. ఋతువులకు రాజయిన వసంతం భక్తి భావనను తిరిగి మేలుకొలిపింది. తన్మయపరచే జ్ఞాపకాలూ, పులకింపజేసే ఘట్టాలూ, ఉద్రూతలూగించే నాదాలూ అంతఃకరణలో తిరిగి ఉప్పొంగాయి. గురువుకూ, శిష్యునికీ మధ్య ప్రవహించే భక్తిగంగలో తిరిగి వరద వచ్చింది. భావాలలో సమర్పణను రంగరించే చరిత్రలు పెక్కింటిని వసంత వాయువులు రచించాయి. ఈ వాయు వీచికల మధ్య అనేక గీతాలు గానం చేయబడ్డాయి. ఎన్నెన్నో పదాలు ఛందస్సులలో కూర్చబడ్డాయి. భావనల తరంగాలు అసంఖ్యాకంగా పొంగిపొరలాయి.

## తనను తాను సమర్పించుకునే కళ

అయితే, దీని మాధుర్యాన్ని శిష్యుని అంతరంగం అనుభూతిపొందినంతగా మరేదీ అనుభూతిపొందలేదు. ప్రేమ అనే మాట పలువురి నాలుకలపై ఆడుతోంది. ప్రేమపై పెక్కు చర్చలు జరుగుతున్నాయి. అయితే- మౌనంగా ఉండిపోతూ నిరంతరం తనను తాను సమర్పించుకునే కళ శిష్యునికి మాత్రమే తెలుసు. శాస్త్రాలన్నింటి సారం ప్రేమ అని ప్రకటించిన కబీరు ఇలా అన్నారు- **అధజల గగరీ ఛలకత్ జాయ్। భరీ గగరియా చుపకే జాయ్।** భావాల పాత్ర ఎంత ఖాళీగా ఉంటే అంతగా శబ్దం చేస్తుంది. అంతగా చర్చలూ, వివాదాలూ సాగుతాయి. అంత లోతయిన ప్రశ్నలు తలెత్తుతాయి. అంతరంగంలో అనుమానాల కారుమబ్బులు క్రమ్ముకుంటాయి.

ప్రేమతో పొంగిపొరలే శిష్యుని హృదయానికి తెలుసు- ప్రేమ లోతయినదయితే, అనురాగం నిజమైనదయితే, భక్తి స్వచ్ఛమైనదయితే- ప్రశ్న అనేది తలెత్తదని. భావన పరిపక్వంకానప్పుడే, దానిలో పరిణతి లేనప్పుడే ప్రశ్న అనే ముల్లు గుచ్చుకుంటుంది. సమర్పణ చేసే వ్యక్తి తన సర్వస్వాన్నీ ధారపోసినప్పుడే తాను ధన్యుడనని భావిస్తాడు. అతడు తన ఆరాధ్య దైవాన్ని ఒకే ఒకటి అర్థిస్తాడు- ప్రభూ! నాకు ఏమీ ఇవ్వవద్దు, నాకున్నదంతా తీసుకో. ఇచ్చిన తర్వాతకూడా ఇంకా ఇవ్వాలనే మనఃస్థితి ఉంటుంది శిష్యునికి. భక్తుని భావనలు ఈ ఇరుసు చుట్టూ తిరుగుతూఉంటాయి. వసంత పంచమి సందేశమూ ఇదే. సద్గురువుకు సమర్పణలోని రహస్యం ఇదే. పరమపూజ్య గురుదేవుల సాధనా జీవనంలోని సారం ఇదే.

## కేంద్రబిందువు గురుభక్తి

1926 వసంత పంచమి నాటి బ్రహ్మ ముహూర్తంలో పరమపూజ్య గురుదేవులకు తమ మార్గదర్శక సత్తాతో తొలి సమాగమం జరిగింది. ఆ క్షణమే వారి జీవనంలో గురుభక్తి మహాపర్వం అయింది. ఆతర్వాత ప్రతి వసంత పంచమీ ఈ భక్తి కావ్యంలో కొత్త సమర్పణ అధ్యాయాన్ని రచిస్తూవచ్చింది.

పరమపూజ్య గురుదేవుల జీవన గాథను పలువురు పలువిధాలుగా చదివిఉండవచ్చు. ఆ గాథలోని వివిధ కోణాలు వారి మనస్సులను కరిగించిఉండవచ్చు. పెక్కు ఘట్టాలలో వారి హృదయం స్పందించిఉండవచ్చు. గురుదేవుల జీవనంలోని పెక్కు సంఘటనలు పాఠకులను పులకింపజేసిఉండవచ్చు. అయితే వీటన్నింటిమధ్యా స్వయంగా గురుదేవుల మనస్సును స్పందింపజేసిన, పులకింపజేసిన ప్రధానాంశం ఒకటి ఉంది. అది వారి జీవనంలో అంకురించిన గురుభక్తి. మిగిలిన అంశాలన్నీ ఈ భక్తి సూత్రంతో కూర్చబడ్డాయి, ఈ భక్తి సూత్రంతో పెనవేసుకునిఉన్నాయి.

## గురువుగారి పెదవులపై మురళిని నేను

ఈ భక్తి సూత్రంతో గురుదేవుల జీవనంలోని వసంతాలన్నీ కూర్చబడ్డాయి. వారు తమ మార్గదర్శకుణ్ణి పలువిధాలుగా స్మరించేవారు. వారు నా మాస్టరు- అనే వారు. వారు నా మార్గదర్శకులు - అనేవారు. వారు నా భగవాన్- అనేవారు. వారు సదా నన్ను రక్షించే బాడీగార్డు- అనే వారు. అయితే ఈ సంబంధాలన్నింటిలో వారి సమర్పణ

**ఆపదలో అవకాశాన్ని వెదకడమే ఆశావాదం.**

స్వరమే వినిపించేది. గురుదేవుల జీవితమంతా ఒక భక్తి గీతం. వారు తమ ప్రభువు స్మృతిలో తన్మయులై గానం చేసిన భక్తి గీతం అది. వారు తమను గురించి ఇలా చెప్పుకునేవారు–

**నా ఉనికి ఏముంది? నా గురువు పెదవులకు ఆని ఉన్న మురళిని. ఈ మురళి గురు మహిమ అనే గీతాన్నే ఆలాపిస్తుంది.**

## సమర్పణలో సంతృప్తి

గురుదేవుల స్పర్శతో స్పందించినవారికే వారి జీవనంలోని ఈ వసంత వైభవం అర్థ మవుతుంది. సమర్పణలో ఉన్న ఆనందం ఏమిటో వారినుండే నేర్చుకోవాలి.

పెదవులతో గురుదేవులని అనడం వేరు. గురుదేవులకు అర్పితమైన వ్యక్తిగా జీవించడం వేరు. హతాశతో, నిరాశతో, ఫిర్యాదులతో నిండిన మనస్సుకు శిష్యత్వం ఎలా అర్థ మవుతుంది? శిష్యుడు కావడంలో ఎంత తృప్తి ఉన్నదో, ఎంత ఆనందం ఉన్నదో, ఎంతటి ఉత్సాహం ఉన్నదో, ఎంతటి సార్థక్యం ఉన్నదో ఆ మనస్సుకు ఏమి తెలుస్తుంది? ఇచ్చేవాడే పొందుతాడు. ఇచ్చేవాడే తృప్తిని అనుభవిస్తాడు. ఇవ్వడం మాత్రమే నేర్చుకున్నవానికే తెలుస్తుంది ప్రేమలో, భక్తిలో, అనురాగంలో ఉన్న రహస్యం. స్వార్థం నుండి, అహంకారం నుండి విముక్తిపొందిన మనస్సు కావాలి ఈ రహస్యాన్ని తెలుసుకోవడానికి.

## ప్రాపంచిక ప్రేమ, ఆధ్యాత్మిక ప్రేమ

సూఫీ సంత్‌లు ప్రేమ రెండు విధాలని చెప్పారు– ప్రాపంచిక ప్రేమ, ఆధ్యాత్మిక ప్రేమ. ప్రాపంచిక ప్రేమలో అసలైన ప్రేమ ఉండనే ఉండదు. అందులో ఎప్పుడూ స్వార్థ, అహంకారాల కూడికలూ, తీసివేతలూ ఉంటాయి. ఎప్పుడు ఎవరివల్ల ఎంత స్వార్థ ప్రయోజనం పూర్తయిందో పూర్తవుతుందో, వారికి అంత ప్రేమ అందే అవకాశం ఉంటుంది. మరో కోణం అహంకారానిది. నా షరతుల ప్రకారం నడుచుకున్నవాడే శ్రేష్ఠుడు. నా షరతులను ఎవరు ఎంతగా అంగీకరిస్తే వారు అంత హెచ్చుగా నావాళ్లు. ఇలా ఆలోచించేవారికి జీవితంలో ఎన్నడూ సంతృప్తి ఉండదు. వారి అంతరంగాలలో ఉల్లాసం, ఉత్తేజం, ఆహ్లాదం ఉదయించవు.

## భక్తిగీతం కావాలి శిష్యుని జీవితం

భగవంతునికీ, సద్గురువుకూ తనను తాను నిరంతరం అర్పించుకుంటూ పోవడమే భక్తి. తనను తాను అంకితంచేసుకునే కళ– ప్రేమ. సర్వస్వాన్నీ అర్పించి, ఏమీ కోరనివాడే శిష్యుడు. అతడి జీవితమే భక్తిగీతం అవుతుంది. పొందగోరేవాడు దారితప్పుతాడు. అతడి ఒడిలోకి ఏదీ రాదు. వసంతం సైతం అతడిని నవ్వించలేదు. ఆలోచించండి. అనుమానాలతో, ఫిర్యాదులతో బరువెక్కిన మనస్సుకలవాడు ఎన్నడయినా శిష్యుడవుతాడా? కాడు. కానే కాడు. శిష్యుడుకావడానికి సూత్రం ఒక్కటే– మొదట గురువు చేతుల్లో నశించిపోవడం, ఆ తర్వాత గురుభక్తిగా రూపుదిద్దుకోవడం. ఈ సాధనయే జీవన సత్యం, జీవన సారం.

పరమపూజ్య గురుదేవుల సాధనా జీవనంలో వచ్చిన ప్రతి వసంతమూ ఇదే సందేశాన్ని అందించింది, ఇదే గీతాన్ని గానం చేసింది. వారిలా చెప్పేవారు–

**జనం నా జీవితంలోని అద్భుత సామర్థ్యాన్ని గురించి చర్చిస్తారు. కానీ, దాని వెనుక గల కారణాన్ని విస్మరిస్తారు. నేను నా జీవితాన్ని గురుభక్తి అనే నీటితో తడిపాను. నా జీవితాన్ని నీరుగా మార్చి నా మార్గదర్శకుని చరణాలపై అర్ఘ్యంగా అర్పించాను. నేడు ఉన్నదంతా దాని ఫలితమే, దాని ప్రతిఫలమే. ఇలా చేసే వ్యక్తి జీవితం ఇలాగే మారుతుంది.**

ఇప్పుడు గురుభక్తులమైన మన వంతు వచ్చింది. వసంతపు సుగంధం, వసంతపు వైభవం, వసంతపు ఉల్లాసం, వసంతపు ఉత్సాహం– ఇవన్నీ గురుభక్తి మార్గంలో పయనించినప్పుడే అందుతాయి. గురుభక్తి మన గుండె చప్పుడు అయితే– ఈ వసంతం మన జీవితంలో సుగంధాన్ని నింపితీరుతుంది.

మనకు గురుభక్తి గీతాన్ని నేర్పడానికి వచ్చింది వసంతోత్సవం. మన జీవితంలో సమర్పణ భావనను నింపడానికి వచ్చింది వసంతోత్సవం. ఈ సమర్పణలోనే ఇమిడి ఉంది మామిడి చిగుళ్ల సుగంధం.

★★★

**అవకాశం చేజారినా, నిరాశను దరిజేరనివ్వకు.**

ధారావాహిక : ప్రగతికి ప్రాతిపదిక ఆదర్శకుటుంబం-12

# స్వాధ్యాయానికి ప్రాధాన్యం

నిత్య కృత్యాలను నిర్వహించే అలవాటును వ్యక్తులు సహజంగా ఇతరులను చూచి నేర్చుకుంటారు. అయితే- భావనలూ, ఆలోచనలూ సాహిత్యంద్వారా రూపుదిద్దు కుంటాయి. సృష్టిగురించీ, మానవ జీవితం గురించీ అభిప్రాయం మనిషికి సాహిత్యంద్వారా ఏర్పడుతుంది.

జ్ఞానం అగాధం, అనంతం అయినది. మనలో ఎవ్వరూ అన్నింటినీ నేర్చుకోలేరు. స్వాధ్యాయానికి సమయం మనకు తక్కువగానే ఉంటుంది. మనిషి ఎవరు? జీవితం ఏమిటి? దాని ప్రయోజనం ఏమిటి? ఆ ప్రయోజనాన్ని పొందే మార్గాలు ఏవి? మనకు ఏ మార్గం ఎక్కువ అనుకూలం? దానిని పొందటానికి ఎలాంటి వ్యవస్థను ఏర్పరుచుకోవచ్చు? దానిలో ఏర్పడ గల ఇబ్బందులు ఏమేమిటి? వాటిని ఎలా ఎదుర్కొనవచ్చు? సంస్కరించబడిన వ్యక్తిత్వం అని దేన్ని అంటారు? తన వ్యక్తిత్వాన్ని సంస్కారవంతంగా ఎలా మార్చుకోవచ్చు? ఈ విషయాలను గురించి ఎక్కువ తెలుసుకోవడానికి చేసే ప్రయత్నమే స్వాధ్యాయం.

## ఆత్మపరీక్షకు సాధనం స్వాధ్యాయం

ప్రతి కుటుంబమూ శ్రేష్ఠ వాతావరణ నిర్మాణానికై ప్రయత్నించాలి. స్వాధ్యాయం చేసే అలవాటును కుటుంబంలో ప్రవేశపెట్టాలి. వ్యక్తి నిర్మాణ ప్రక్రియను మార్గమిదే.

ధార్మికత, పూర్వ సాంప్రదాయాలు ఏ విధమైన ఉపయోగం లేనివని చదువుకున్న కుటుంబాలవారు భావిస్తున్నారు. వాటిపట్ల ప్రజల మనస్సుల లోలోపల వాటి ఉపేక్షాభావం తిష్టవేసుకున్నది. అందువల్ల ధార్మికత యొక్క సరైన రూపాన్ని తెలియ చెప్పాలి. యువకులు పూర్వాచారాలను కళ్ళుమూసుకుని పాటించడానికి ఇష్టపడరు. వారు వీటి ఉపయోగాన్ని తెలుసుకొనగోరతారు. ఆధునికత పేరుతో పెరుగుతూన్న విశృంఖత్వాన్ని ప్రత్యక్షంగా విమర్శిస్తే, వారు ఆ విమర్శకులను తిరోగమనవాదులుగా, ఛాందసవాదులుగా పరిగణించవచ్చు. ఆత్మపరీక్షవల్ల స్వయంగా ఆ నిర్ణయానికి వచ్చినప్పుడు, వారు రెట్టించిన ఉల్లాసంతో- ఉత్సాహంతో సదాలోచనల ప్రచార ప్రసారాలలో నిమగ్నం అవుతారు. ఆత్మపరీక్షకై సర్వోత్తమ పద్ధతి స్వాధ్యాయమే. ధార్మికతయొక్క ప్రగతిశీల స్వరూపాన్ని ప్రతిష్ఠించడానికై, వారికి స్వాధ్యాయ ప్రవృత్తిని అలవర్చాలి. సత్సాహిత్యాన్ని చదివే- చదివించే ఏర్పాటు, శ్రేష్ఠమైన సాంప్రదాయాల స్థాపన- ఈ రెంటి ద్వారా ధార్మికత నిర్మాణ మవుతుంది. అది ప్రేరణకు, వెలుగుకు కేంద్రం అవుతుంది.

## గ్రంథాలకో గది

ప్రతి కుటుంబంలో స్వాధ్యాయ సంప్రదాయం కొనసాగాలి. సాధ్యమైనంతవరకు- పూజ కోసం గదిని కేటాయించినట్లే స్వాధ్యాయం కోసం ఒక గదిని కేటాయించాలి. ఈనాటి మంచి-మంచి పత్రికలను, ఉన్నతోన్నతమైన పుస్తకాలను అలమరలలో ఏర్పరుచుకోవాలి. గదిని, అలమరాలను, పుస్తకాలను పూజగదిలా శుభ్రంగా

**మనసు ఆనందనిలయం అయితే, తనువు ఆరోగ్యధామం అవుతుంది.**

ఉంచుకోవాలి. మధ్య మధ్యలో పుస్తకాలను ఎండలో పెడుతూఉండాలి. పుస్తకాలలో పురుగులు పట్టకుండా పుస్తకాల మధ్యన కలరా ఉండలు పెట్టాలి. జీవితాన్ని తీర్చిదిద్దే పుస్తకాలను ఇంటి గ్రంథాలయంలో ఉంచాలి.

సత్ప్రేరణలను, సదాలోచనలను, సద్భావాలను మేల్కొలిపే సాహిత్యం ఎక్కడైనా దొరుకుతుంది. శ్రేష్ఠమైన ఆలోచనలు, ఉన్నతమైన భావాలు, గొప్ప ఊహలు– అన్నీ మంచి పుస్తకాలల్లో దొరుకుతాయి. ఇందువల్లనే జీవన వికాసానికీ, కుటుంబ సభ్యుల వికాసానికీ వారిలో స్వాధ్యాయ ప్రవృత్తిని పెంపొందించాలి. ఆలోచనల, భావాల సంఘర్షణలో గ్రంథాలు సహాయపడతాయి. కనుక జీవన నిర్మాణానికి ప్రేరణ నిచ్చే సాహిత్యం ఇంటిలో ఉండటం, వాటిని అధ్యయనం చేసే అలవాటు అందరికీ ఉండటం చాలా అవసరం. అధ్యయనం చేసే అలవాటు లేకుంటే పుస్తకాలు కూడబెట్టి ప్రయోజనం ఏముంది? ప్రతి కుటుంబంలోనూ స్వాధ్యాయానికై నిర్ణీత సమయాన్ని కేటాయించాలి. ప్రత్యేక పరిస్థితుల్లో అలాంటి నియమాన్ని పాటించలేకపోతే అది వేరే విషయం. అందరూ ఒకే చోట కూర్చుని మహత్తరమైన అంశాల నెన్నింటినో చర్చిస్తే చాలా మంచిది. అలాగే పనులు చేసుకుంటూ, తింటూ తిరుగుతూ కూడా ఆయా విషయాలను చర్చించ వచ్చు. అలాంటి సందర్భాలలో కుటుంబంలోని సభ్యులందరూ ఆత్మీయతతో చర్చలు చేసే పరిస్థితి ఉంటుంది. అలాంటి చర్చలవల్ల ఆలోచనా శక్తి బాగా వికసిస్తుంది. "ఖాళీగా ఉన్న మెదడు పిశాచాల నివాసం"– అన్నది ఒక సామెత. ఒంటరితనంవల్ల, సబ్దత వల్ల ఉత్పన్నమయ్యే దురాలోచనలు స్వాధ్యాయంవల్ల తొలగిపోతాయి.

## ఆదర్శ ఆచార్యుడు

*మాజీ రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ఒక పురోహితుల ఇంట్లో జన్మించాడు. తండ్రి పేరు శ్రీవీరాస్వామి ఉటపా. ఆయన తండ్రి పౌరోహిత్యంతో పాటుగా ఉపాధ్యాయ వృత్తి కూడా చేసేవాడు. రాధాకృష్ణన్ తన తీవ్ర ప్రయత్నం వల్ల పురుషార్థం వల్ల తన వ్యక్తిత్వాన్ని పెంచుకున్నాడు.*

*1908లో ఆయన మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో తత్త్వశాస్త్రంలో తర్కశాస్త్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియుక్తులైనారు. ఆయనలో ఒక విలక్షణమైన వక్తృత్వ కళ ఉండేది. ఆయన వాక్కులో తర్కం, భావాలలో సామంజస్యం ఉండేవి. ఆయన ఉపన్యాసాలలో ఒక ఇంద్రజాలం ఉండేది. అనతికాలంలోనే ఆయన ఉపాధ్యాయుడిగా మంచి పేరు సంపాదించారు. ఆయనకి తన తరగతిలోని ప్రతి విద్యార్థి పేరు తెలుసు. విద్యార్థులు ఆయనను సహజస్నేహ భావంతో కలుసుకునేవారు. విద్యార్థులకు సహాయం చేయటం తన ధర్మంగా భావించేవారు ఆయన.*

*డాక్టర్ రాధాకృష్ణన్ ఉపరాష్ట్రపతిగా ఉన్నప్పుడు కలకత్తా విశ్వ విద్యాలయానికి సంబంధించిన ఒక విద్యార్థి ఆయనకు ఒక లేఖ వ్రాశాడు – 'నేను బీదవాణ్ణి కావటం వల్ల మీరు రచించిన 'ఇండియన్ ఫిలాసఫీ' అనే గ్రంథాన్ని కొనే స్థితిలో లేను. దయదలచి పరీక్షలయ్యేవరకు మీరు నాకా పుస్తకాన్ని ఇవ్వవలసిందిగా కోరుతున్నాను. పరీక్షలు కాగానే తిరిగి ఇచ్చేస్తాను' డాక్టర్ రాధాకృష్ణన్ పుస్తకాన్ని పంపారు. దాన్ని తిరిగి ఇవ్వవలసిన అవసరం లేదని కూడా ఉత్తరం వ్రాశారు. విద్యార్థుల పట్ల ఆయనకున్న మమతానురాగాలు అట్టివి. ఆదర్శ ఉపాధ్యాయుడైన డాక్టర్‌రాధాకృష్ణన్ విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఇచ్చిన సలహా ఇప్పుడు కూడా మన అందరికీ మార్గదర్శకంగా ఉంటుంది. వారిలా చెప్పారు – 'ఆకాశంలో ఎగిరిపోయే మీ కాళ్ళను భూమిమీద దృఢంగా నిలపండి. భూమిమీద నుండి వాటిని పైకి ఎగురనీయకండి' మనం కూడా ఈ మాటలను హృదయంలో దాచుకొని దృఢంగా ముందడుగు వేద్దాం.*

## జ్ఞానదేవత ఉపాసన

జ్ఞాన దేవత యొక్క ఈ ఉపాసనతోపాటు ప్రతి ఇంట్లో భావదేవత ఉపాసన కూడా నియమబద్ధంగా నడుస్తూ ఉండాలి. అప్పుడే సంతులనం సిద్ధిస్తుంది.

★★★

**ఔదార్య లోపాన్ని మించిన గుండెజబ్బు లేదు.**

తత్వ చింతన

# ప్రతిపనీ కావాలి ప్రార్థన

ఆర్ద్రమైన సంవేదనలు జీవితమనే బండికి ఇరుసులు. అవి విశుద్ధ అంతఃకరణలోని స్పందనలు. అవి మన జీవితంలోని అన్ని కోణాలనూ తాకుతాయి. ఆ స్పర్శవల్ల ఎంతో ఆనందానుభూతి కలుగుతుంది. ఆ స్పందనలు మానసిక వికాసానికీ, విస్తరణకూ తోడ్పడతాయి. సంవేదనల స్పర్శ లోపిస్తే- ఎన్ని వైభవాలతో తులతూగుతున్నా, మనిషి బిచ్చగాడు అవుతాడు, అన్నింటినీ కోల్పోతాడు. సంవేదనల లోపమే మానసిక రోగాలకు మూలం. మరోప్రక్క - సద్భావనలూ, సదాలోచనలూ, తృప్తీ వ్యక్తిత్వాన్ని ప్రకాశింపజేస్తాయి.

భావ చికిత్సకు సుందర మార్గం ప్రార్థన ప్రార్థనద్వారా భక్తి చిక్కబడుతుంది, గట్టిపడుతుంది. నేడు వ్యక్తికి తెలివికన్న ఆత్మీయత మరింత అవసరం. తెలివితేటలు మన మనస్సులలో ముళ్లకంపలను పాతిపెట్టాయి. అందువల్ల మన భావనలు అణచబడ్డాయి. చెడు భావనలనే నల్ల దుప్పటి కప్పుకొని మనం మన సమస్యలను సురస రాక్షసి నోరులా పెద్దవి చేసుకుంటున్నాము. మానసిక రోగాల జాబితాను తయారు చేస్తున్నాము. వాటికి మూల కారణం నలిపివేసిన భావనలే.

అణచివేయబడిన అలాంటి భావనలే మనల్ని దిగజార్చుతున్నాయి. మనస్తత్వ శాస్త్ర నిపుణుడు డేనియల్ గోల్‌మెల్ ఇలా అంటారు- "విధ్వంసక భావనలు ప్రమాదకరాలు. ఇలాంటి భావనలు కలిగిన వ్యక్తులు తమ భావనల విష బాణాలను ఇతరులమీద ప్రయోగిస్తారు. తమ లోపల ఉన్న వ్యాకులతను ఇతరులకు సంక్రమింపజేస్తారు. ఇతరులు బాధపడడం చూచి ఆనందిస్తారు. వారి జీవితం ఒక నరకం." వ్యతిరేకాత్మక భావన కలిగించే దుష్ఫలితాలను పలువురు మనస్తత్వ శాస్త్ర నిపుణులు వర్ణించారు.

ఈ నిపుణులు మన ఋషుల సత్యానుభవాన్ని బలపరుస్తున్నారు. అణచబడిన వాసనలు మానసిక రోగాలకు కారణాలని ఋషులు బోధించారు.

వ్యతిరేకాత్మక భావనలు మనల్ని దుఃఖపూరితులను చేస్తాయి. వాటివల్ల మనం మన లోపాలను పెద్దవి చేసి చూస్తాము. మనలోని మంచితనాన్ని మరచిపోతాము. మరోప్రక్క - సరయిన ఆలోచనలు చిగిర్చితే ప్రవర్తనలో అద్భుతమైన మార్పులు వస్తాయి. వ్యక్తిత్వం అనే చందనం పరిసరాలను సుగంధభరితం చేస్తుంది. భావనలు నిరంతరం ప్రవహించే నదివంటివి. ప్రవహిస్తే నిర్మలంగా ఉంటాయి. నిర్బంధిస్తే కుళ్లి కృశించిపోతాయి.

జ్ఞానం పంచితే దొరకుతుంది. విస్తరిస్తే పెరుగుతుంది. నిల్వచేయడానికి ప్రయత్నిస్తే, మంచు బిందువులా కరిగిపోతుంది.

మనం సాధారణంగా స్థూల శరీరపు అనుభవాలలో, ఆలోచనలలో జీవిస్తున్నాం. సాంసారిక విషయాలలో మునిగితేలుతున్నాం. ఆంతరిక చైతన్యంతో అనుబంధం ఏర్పరచుకునేందుకు మనకు అవకాశమే ఉండడం లేదు. మన ప్రేమ ఆప్యాయతలు ఈర్ష్యా ద్వేషాలతో కలుషితమై మసకబారిపోతున్నాయి, నల్లబడిపోతున్నాయి. అలగడం-కులకడంవల్ల మన భావనలు విరిగి వెదజల్లబడి అదృశ్యం అవుతున్నాయి. అమృత భాండాన్ని పొందినప్పటికీ, మనం దాహంతీరనివారివలె మిగిలిపోతున్నాం.

ఈ స్థితిలో- ఆర్తితో, ఆవేదనతో మన ఇష్ట దైవాన్ని పిలిచే పిలుపే ప్రార్థన. ప్రార్థన మన అంతఃకరణ లోపలి నుంచి వస్తుంది. అన్ని లోకాలకు ఎగువన ఉన్న భగవంతుని దగ్గరకు అది చేరుతుంది. ఈ వ్యాకులతతోనే గజేంద్రుడు సుదర్శనధారిని పిలిచాడు. ఈ ఆర్త స్వరమే ద్రౌపది అంతఃకరణ నుండి వెలువడింది. రైదాసు, కబీరు, దాదూ,

**అంతరాత్మను చంపుకుని బ్రతకడం కన్న మరణించడం మేలు.**

రజ్జబ్, రబియా, మీరా, చైతన్య మహాప్రభు భావవేశపూరితమైన అంతఃకరణలతో తమ ఇష్టదైవాలను ప్రార్థించారు. వీరి హృదయ తంత్రులు భక్తవత్సలుడైన భగవంతునితో పెనవేసుకున్నాయి. కనుకనే- భగవంతుని పరిపూర్ణ జ్ఞానం, అపరిమిత సామర్థ్యం, భావభరిత ప్రేమ అనుక్షణం వారికి అందేవి. భగవంతుడు వారికి రక్షణ కల్పించాడు.

మన జీవితాలలో కూడ ఈ అద్భుతాలు జరిగే అవకాశం ఉంది. భగవంతుని గొడుగు నీడ మనకూ అందే అవకాశం ఉంది. అందుకై మన ఆలోచనలు కలుషితం కాకుండా చూచుకోవాలి; మన జీవితాన్ని భగవత్ చైతన్య మయం చేసుకోవాలి.

ప్రార్థన సమయంలో మనం పవిత్రమైన భావనలతో నిండిఉంటాము. ఆ క్షణాలలో మనం దివ్య చైతన్య శిఖరంపై కూర్చునిఉంటాము. భగవంతుని అపార శక్తి, అపరిమిత ప్రేమ ప్రత్యక్షమయే అవకాశం అప్పుడు దొరుకుతుంది. కష్టాల కారుమబ్బులు విడిపోయి, వెలుగుల వెల్లువ పెల్లుబుకుతుంది. జీవితమే మారిపోతుంది. సంతృప్తి అనే కాంతితో అంతరంగం వెలిగిపోతుంది. అయితే ఆ స్థితి స్థిరపడదు. ఆ ఆనందామృత ధార శాశ్వతంగా సాగదు. ప్రార్థనలోని ఈ దివ్యానుభూతిని పొందిన తర్వాత కూడ మన జీవితం ప్రార్థనతో నిండి ఉండదు. పరిస్థితులు వ్యతిరేకించినప్పుడు మనం ప్రార్థన చేస్తాము. అనుకూలిస్తే, ఆ ఆనందాన్ని మరచిపోతాము. భోగ విలాసాల, కోరికల ఊబిలో కూరుకుపోతాము. ప్రార్థనలోని ఆనందానుభూతి మసకబారిపోతుంది. మన ప్రార్థన ఫలించదు. జీవితం అసంతృప్తి అనే కందకంలోకి దిగిపోతుంది.

ఎండి, కృశించి, రాయిగా మారిన మన వ్యక్తిత్వాన్ని నిరంతర ప్రార్థనయే జ్ఞానయుతం చేస్తుంది. కనుక- మనం ప్రతి పనినీ భగవంతుని ప్రార్థనగా చేయాలి. మన స్పందనలు భగవంతుణ్ణి హార్దికంగా ఆహ్వానించాలి. మన ఉనికిలోని కణ కణం ఇష్టదైవంతో ఏకం కావాలి. అప్పుడు, మీరాబాయి యొక్క కృష్ణునివలె, పరమాత్మ మనవెంట ఉంటాడు. మన ప్రార్థన వ్యర్థం కాదు. మన వ్యక్తిత్వం దివ్యత్వంతో నిండుతుంది.

★★★

## రివాల్వరు గురిపెట్టిన ఆజాద్

*విప్లవవీరశేఖరుడు చంద్రశేఖర ఆజాద్ అజ్ఞాతవాసంలో ఉన్నాడు. మాతృభూమి స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ ప్రభుత్వంతో ఆయన సంఘర్షణకు తలపడ్డాడు. ఆ రోజులలో ఆయన తల్లి జగరానీదేవి దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తోంది. ఒంటికి కప్పుకునేందుకు ఒక ముతక చీరగాని, పొట్ట నింపుకునేందుకు రెండురొట్టెలు కాని, రుచికి కొంచెం ఉప్పుగాని ఆమెకు లభించడంలేదు. ఇరుగు పొరుగు వారు ఆమె వైపు చూడనైనా చూడటం లభించటంలేదు. ఇరుగు పొరుగు వారు ఆమె వైపు చూడనైనా చూడటం మానివేశారు. ఆజాద్‌కు సహాయం చేశారనే అనుమానంతో తమను పీడిస్తారేమోనని అందరికీ భయం. దేశంలో ఆవుకు ఇంత మేత, ముష్టికి ఇంత అన్నం పెట్టే ఆచారం ఉంది. చీమలకు ఆహారంగా పిండిని చల్లే సంప్రదాయముంది. అట్టి ఈ దేశంకోసం తన జీవితాన్ని  కణకణం జ్వలింపజేసుకుంటున్న ఒక మహాపురుషుని తల్లి రొట్టె ముక్క కూడలేని స్థితిలో ఉంది. సిగ్గుతో తలదించుకోవలసిన విషయం ఇది. ఆ తల్లి ఇట్టి కష్టాలు పడుతున్న సమాచారం విప్లవవీరులకు తెలిసింది. వారు తల్లడిల్లిపోయారు. ఒక విప్లవవీరుడి వద్ద ఉద్యమం కొరకు సమకూర్చిన డబ్బు ఉండేది. అందులోనుంచి కొంత డబ్బును తీసి ఆమెకు పంపాడు. ఆ మహోన్నత విప్లవనాయకుని మాతృమూర్తికి కొంచెం ఆసరాగా ఉంటుందని అనుకున్నాడు. డబ్బు పంపిన సంగతి ఆజాద్‌కి తెలిసింది. ఆయన క్రోధంతో ఊగిపోయాడు. డబ్బు పంపిన విప్లవకారునిపై రివాల్వర్ గురిపెట్టి ఇలా అన్నాడు – 'మూర్ఖుడా, నీవు చేసిన పనేమిటి? పవిత్రమైన ధనాన్ని ఈ రకంగా వ్యర్థంగా ఖర్చుచేస్తావా? మన దేశభక్తికి మచ్చతెచ్చావు. ప్రభుత్వ ఖజానాను మనం దోపిడీచేసింది ఇందుకొరకా? లూటీ చేసిన సొమ్ము ఇంటికి పంపుకోవడానికా? ఇక మనకూ, దోపిడీదొంగలకూ నడుమ వ్యత్యాసం ఏముంది?' ఆజాద్‌లోని ఈ నిజాయితీ చూసి ఆ విప్లవకారుడు దిగ్భ్రాంతి చెందాడు. నేరస్థుని మాదిరిగా తలవంచుకుని నిలబడ్డాడు.*

*ఒక్క క్షణం తర్వాత రివాల్వర్ ప్రక్కన పెట్టి ఆజాద్ ఇలా అన్నాడు – 'ఈరోజుకు వదలివేస్తున్నాను. ఇకముందు ఇటువంటి పొరపాటు మరలా జరుగకూడదు, గుర్తుంచుకో, దేశానికిచెందిన ధనం మన పొట్ట నింపుకునేందుకు కాదు'.*

**చెవులు రెండు. నోరు ఒక్కటే. ఎక్కువగా విను. తక్కువగా మాట్లాడు.**

ఆచరణలో అధ్యాత్మ

# దైవత్వం నిండాలి మనిషిలో

సహజంగా ఉద్యోగం ఇవ్వాలన్నా, అధికారం అప్పగించాలన్నా, వ్యక్తిని పూర్తిగా పరిశీలించిన తరువాతే ఇస్తూఉంటాము. గీటురాయి మీద పరీక్షించిన తరువాతే కంసాలి బంగారానికి విలువకడతాడు. అదేవిధంగా పరమేశ్వరుని ఆస్థానంలో కూడ పరీక్షించడం జరుగుతూ ఉంటుంది.

మానవతా విలువలను వృద్ధి చేసికోవాలంటే శారీరికంగాను, మానసికంగాను కృషి జరగాలి. మానవత్వానికి మూలధనం చైతన్యం. ఆ చైతన్య స్వరూపంలో సదాశయాలు, ఆదర్శవాదం ప్రస్ఫుటించాలి. ఆచార వ్యవహారాల్లో విశిష్టమైన గుణ, కర్మ, స్వభావాలు గోచరించాలి. మానవత్వానికి మెరుగులు దిద్దుకోవాలంటే మానవునికి సాధన చాలా అవసరం.

సాధకుడు స్వంత విషయాలలో కఠినత్వాన్ని, ఇతరుల విషయాలలో ఉదారతను చూపగలగాలి. కోర్కెలపైన అదుపు, నియమ పాలనలో పట్టుదల పెంచుకోవాలి.

(1) ఇంద్రియ నిగ్రహం (2) ఆర్థిక సంయమనం (3) సమయ సంయమనం (4) ఆలోచనా సంయమనం అనే విషయాలు తపశ్చర్యకు నాలుగు చక్రాల వంటివి. వీటిని క్రమ పద్ధతిలో పాటించినవారే సమాజసేవను సమర్థవంతంగా చేయగలుగుతారు. అప్పుడే సత్ఫలితాలను సాధించగలుగుతారు.

నిజమైన సాధకుడు బహిరంగ వ్యవహారంలో, ఆంతరంగిక వ్యవహారంలో మానవత్వపు శ్రేష్ఠతను విరజిమ్ముతూఉంటాడు. నిర్మలత్వంతో ప్రకాశిస్తూ ఉంటాడు. అటువంటివాని ఆత్మదర్పణంలో ఈశ్వరుని ప్రతిరూపం సాక్షాత్కరిస్తుంది. క్రమంగా ఆతనిలో దైవత్వం ప్రవేశిస్తుంది.

బంగారాన్ని గీటురాయి మీద గీసిచూచుకోవటమే కాక అగ్నిలో వేసికూడ పరీక్షచేస్తారు. అదేవిధంగా సాధకుణ్ణి పరమేశ్వరుడు కొన్ని అగ్నిపరీక్షలు పెట్టి మరీ పరీక్షిస్తాడు. నిస్స్వార్థంగా, నిర్మలంగా, నిబ్బరంగా, నిశ్చలంగా ఆ పరీక్షల్లో నెగ్గినవానినే దైవ స్వరూపుడుగా ఎన్నుకుంటాడు.

"మానవునిలో దైవత్వం" విషయంలో శ్రీ అరవిందుల వారి వలెనే పరమపూజ్య గురుదేవులు కూడ దైవత్వంనిండిన మనస్సునే కోరుకున్నారు. అలాంటి మనస్సు నిండా సమర్పణ భావాన్ని నింపే విధానాన్ని నేర్పారు. గీతలో కూడ సమర్పణ, శరణాగతిని గురించి బలంగా చెప్పబడింది. సమర్పణ భావం వల్ల సంకుచితత్వం తొలగిపోతుంది. "వసుధైవ కుటుంబకం" అన్న నానుడి బలం పుంజుకుంటుంది. "ఆత్మవత్ సర్వభూతాని" అంటూ వ్యక్తులు సమాజ సేవకు నడుం బిగిస్తారు.

అంతరాత్మలో ఈ విధమైన మార్పును తీసికువస్తే, మానవునిలో దైవత్వాన్ని స్థాపించగలుగుతాము.

★★★

పరిధి దాటితే, గౌరవం నశిస్తుంది.

సాధన విజ్ఞానం

# సాధనలో ప్రాధాన్యం మనస్సుకు

పదార్థ జగత్తుకు ప్రాధాన్యం ఉన్నది. అయితే, మనిషి మనస్సు బాహ్య ప్రదార్థాల ప్రభావంపై మాత్రమే ఆధారపడిఉండదు. మానవ చేతన యొక్క వ్యవస్థ, స్థాయికూడ మనస్సును ప్రభావితం చేస్తాయి. కనుక, వ్యక్తి మనస్సు యొక్క సంస్కారాలు బాహ్య జగత్తుకు ప్రతిబింబాలుగా ఉండవు. ఆ సంస్కారాల ప్రపంచం వాటికి భిన్నంగా ఉంటుంది, విలక్షణంగా ఉంటుంది. మనస్సులో నిండిన ఈ ప్రపంచాన్ని శుద్ధి చేయడమే సాధన. ఈ శుద్ధి పదార్థ జగత్తుపట్ల గల దృక్పథాన్ని సంస్కరిస్తుంది, మార్చుతుంది. దానితోపాటు– మనోబలం పదార్థ జగత్తును ప్రభావితం చేస్తుంది. ఈ క్షాళన ప్రక్రియయే, ఈ శక్తి సంపాదన ప్రక్రియయే మనోమయ కోశ సాధన.

ఏకాగ్రతతో చదివే విద్యార్థి ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణు డవుతాడు. సేద్యపు పనులపై మనస్సును లగ్నంచేసే రైతుకు మంచి పంట అందుతుంది. ఉత్సాహంగా వ్యాయామం చేసే వ్యక్తి వస్తాదు అయి కుస్తీలో గెలుపు సాధిస్తాడు. విజ్ఞత, తత్పరత నిండిన మనస్సు వ్యాపారంలో సాఫల్యాన్ని కొనితెస్తుంది. నిష్ఠ కలిగిన మనస్సే సాధనలో సిద్ధిని చేకూర్చుతుంది. తన్మయుడైన కళాకారుడు దర్శకులను ఉర్రూత లూగిస్తాడు. వివిధ రంగాలలో వ్యక్తి పొందే సాఫల్యాలు అతడి మనోబలంలోని తీక్షణతపై, తీవ్రతపై, ఏకాగ్రతపై, లీనంకావడంపై ఆధారపడి ఉంటాయి. సాధనలూ, పదార్థాలూ, సౌకర్యాలూ ఒకే విధంగా ఉన్నప్పటికీ– మానసిక ఏకాగ్రత తీవ్రంగా, మందంగా ఉండడం ఆధారంగా సాఫల్య వైఫల్యాలు లభిస్తాయి.

పదార్థంలో ఉనికి మాత్రమే ఉంది. జీవితం ఇందుకు భిన్నమైనది. కనుక– జీవిత నియమాలు పదార్థ నియమాలకన్న భిన్నమైనవి. పదార్థాలలో స్వతంత్రమైన సంకల్ప శక్తి లేదు. జీవితంలోని వికాసమంతా సంకల్ప శక్తి వల్లనే జరిగింది. ఈ సంకల్పమే జీవులలోని ప్రత్యేకత. మనిషిలోని సంకల్ప శక్తి మరింత క్రియాశీలంగా ఉన్నది కనుకనే అతడి చేతన యొక్క స్థాయి ఉన్నతంగా ఉంది. సంకల్పశక్తిలోని హెచ్చు తగ్గులే ప్రగతి యొక్క వివిధ స్థాయిలకు కారణాలు అవుతాయి. చీకటి నుండి వెలుగుకూ, మృత్యువునుండి అమరత్వానికీ కొనిపోయేది సంకల్ప శక్తియే. కనుకనే, భారతీయ మనీషులు ఇలా ఆకాంక్షించారు–

**తన్మే మనః శివ సంకల్పమస్తు ।**

మహత్తరమైన సంకల్ప శక్తి కోరుకున్న ఫలితాలను ఇవ్వడం నిశ్చయం. యోగవాశిష్ఠం ఇలా చెపుతోంది–

**దృఢ భావనయా చేతో యద్యథా భావయత్యలమ్ ।**
**తత్తత్ ఫలం తదాకారం తావత్కాలం ప్రపశ్యతి ॥**

–4/21/46,47

అనగా– ఈ మనస్సు దృఢ భావనతో ఏవిధంగా సంకల్పం చేస్తే, ఆ మేరకు అంత సమయంలో అలాంటి ఫలితం లభిస్తుంది.

కనుక– ప్రగతికి ప్రధాన రంగం సంకల్పం తీసుకున్న మనస్సు. మనస్సును ఉపేక్షిస్తే సాధన జరగదు. మనస్సు యొక్క ఈ ప్రాముఖ్యాన్ని మరచిపోయి, మలినమైన, అనిశ్చితమైన మనస్సుతో సాధనా మార్గంలో ప్రవేశించే వ్యక్తులు శరీరాన్ని ఎంత కృశింపజేసినా, ఎంత తపింపజేసినా సాఫల్యాన్ని పొందలేరు. వ్రతాలు, ఉపవాసాలు, తపస్సు ఏ మనఃస్థితితో జరుగుతున్నాయన్న విషయాన్ని గురించి సాధకుడు మెలకువ వహించాలి. మనస్సును ఉపేక్షించి జరిపే సాధనలన్నీ నిష్ఫలం కావడం ఖాయం. శరీరంతో కాక– మనస్సుతో సాధన ప్రారంభ మవుతుందన్న వాస్తవాన్ని ఎన్నడూ మరువకూడదు.

★★★

ఆనందాన్ని మించిన పోషకాహారం లేదు.

మనం-మన ఆరోగ్యం

# పంచ తత్వాలతో చికిత్స-1

*"పంచ తత్వాలతో చికిత్స" అనే గ్రంథాన్ని పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య హిందీలో రచించారు. శ్రీ డి.వి.ఆర్. మూర్తి దానిని తెలుగులోనికి అనువదించారు. దాన్ని ధారావాహికగా ప్రచురిస్తున్నాం. గ్రంథం యొక్క "భూమిక"లో పరమపూజ్య గురుదేవులు ఇలా వ్రాశారు-*

*"సృష్టిలోని సమస్త వస్తువుల నిర్మాణం, పరివర్తన, వికాసం, వినాశనం పంచతత్వాల (పంచ భూతాల) రసాయనిక పరమాణువుల ద్వారా జరుగుతుంది. వస్తువుల మంచి, చెడుల స్థితికి ఈ తత్వాల స్థితే కారణ మవుతుంది. అన్య వస్తువుల లాగానే మానవ శరీరం కూడ పంచ తత్వాల ద్వారానే తయారయింది. దాని ఆరోగ్య, అనారోగ్యాలు కూడ వీటి మీదే ఆధారపడి ఉంటాయి.*

*మానవజాతి ఈనాడు శారీరిక అవ్యవస్థతో, బాధలతో, కొరతలతో, వికృతులతో దుఃఖిస్తున్నది. ఎవరిని చూస్తే వారు రోగాలతో, బలహీనతలతో బాధపడుతున్నారు. ఆరోగ్యం జీవనంలో ఒక ప్రముఖ సమస్యగా తయారైంది. దీని పరిష్కారానికి ఎక్కడెక్కడో వెదుకుతూ తిరగడం కన్న శరీర నిర్మాణానికి కారణమైన పంచతత్వాల సహాయం తీసుకుంటే ప్రయోజనం ఎక్కువగా ఉంటుంది.*

*పంచతత్వాల ద్వారా రోగ నివారణ అనేది ప్రాచీన కాలం నుండి వస్తున్నదే. ఋషులు, మునులు వీటి ద్వారానే శారీరిక వికారాల నుండి ముక్తి పొందేవారు. రోగాలు శరీరాన్ని ఆక్రమించినప్పుడు ఈ తత్వాల సహాయంతోనే వాటిని నివారించేవారు. ప్రస్తుతం ప్రాచ్య, పాశ్చాత్య విజ్ఞానవేత్తల అనేక పరిశోధనల తరువాత అనేక రూపాలలో పంచ తత్వ చికిత్స మన ముందుకు వచ్చింది. ఇవన్నీ ప్రాకృతిక చికిత్సలు. అందువలన అధిక ఫలదాయకం, హానిరహితం అయినవి."*

ఈ సృష్టి పంచతత్వాలతో (పంచ భూతాలతో) తయారైంది. ప్రాణుల శరీరాలుకూడ ఈ తత్వాలతోనే తయారయ్యాయి. మట్టి, నీరు, వాయువు, అగ్ని, ఆకాశం- ఈ పంచతత్వాలదే ఈ సృష్టి. కంటికి కనిపించే వస్తువులు గాని, ఇంద్రియాల ద్వారా అనుభవంలోకి వచ్చేవి గాని- అన్నింటి ఉత్పత్తి పంచతత్వాలతోనే జరిగింది. వస్తువుల పరివర్తన, ఉత్పత్తి, వికాసం, వినాశనం ఈ తత్వాల పరిమాణంలో మార్పులవల్లనే జరుగుతుంది.

సృష్టిలోని పరమాణువులు పంచతత్వాలతోనే తయారయ్యాయి. వీటి పరిమాణంపైన పరమాణువులలో కదలికలు ఆధారపడిఉంటాయి. ఈ పంచతత్వాల కదలికలపై భౌతిక జగత్తులోని సమస్త కార్యకలాపాలు ఆధారపడి ఉంటాయి.

భూ మండలంలోని విభిన్న భాగాలలో కనబడే భిన్నత్వం వెనుక తత్వాల పరివర్తనే పనిచేస్తూ ఉంటుంది. ధృవ ప్రాంతాలలో చలి ఎక్కువ. మంచు పేరుకొని ఉంటుంది. వనస్పతులు ఎదగవు. చలికి తట్టుకోగలిగే, వేళ్ళతో లెక్కగట్టగలిగే ఏవో కొన్ని జీవులే అక్కడ నివసిస్తాయి. ఈ విచిత్రానికి కారణం అక్కడ అగ్నితత్వం తక్కువగా ఉండడం. దక్షిణాఫ్రికా, దక్షిణ అమెరికాల్లో వేడి చాలా అధికంగా ఉంటుంది. ఆ ప్రదేశాలలో భూమి అగ్నిగుండాన్ని మరిపిస్తుంది. అన్ని దిక్కులలో అగ్ని పుడుతూఉంటుంది. సూర్యుడి ప్రచండ కిరణాలు రసయుక్తమైన వస్తువుల రసాన్ని నాశనంచేసి వాటిని తమ జ్వాలలలో మాడ్చివేస్తాయి. ధృవ ప్రదేశాలకు భూమధ్యరేఖకు సమీపాన ఉండే ప్రాంతాలకు మధ్య కనబడే అసాధారణ అంతరానికి కారణం అగ్నితత్వపు హెచ్చుతగ్గులే. అరబ్బు దేశాలలో వచ్చే తుఫానులు అక్కడి వాయుతత్వ అధిక్యాన్ని తెలియజేస్తాయి. అస్సాంలో తూర్పు ద్వీప సమూహాలలో వర్ష ఆధిక్యం జలతత్వ ఆధిక్యాన్ని తెలియజేస్తుంది. అక్కడ దట్టమైన అరణ్యాలు, విచిత్రమైన మొక్కలు, జీవజంతువులు, ఖనిజ పదార్థాలు ఉంటాయి. ఈ తేడాలకు ఆ ప్రాంతాల తాత్విక హెచ్చుతగ్గులే కారణ మవుతాయి.

నీరు, గాలి - వీటి ప్రభావం ఆరోగ్యం మీద ఉంటుందనేది సుప్రసిద్ధం. శీతల ప్రాంతాలైన యూరప్

**అనుభవంతో వచ్చే జ్ఞానమే అసలైన జ్ఞానం -దలై లామా.**

దేశాలవారి రంగు, రూపం, ఒడ్డు, పొడుగు, ఆరోగ్యం– ఆఫ్రికా నివాసుల రంగు, రూపు, ఆరోగ్యం సర్వదా భిన్నంగా ఉంటాయి. పంజాబ్, కాశ్మీర్, బెంగాల్, దక్షిణ భారత ప్రజల శరీరాలలో, ఆరోగ్యంలో తేడాను మనం ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నాము. ఇది జల, వాయువుల తేడా. కొన్నిచోట్ల మలేరియా, పచ్చకామెర్లు, మలబద్ధం, చర్మరోగాలు, బోదకాలు, కుష్ఠు మొదలైన రోగాలు ప్రబలి ఉంటాయి. కొన్నిచోట్లకు వెళ్ళగానే అతివేడిలాంటి కష్టసాధ్యమైన, అసాధ్యమైన రోగాలు కూడా నయమవుతాయి. ఈ విషయం పశువులకు కూడ వర్తిస్తుంది. హిస్సార్ గోవుకు, నిజామాబాద్ గోవుకు మధ్య ఆకాశానికి, భూమికి ఉన్నంత తేడా ఉంటుంది. ఈ ప్రభావం ఆహార పానీయాల మీద కూడా పడుతుంది.

గోధుమలు, బియ్యం, పాలు, నెయ్యి, చేపలు, టీ, ఆకుకూరలు, ఔషధాలు, వనస్పతులు మొదలయినవాటి గుణాలు, రుచులు ప్రాదేశిక అంతరాలు ఆధారంగా మారుతూ ఉంటాయి. ఆయా ప్రాంతాలలోని తత్త్వాల పరిమాణంలో హెచ్చుతగ్గులే ఈ ప్రాదేశిక అంతరాలకు కారణాలు.

శరీరంలోని తత్త్వాల పరిమాణంలోని తేడాలు ఆధారంగా దేహ నమూనా, స్వభావం తయారవుతాయి. మగ, ఆడపిల్లల ఉత్పత్తికి ఆధారం స్త్రీ పురుషులలోని తత్త్వాల హెచ్చుతగ్గులే. కొందరికి ఒక వాతావరణం అనుకూలంగా ఉంటే, మరికొందరికి మరో వాతావరణం పడుతుంది. ఒకరికి ఒక వస్తువు రుచికరంగా, హితకరంగా ఉంటే మరొకరికి మరో వస్తువు అనుకూలంగా ఉంటుంది. మానవులలో తత్త్వాల పరిమాణంలో భిన్నత్వం ఉంటుందని ఈ విషయాలు తెలియజేస్తున్నాయి.

ఆరోగ్యంగా ఉండడం లేదా రోగాల పాలవడం తత్త్వాల స్థితి మీదే ఆధారపడి ఉంటుంది. ఆహార విహారాల పట్ల సరియైన అవగాహన, శ్రద్ధ చూపించకపోవడం వల్ల తత్త్వాల నియమిత పరిమాణం తగ్గుతూ పెరుగుతూ ఉంటుంది. ఫలితంగా రోగాలు వస్తుంటాయి. వాయు పరిమాణంలో తేడా రావడం వల్ల కీళ్ళవాతం, పక్షవాతం, నొప్పులు, వణుకు, కోపం, నరాల విక్షేపం, గుల్మం మొదలైన రోగాలు ఉత్పన్న మవుతాయి. అగ్నితత్త్వ వికారాల వలన వ్రణాలు, కురుపులు, మొటిమలు, రక్తపిత్తం, కలరా, నీళ్ళ విరేచనాలు, క్షయ, సిఫిలిస్ మొదలైన రోగాలు ఆక్రమిస్తాయి. జలతత్త్వ వికారం వల్ల జలోదరం, మలబద్ధం, అతిసారం, బహుమూత్రం, ప్రమేహం, స్వప్నదోషం, నీరుపట్టడం, ప్రదరం, జలుబు, దగ్గులాంటి రోగాలు ఉత్పన్న మవుతాయి. పృథ్వీతత్త్వం పెరగడం వల్ల బోదకాలు, ప్లీహము, క్రొవ్వు పెరగడం, స్థూలకాయం మొదలైన రోగాలు వస్తాయి. ఆకాశతత్త్వ వికారం వల్ల మూర్ఛ, అపస్మారం, పిచ్చి, ఉన్మాదం, వ్యామోహం, అనిద్ర, భ్రమ, తత్తరపాటు, వ్యాకులత, దుఃస్వప్నాలు, చెముడు, నిర్లక్ష్యం, మరుపు మొదలైన రోగాలు వస్తాయి. రెండు, మూడు లేదా నాలుగైదు తత్త్వాల సంయుక్త వికారం వల్ల వికారాల పరిమాణం బట్టి అనేకానేక రోగాలు ఉత్పన్న మవుతాయి.

అగ్నితత్త్వం తక్కువైతే జలుబు, నపుంసకత్వం, కీళ్ళవాతం, మందాగ్ని, శుష్కించిపోవడంలాంటి రోగాలు ఉత్పన్న మవుతాయి. అగ్నితత్త్వం ఎక్కువైతే మశూచి, జర్వం వ్రణాలులాంటి వ్యాధులు వస్తాయి. ఇదేవిధంగా ఇతర తత్త్వాలలో హెచ్చుతగ్గులు అనేక వ్యాధులకు మూల కారణా లవుతాయి. శరీరం పంచతత్త్వాలతో తయారైంది. తత్త్వాలన్నీ తమ నియమిత పరిమాణాలలో యథోచితంగా ఉంటే వ్యాధులేవీ రావు. ఉండవలసిన పరిమాణంలో తేడా వచ్చేకొలది వ్యాధులు ప్రారంభమవుతూఉంటాయి. ఆహార పదార్థాలు రుచికరంగా, ప్రయోజనకరంగా ఉండడం అనేది వాటిలో వాడే పదార్థాల పరిమాణ నిష్పత్తిపై ఆధారపడి ఉంటుంది. ఆహారం తయారుచేయడంలో నీటిని హెచ్చుతగ్గులుగా వాడడం వల్ల ఉప్పు, పంచదార, నెయ్యి మొదలైన వాటిని ఎక్కువగా లేదా తక్కువగా వాడడం వల్ల ఆ పదార్థాల రంగు, గుణం, రుచి పాడయిపోతాయి.

ఏ కారణం వల్ల తత్త్వాలలో వికారం ఉత్పన్నమైందో ఆ కారణాన్ని తొలగిస్తే వికారాలు తొలగిపోతాయి. ముల్లు గుచ్చుకొని నొప్పి అనిపించినపుడు ఆ ముల్లు తీసివేస్తే నొప్పి తొలగిపోతుంది. యంత్రాలలో కందెన (గ్రీజు) లోపిస్తే యంత్రాలు పెద్దపెద్ద శబ్దాలు చేస్తాయి. అది అరుగుదలకు కూడ కారణమవుతుంది. కందెన సమకూరిస్తే స్థాయిలో పనిచేస్తాయి. శరీర ఆరోగ్య విషయంలో కూడా ఇదే వర్తిస్తుంది. ఏ తత్త్వ వికారం వల్ల సమస్య ఉత్పన్నమైందో దానిని సంస్కరిస్తే ఆ ఆపద తొలగిపోతుంది.

తత్త్వ చికిత్సకు ఇదే ఆధారం. పంచతత్త్వాలతో తయారైన శరీరాన్ని రోగరహితంగా ఉంచాలంటే పంచతత్త్వాల ద్వారా చికిత్సచేయడం అత్యుత్తమమైన మార్గం. తద్వారా సర్వవ్యాధులను సులభంగా నివారించవచ్చు.

★★★

పొగడ్త మూడుకాళ్ల కుర్చీ. విర్రవీగి కూర్చుంటే వెనక్కితూలే ప్రమాదం ఉంది.

ధారావాహిక : దేవసంస్కృతి సౌరభం-9

# అంతటా దర్శించు ఆ పరమాత్మను

అంతరాత్మలో దాగిఉన్న ప్రేమ, సద్భావాలను ఇతరులలో అత్యధికంగా వికసింపజేసి జీవితాన్ని ధన్యం చేసుకోవడం మన సంస్కృతియొక్క తత్వం.

అంతరంగంలో గల సద్భావములను వికసింప జేయుటకు భారతీయసంస్కృతి ఎక్కువ ప్రాధాన్యమునిస్తుంది. "శీలం హి శరణం సౌమ్య" (అశ్వఘోషుడు). మంచిస్వభావమే మనుష్యునికి రక్షణ. దానివల్లనే మంచి సమాజం, మంచి పౌరులు నిర్మింపబడతారు.

**"తీర్థానం హృదయం తీర్థం, శుచీనాం హృదయం శుచిః"**

*(మ.భా.శా॥ప. 191-17)*

"అన్ని తీర్థాలకన్న హృదయమే గొప్పతీర్థం. అన్ని పవిత్రతలకన్న అంతరాత్మ పవిత్రతయే ముఖ్యము."

మన జీవనాన్ని, సమాజాన్ని పెంచి సన్మార్గంలో నడిపించగల అన్ని విధాలయిన గొప్ప ఆలోచనలు మన అంతరాత్మలో కలవని మనం భావిస్తూ, జీవిస్తూ వచ్చాము. ఇందుకు కారణం మన ఆత్మ సాక్షాత్ భగవానుని నివాసం కావడమే. ఏవిధంగా సాలెపురుగు పైకి ఎగబ్రాకుతుందో, ఏవిధంగా అగ్ని అనేక నిప్పురవ్వలను విరజిమ్ముతుందో- అదేవిధంగా ఈ ఆత్మ నుండియే సమస్త దేవతలు, అన్నిప్రాణులు మార్గదర్శనాన్ని శుభసందేశాలను పొందడం జరుగుతుంది. నిజానికి ఆత్మయే నిజమైన గురువు.

**"శాశతా విష్ణురపోసస్య జగతోయో హృదిస్థితః ।**
**న మృతే పరమాత్మానం తాతకః కేన శాస్యతే ॥**

-విష్ణు. *1/17/20*

"హృదయమందున్న విష్ణుభగవానుడే జగత్తు అంతటికీ ఉపదేశకుడు. ఆయనగాక ఇంకెవరు ఎవరికైనా బోధించగలరు?"

భారతీయ సంస్కృతి ఇతరులపట్ల ఉదారతతో మెలగడం అనే విషయాన్ని నొక్కిచెబుతుంది. మనం మనుష్యులను పూజించాలి. మనిషిని మనిషిగా భావించిగాక ఈశ్వర స్వరూపంగా భావించి పూజించడం జరుగుతుంది. ఆవిధంగా మనుష్యుని ఉపాసిస్తే, అది ఈశ్వరోపాసనయే ఔతుంది. మనవద్దకు ఎవరు వచ్చినా వారిని భగవత్స్వరూపులుగా భావించి స్వాగతించాలి. మనలోపలినుంచి అమృతాన్ని ప్రవహింపజేయాలి. తద్వారా ఇతరులు కూడా తమ వ్యక్తిత్వాలను అధికాధికంగా వికసింపజేసుకొనునట్లు చేయాలి.

## వసుధైవ కుటుంబకమ్

భారతీయ సంస్కృతి విశ్వకళ్యాణానికి ఎక్కువ ప్రాధాన్నిచ్చింది. మన వ్యక్తిగత అవసరాలను తగ్గించుకోవడం, మన సమయం, శక్తి, యోగ్యతలలో ఎక్కువభాగం విశ్వకళ్యాణం కొరకు వినియోగించడం మనకు ఆదర్శం. అతితక్కువగా తినడం, కట్టడం చేస్తూ వీలయినంత ఎక్కువగా సేవచేయడం, తిండిమీద మక్కువతో అతిగా తినకుండాఉండడం, విలాసం కొరకు, ప్రదర్శనకోసం విలాస వస్త్రాలు ధరించకుండా ఉండడం- అన్నవి మనకు పరిపాటిగా వస్తున్న ఆచారాలు. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికే, దానితో విశ్వానికి సేవ చేయడానికే మనం తిండి తింటాము.

వ్యాయామం చేసేవారిపై వృద్ధాప్యం దాడిచేయలేదు -చరక మహర్షి.

భారతీయ సంస్కృతిని పూజించేవారు శుచియైన వస్త్రాలు ధరిస్తారేగాని ప్రదర్శనకోసం ధరించరు. వాళ్లు తక్కువగా నిద్రిస్తారు. ఆడంబరాలకు, సాంసారిక విలాసాలకు దూరంగా ఉంటారు. పూర్తిగా త్యాగం చేయకుంటే లోక కళ్యాణానికి ఆస్కారమే ఉండదు.

మన రాజులు, మహారాజులు కూడా రాజ్యపాలన కొనసాగిస్తూ రాజ్యసుఖాలపట్ల ఎల్లప్పుడూ అనాసక్తితో జీవించేవారు. తమశరీరాల మీద వ్యామోహం లేకుండా బ్రతికేవారు. అందుకే జనక మహారాజును విదేహుడని పిలవడం జరిగేది. తనకు శరీరముందన్న జ్ఞానం కూడా ఆయనకుండేది కాదు. విరక్త శిరోమణి అయిన శ్రీ శుకదేవుడిని గురువుగా భావించి ఆయననుంచి అనేకమంది జ్ఞానోపదేశాన్ని పొందేవారు. అటువంటి పరమ జ్ఞానినిగురించి ఏమి చెప్పగలము? తులాధరుడు వైశ్యుడు. తన వ్యక్తిగత సౌకర్యాలను ప్రక్కకుపెట్టి నిరంతరం కొనుగోలుదారుల హితాన్నే చూచేవాడు. ధర్మ వ్యాధుడు శూద్రుడు. అతని త్యాగ గుణానికి బ్రాహ్మణుడు కూడా తలవంచి నమస్కరించాడు. మహర్షి యాజ్ఞవల్క్యుడు కేవలం ఒక కౌపీనం, కమండలం మినహా మరేదీ తనవద్ద ఉంచుకునేవాడు కాదు. శ్రీ శుకదేవుడు, శ్రీ శంకరాచార్యులు వంటివారు నిరంతరం లోకహితకార్యాలనే చేసేవారు. ఈవిధంగా అనేకమంది జ్ఞానులు నిష్కామ భావనతో పరోపకారాలను, సమస్త ప్రాణులకు సేవలను చేయడమే తమ జీవన లక్ష్యంగా పెట్టుకోవడం జరిగింది.

భారతీయ సంస్కృతి, "ఓ మానవులారా! మీ గుండెలలో విశ్వప్రేమ అన్న జ్యోతిని వెలిగించండి. అందరినీ ప్రేమించండి. మీ భుజాలకు సమస్త ప్రాణులను ప్రేమ పాశంతో కట్టివేసుకోండి. జగత్తులోని ప్రతికణాన్ని మీ ప్రేమ ప్రవాహంలో ముంచండి. విశ్వప్రేమ అన్నది ఒక హృదయాన్ని ఇంకొక హృదయంతో కలిపే ఒక రహస్యమయరసం. అది సమస్తరోగాలనూ నయంచేసే అలౌకిక శక్తి కలిగిన మందు. బ్రతకాలంటే ఆదర్శంకోసం, ఉద్దేశ్యంకోసం బ్రతుకు! నీ తండ్రి తాత లిచ్చిన సంపదను కాపాడుకో! అందరినీ నీవాళ్లనుకో! విశ్వమందలి సమస్త వస్తువులను నీవిగా భావించి నీప్రేమ నీడలో కాపాడుకో! అందరినీ ఆత్మభావంతో, ఆత్మదృష్టితో చూచుకో!" – అని హెచ్చరించింది.

★★★

## ప్రతియువకుడూ యువరాజే

*ఓర్ఛా (మ.ప్ర) మహారాజా వీరసింహ దేవ ఖడ్గహస్తుడై నిలుచున్నాడు. ఆయన బంధితుడైన రాజకుమారుడిని అడిగాడు – 'ప్రవీణరాయ్! ఆ భక్తున్ని హత్యచేసింది నీవేనా?' పొగరుబోతు అయిన ప్రవీణ్‌రాయ్ ఇలాచెప్పాడు – 'హత్యచేయలేదు. నేను వేటాడుతుంటే అడ్డు చెప్పాడు ఆ బాబా. ఆ దుస్సాహసానికి దండన విధించాను' ప్రధానమంత్రి, ఇతర మంత్రులు మహారాజుని వేడుకున్నారు. యువరాజుకు కఠోరమైన దండన విధించవద్దని అభ్యర్థించారు. 'లేదు, ఇట్టి పొగరుబోతు యువరాజు సింహాసనానికి వారసుడుగా వుండజాలడు. ఇతడు ప్రజలు అందరూ గౌరవించే ఒక భక్త శిరోమణిని హత్యచెయ్యటానికి వెనుకాడలేదు' ఇలా చెపుతూనే మహారాజు యువరాజు మెడను దఢేలుమని తెగవేసి ఇలా గర్జించాడు – 'ఈ సింహాసనానికి వారసుడు వెళ్ళి పోయాడని ఎందుకు అనుకోవాలి? ఈ భూమిపై జన్మించిన ప్రతి పుత్రుడు రాజ్యపుత్రుడే. కనుక సింహాసనం మీద కూర్చునేందుకు యోగ్యుడు. ప్రతియువకుడు యువరాజు కాగలడు.' న్యాయం అనే అగ్నిజ్వాల నుండి ఓర్ఛ రాజ్యం సమతాశక్తి దుర్గంగా లేచింది. శత్రువులకు సింహస్వప్నం అయింది.*

**నీ వృత్తిని దైవంగా భావించు. అది నిన్ను దైవంలా కాపాడుతుంది.**

ధారావాహిక : భక్తిగాథ-4

# వ్యక్తిత్వాన్ని అమృతమయం చేస్తుంది భక్తి

హిమాలయాల్లో జగదంబ ప్రకాశం చాలా సేపటిదాకా ఉంది. రాను రాను ఆ ప్రకాశం అక్కడ ఉపస్థితులైన దేవతలూ, ఋషులూ, సిద్ధుల అంతరంగంలో నిలిచిపోయింది. పరమ ప్రేమ యొక్క ఈ అనుభూతికి అందరూ హర్షంతో పులకరించిపోయారు. భక్తివిహ్వలత వారి కళ్లలో వెలుగుతున్నది. భక్తి రహస్యాల్ని ఇంకా తెలుసుకోవాలన్న ఉత్కంఠతో వారు దేవర్షివేపు చూశారు. సర్వవ్యాపి ఐన పరమాత్మ అంతరంగాన్నే తెలుసుకోగలిగిన దేవర్షికి వీరి ఉత్కంఠ అవగతమైంది. తామే స్వయంగా దుర్లభమైన మరొక భక్తి సూత్రాన్ని తెలపాలనుకున్నారు. సత్య జిజ్ఞాస సద్గురువులను ఇంకా ఎంతో తెలపాలని ప్రేరేపిస్తుంది కదా.

దేవర్షి హృదయంలో భక్తిభావాల శతపత్ర కమలం వికసించి ఆ సుగంధం వాక్కు ద్వారా ప్రస్ఫుటమైంది. వారు ఇలా చెప్పారు– "ప్రేమ వికసించినపుడు అహం కరిగి పోతుంది. అలాంటపుడు స్వార్థానికి చోటెక్కడుంటుంది? జగత్కల్యాణ కామన, అఖిల సృష్టిలోని చరా చరాలకు కల్యాణం జరగాలనే కోరిక ఒక్కటే మిగిలి పోతుంది. వ్యక్తిత్వంలో పరమ దుర్లభమైన అమృతతత్వం వికసిస్తుంది. నా భక్తి దర్శనం లోని తరువాతి సూత్రం ఇది"–

'అమృత స్వరూపాచ ॥3॥' "భక్తి అమృత రూపం. భక్తి ఎవరిలో సంపూర్ణంగా వికసిస్తుందో, వారి వ్యక్తిత్వం అమృత జలపాతం అవుతుంది. ఆ పావన స్పర్శచేత అసంఖ్యాకులు నవజీవనాన్నీ, దివ్య జీవనాన్నీ పొందుతారు. వారి ప్రాణ చేతనలో భక్తి సంచరిస్తుంది."

మహర్షి వామదేవుని, బ్రహ్మర్షి భృత్సమదుని అంతరంగాలు దేవర్షి దివ్య వచనాలకు పులకరించి పోయాయి. వారు పూర్తిగా భావ సమాధిలో మునిగిపోయారు. తక్కిన ఋషులందరూ ఈ సత్యాన్ని అవగతం చేసుకున్నారు. దేవర్షితో వారిలా అన్నారు– "దేవర్షీ! మీరు ధన్యులు. మీ అమృతవాణి భావ చేతనను సమాధి స్థితికి తీసుకువెళ్తుంది." ఋషుల ఈ మాటలకు భాగవతోత్తముడైన నారదుడు వినమ్రతతో చేతులు జోడించి నెమ్మదిగా ఇలా చెప్పారు– "ధన్యత భగవంతుడైన సదా శివునిది. విషాన్ని సేవించిన ఆ నీలకంఠ భోలానాథుడు తను అమరుడవడమే కాక, అసంఖ్యాకులైన భక్తులకు అమరత్వమనే వరాన్ని ప్రసాదిస్తున్నాడు. భక్తి యొక్క పరమోజ్వలమైన ఆదర్శం వారిది. వారి లీలలలో భక్తి స్వభావసిద్ధంగా విహరిస్తుంది."

నారదుని మాటలలోని సత్యం అందరికీ అవగతమైంది. హిమాలయ దివ్య పరిసరాల్లో ఉంటున్న చాలామంది ఋషులు చిరంజీవులు. వారు భగవంతుడైన సదాశివునీ, వారి లీలలనూ స్వయంగా చూశారు. వారంతా దానికి సాక్షులే కాక సహచరులు కూడ. మహర్షి హృత్సమద, మహర్షి క్రతువులకు మహాదేవ శంకరుడు విషపానం చేసిన లీల స్మరణకు వచ్చింది. క్రతు మహర్షి ఇలా చెప్పారు– "భగవంతుడైన శివుడు లేనట్లయితే సృష్టి ఉండేదికాదు. ఇది సత్యం. ఆయనే సృష్టికి ఆది, మధ్య, అంతము. సృష్టిలో ఎప్పుడైతే మహా ఆపదలు సంభవిస్తాయో, అప్పుడల్లా మహాకాలుడు స్వయంగా అవతరించి మహా విపత్తులను తొలగిస్తున్నాడు."

క్రతువు చెప్పిన విషయాన్ని సమర్థిస్తూ భృత్సమదుడు సముద్ర మథనాన్ని గురించి ఇలా అన్నారు– "సముద్ర మథనం యొక్క ప్రారంభ దశ ఎంతో దారుణమైంది. అమృతం కావాలనే ఆశతో దేవ దానవులు సాగరాన్ని మథిస్తున్నారు. కూర్మావతారుడైన భగవంతుని వీపుమీద మందరాచలం తిరుగుతున్నది. ఆ శబ్దానికి బ్రహ్మాండం కదిలిపోతోంది. అందరూ సముద్రం నుండి అమృతం ఉద్భవిస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నారు. కానీ వెలువడింది మహావిషం. అమృతం కోసం అందరూ ఆశపడ్డారు కానీ ఈ విష జ్వాలలలో జ్వలించడానికి ఎవరూ సిద్ధంగా లేరు. సృష్టి అంతా త్రాహి త్రాహి అంటున్నది. ప్రాణులు వ్యాకులపడిపోతున్నారు.

సమస్యనుండి సమస్యకు ప్రయాణమే జీవితం.

ఈ విషజ్వాలలకు చెట్లుసైతం మాడిపోతున్నాయి. అందరికీ ఈ మహావిపత్తు నుండి రక్షించగలగిన వాడు సదాశివుడొక్కడే అగుపించాడు. అందరూ పరుగెత్తుకుంటూ సదాశివుని వద్దకు వెళ్ళారు. ఆ సమయంలో ప్రభు చైతన్యం పరాచైతన్య భక్తిలో లీనమై ఉంది. భగవంతుడు భక్తి యొక్క భావ సమాధిలో లీనమై ఉన్నాడు. చిత్ శక్తి జగదంబ వారి సేవలో లీనమై ఉంది. ఆమె వీరందరి బాధనూ విన్నది. సృష్టికి జననీ, ప్రేమమయీ అయిన మహామాత తన సంతానం యొక్క ఆపదకు వ్యాకులపడింది.

''ఆమె భగవంతుణ్ణి సమాధి స్థితి నుండి మేల్కొలిపింది. వారి దృక్కులు కరుణతో నిండి ఉన్నాయి. అందరికీ వచ్చిన ఆపదకు వారు కరిగిపోయారు. ఆ సమయంలో మహాదేవుని చూచినవారికి భక్తిలో శీతలతయే కాదు, మహాశక్తి యొక్క ప్రచండత కూడ ఉంటుందని అనుభవమైంది.'' ఇలా చెపుతూ హృత్సమడు నారదుని వంకచూచి "దేవర్షీ! అప్పుడు మీరు కూడ ఉన్నారు కదా. ఈ విషయం గురించి చెప్పండి"– అని అడిగారు. నారదమహర్షి గత స్మృతిని తలచుకుంటూ ఇలా అన్నారు–

"దేవతలూ, దానవులూ, మానవులూ అందరూ తపస్సు చేస్తారు. కానీ వారి తపస్సు అహంకార, మమకారాల చుట్టూ తిరుగుతుంటుంది. వారిలో శివతత్వముండదు. మహాదేవుని తపస్సు సృష్టిలోని ప్రాణుల్లో సంచరిస్తుంటుంది. ఆ శక్తి చేత సృష్టి, స్థితి, లయములు కలుగుతాయి.

"ఆ సమయంలో సృష్టి యొక్క లయా, గతిక్రమమూ తప్పుతున్నవి. డమరుధరుడు, శూలపాణి సృష్టి యొక్క ఆపదను హరించడానికి లేచారు. క్షణంలో సాగర మథనం జరుగుతున్న స్థలానికి వెళ్ళాడు. ఆయన్ని చూచేసరికి అందరిలో ఆశాజ్యోతి వెలిగింది. భోలానాథుడు మహాజ్వాలలతో ఉన్న హాలా హలాన్ని చూశారు. క్షణంలో దాన్ని మింగేశారు. అంతా శాంతించినట్లయింది. శంకరుని మహిమ తెలిసిన వారు శాంత చిత్తులైనారు. సందేహస్పదులు మాత్రం ఆ విషంవల్ల శంకరుడేమౌతాడోనని సందేహించారు.

"భావభక్తి చేత అమరులైన వారిని విషస్పర్శ ఏం చేస్తుంది? ఎవరి హృదయంలో భక్తియొక్క పవిత్ర జ్యోతి వెలుగుతుంటుందో వారి దరిదాపులకు ప్రపంచంలోని చీకటి రాదు. సాగర మథన సమయంలో అందరూ శంకరుని భక్తి చమత్కారాన్నీ, వారి మహా తపస్సు యొక్క మహిమనూ గుర్తించారు. అందరికీ ఒక విషయం బోధపడింది. ఎక్కడైతే సమస్త శక్తులూ, దివ్య విభూతులూ నిరర్థక మౌతాయో అక్కడ కేవలం భక్తి యొక్క శక్తియే సార్థక మౌతుంది. భక్తి గాథలోని శివతత్వ స్పర్శచేత అందరూ దివ్యమైన అనుభూతిని పొందారు. శివ స్మరణలో లీనమై నారు. ఈ విధంగా స్తుతించారు–

"యస్యాంకే చ విభాతి భూ ధరసుతా, దేవాపగా మస్తకే
భాలూ బాలవధుర్గ లే చ గరళం య స్యోరసి వ్యాలరాట్।
సోయం భూతి విభూషణః సురవరః సర్వాధిపః సర్వదా
శర్వఃసర్వగతః శివః శశినిభః శ్రీశంకరః పాతుమామ్ ॥

(ఎవరి అంకమునందు హిమాలయ తనయా, శిరస్సుపైన గంగా, లలాటమందు విదియ చంద్రుడూ, కంఠంలో హాలాహల విషమూ, వక్షస్థలంపైన సర్పరాజు ఆదిశేషుడూ, శోభిల్లుచున్నారో– భస్మం చేత అలంకరింపబడి, దేవతలలో శ్రేష్ఠుడై, భక్తుల పాపాలను పోగొట్టువాడూ, సర్వవ్యాపకుడూ, కల్యాణరూపుడూ చంద్రునితో సమానమైన ధవళవర్ణుడూ ఐన ఆ శ్రీశంకరుడు సదా నన్ను రక్షించుగాక.)"

భక్తి భావంతో నిండిన ఈ స్తుతికి హిమాలయంలోని కణ కణమూ పులకరించింది. అందరిలో భక్తితత్వం ఘనీభవించింది. వారు స్తుతించిన విధంగా అదే రూపంలో సదాశివుడు ప్రత్యక్ష్యమైనారు. ఆయనవెంట జగన్మాత ఉంది. సదాశివుడు అందర్నీ ఈవిధంగా ఆశీర్వదించారు– "మీ అందరికీ మేలు కలుగుగాక; మీరందరూ ఈ ప్రపంచంలోని కలుషిత భావాల్ని రూపుమాపి నిర్మలం చేసేందుకు సహకరింతురుగాక."

సదాశివుడూ, జగదంబా కురిపించిన ఆశీస్సులు అందరి మనస్సుల్నీ భక్తి భావంతో తడిపాయి. దేవర్షి నారదుని చైతన్యం గొప్ప భావసమాధిలో లీనమైంది.

★★★

*ఈ పత్రికను మీరు చదివిన తర్వాత*
*ఈ నెలలో అయిదుగురిచేత చదివించండి.*

**వందకోట్లకు అధిపతివైనా ఒక్క నిమిషం ఆయుష్షును కొనలేవని తెలుసుకో**

# పతంజలి యోగదర్శనం-11

# ధ్యానం

మనిషి అనేక రకాల ఆలోచనలు చేస్తుంటాడు. ఎన్నో ఆదర్శాలను అమలుచేయాలని ఊహించుకుంటాడు. ప్రజోపయోగకరమైన ప్రణాళికలను రూపొందించి వాటికోసం శక్తియుక్తులను ప్రయోగించాలనుకుంటాడు. అయితే ఈ ఉత్సాహం కొద్దికాలంలోనే చప్పబడిపోవడం మనం చూస్తుంటాం. నిశితంగా ఆలోచించి చూస్తే- ఉన్నత స్థాయికి చెందిన ఉత్సాహ ప్రోత్సాహాలు కొద్దిరోజుల్లోనే నీరుగారి రూపుమాసిపోతున్నాయి; అవాంఛనీయత దిశగా వేస్తున్న అడుగు మాత్రం అంత తొందరగా వెనుదిరగడంలేదు. అది తన స్థానంలో దృఢంగా నిలదొక్కుకోవడమో మరో అడుగు ముందుకువేయడమో జరుగుతోంది. మాదకద్రవ్యాలకు అలవాటుపడినవారు వాటిని మర్చిపోవడం అంటూ జరగదు. అవి లభించేవరకూ వారు స్థిమితంగా ఉండలేరు. మరో ఆలోచన చేయలేరు. ఏ పనిలోనూ నిమగ్నులు కాలేరు. కాని ఉన్నత స్థాయికి చెందిన కార్యాలలో ఈ పట్టుదల అతి తక్కువగా కనపడుతోంది. నీరు పల్లానికి ప్రవహిస్తుంది. వస్తువులు పైనుండి క్రిందికి తేలిగ్గా పడిపోతాయి. ఈపని భూమిలోని గురుత్వాకర్షణశక్తే చేస్తుంది. ప్రత్యేకించి శక్తిని ఉపయోగించ వలసిన అవసరం ఉండదు. కాని ఏ వస్తువునైనా పైకి విసరాలంటే దానికి కొంత శక్తి ప్రయోగించకతప్పదు. నీటిని మెరకకు పంపాలంటే మరింత శక్తిని ప్రయోగించవలసి వస్తుంది. ఆదర్శవంతమైన ఉచ్చస్థాయి ప్రయత్నాలు అటువంటివే. వాటి కోసం పట్టుదలతో కూడిన ప్రత్యేకమైన ప్రయత్నాలు చేయవలసిఉంటుంది. అటువంటి ప్రయత్నాలకు "ధ్యాన సాధన" ఎంతో బలాన్నిస్తుంది. అది పట్టుదలను పెంచుతుంది; బద్ధకాన్నీ మతిమరపునూ దరి చేరనివ్వదు.

ఒకవిధంగా చూస్తే మతిమరుపు లాభకరంగా కూడా కనపడుతుంది. ఎలాగంటే- ఆత్మీయుల వియోగ, మృత్యువుల వల్ల కలిగే దుఃఖ శోకాలు అతి త్వరగా మరుపునపడి మనిషి త్వరగా కొలుకోగలుగుతాడు. జరిగిన అవమానాలను, అపజయాల బాధను మర్చిపోయి క్రొత్త విషయాలలో నిమగ్నుడు కాగలుగుతాడు. అలా కానట్లయితే జీవితాంతం వాటినే స్మరిస్తూ కృంగి కృశించిపోతాడు. మనో ఫలకం మీద ఎప్పటికప్పుడు పాత విషయాలను తుడిచివేసి క్రొత్త పాఠాలను వ్రాసుకుంటూఉండాలి. ఇది లోకాచారం. అభివృద్ధి చెందే మార్గం కూడా ఇదే.

మరోవిధంగా చూస్తే "మరపు" దుర్గుణంగా, అభివృద్ధినిరోధకంగా ఋజువౌతుంది. అదెలాగంటే - మనసు ప్రపంచపు జిలుగు వెలుగుల భ్రమలో పడి, మూల అవలంబనను మర్చిపోయేలాచేస్తుంది. క్రొత్త క్రొత్త అందాలూ- ఆకర్షణల మాయాజాలంలో చిక్కుకుపోయేలా చేస్తుందీ మతిమరుపు. అటువంటి దశలో ఆదర్శాల పాలనకు, కర్తవ్యాల నిర్వహణకు ప్రత్యేకతనిస్తూ అవి మరుపున పడకుండాచేసుకొనాల్సి ఉంటుంది. అందుకు ధ్యాన ధారణ ఎంతో ఉపయుక్తమైనది.

కనుక మరపు అనే గుణానికి అతి కొద్ది విలువ మాత్రమే ఉన్నది. ద్వేషం, దుర్భావనలు, దుఃఖం, శోకం వంటివాటిని మర్చిపోయే విషయంలో అది ఉపకరిస్తుంది. కాని ఏ ఆధారాలమీద జీవితపు ఉత్కర్ష-అభ్యుదయం ఆధారపడి ఉన్నాయో వాటిని మాత్రం ప్రయత్నపూర్వకంగా స్మృతి పటలం మీద అంకితం చేసుకొనాలి. అందుకు సరళ తరమైన ఉపాయం "ధ్యాన సాధన". దానిని దినచర్యలో ఒక భాగంగా, స్వాభావిక గుణంగా మార్చుకొనాలి. ప్రతిరోజూ చేసే పనులు అలవాటుగా మారిపోతాయి. వాటిని ప్రత్యేకం గుర్తుపెట్టుకొని చేయవలసిన అవసరం లేదు.

**కోకిలకు స్వరమే అందం.**

వాటిని యాంత్రికంగా చేసేస్తాము. కాలకృత్యాలు తీర్చుకోవడం, స్నానం చేయడం, భోజనం, నిద్ర మొదలైనవాటిని నియమిత సమయంలో అలవాటుగా చేసేస్తాము. ఆత్మచింతనను దినచర్యలో ఒక పనిగా, అవిచ్ఛిన్న అంగంగా మార్చుకొనాలి. దీనినే ధ్యానం, పూజ, దైనిక ఉపాసన, సంధ్యావందనం మొదలైన పేర్లతో పిలుస్తాము.

నిజానికి భగవంతునికి ఎవరి స్తుతిపాఠాలుగాని, పొగడ్తలుగాని అవసరంలేదు. ఆయనమీద వీటి ప్రభావం ఏమాత్రం పడదు. ధర్మాచరణ, మర్యాదలను పాటించటం, వర్జనీయాలను విడనాడటం భగవంతునికి ప్రీతికరమైన సాధనలు. నిరాడంబరత, పరిశుభ్రత, సంయమనం, సేవా, సహకారములను జీవితంలో ఆచరించడమే నిజమైన ఈశ్వరోపాసన అనవచ్చు. ఈ సృష్టిలో అనేకరకాల ప్రాణులున్నాయి. అవేవీ ప్రతిరోజూ పూజలూ పురస్కారాలూ చేయవు. అంతేకాక- నాస్తికవర్గానికి చెందిన వారున్నారు. వారికి దేవుడిమీదా నమ్మకం ఉండదు. పూజలు, వ్రతాలు వంటివాటిమీదా నమ్మకం ఉండదు. నమ్మకం లేకపోగా పరుష పదజాలంతో ఆస్తికులను, భగవంతునీ కూడా వారు విమర్శిస్తుంటారు. అయినప్పటికీ భగవంతుడు వీరందరి పోషణ, మంచి చెడ్డలు చూస్తూనే ఉన్నాడు. ఉపాసన, ఆరాధన, ధ్యానం మొదలైన క్రియలు భగవంతుని ప్రసన్నుడిని చేసుకొనే సాధనాలు కావని, తమ ఆత్మశోధనా ప్రక్రియలని దీనివలన స్పష్టపడుతున్నది. ఆదర్శాలను అమలుపరచటంలో, కర్తవ్యనిర్వహణలో లోపం రానివ్వకుండటంలోనే దీని యథార్థం కనిపిస్తుంది. ధ్యానం ఉపయుక్త సమయంలోనే చేస్తుండాలి. అందులో పొరపాటు రానివ్వరాదు. ప్రతిరోజూ ఏవిధంగా ఇళ్లూవాకిళ్లూ శుభ్రపరుచుకుంటామో, శరీర శుభ్రతకు స్నానం చేస్తామో, ఆకలితీర్చుకోవడం కోసం వంట చేసుకుంటామో- అదేవిధంగా మానసిక పరిశుభ్రతకు నాగాలేని ఈశ్వరారాధన ప్రక్రియ నియమిత రూపంలో సాగుతూఉండాలి.

భగవంతునికి మనం చేసే పూజల అవసరం లేకపోయినప్పటికీ, మనం మాత్రం నిత్యమూ నియమిత కాలంలో వాటిని చేస్తూ ఉండాలి. ఇది మన వక్తిగత అవసరం. దీనిలోపం వల్ల ఆత్మోత్కర్ష పథంలో గొప్ప లోటు ఏర్పడుతుంది.

అనేకమైన ఉపాసనాత్మక క్రియాకలాపాలలో ధ్యానధారణ ఉపేక్షించవీలులేనట్టి అతిముఖ్యమైన విషయం. ధ్యానవిధానములు చాలా ఉన్నాయి. వాటిలో ధ్యాన సమయంలో భగవంతుని రూపం ఊహించుకోబడుతుంది. దానితోపాటు ఆయన సాన్నిధ్యం కోరుకోబడుతుంది. ఈ ప్రక్రియతోపాటు ఆత్మపరమాత్మల అవిచ్ఛిన్న సంబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆయనను సర్వవ్యాపకునిగా, న్యాయనిర్ణేతగా అంగీకరించాలి. ఉత్తమమైన మానవజన్మ లభించినందుకు కృతజ్ఞత చూపిస్తూ దానితో జోడించబడి ఉన్న బాధ్యతలను నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలి. ఆత్మిక ప్రగతి కోసం చేయవలసిన కార్యం సరైన రీతిలో సాగుతున్నదా లేదా- అని చింతనచేస్తూఉండాలి. వస్తుతః-ఆత్మసంస్కరణ, ఆత్మశుద్ధి దేని ఆధారంతో పూర్తికాబడతాయో అదే నిజమైన ధ్యానమనబడుతుంది.

జీవిత స్వరూపం, ఉద్దేశ్యం, సదుపయోగములకు తమ ఆలోచనలు, చర్యలు అనుకూలంగా ఉన్నవా లేవా అని ప్రతిక్షణమూ ఆలోచించాలి. ఎక్కడైనా పొరపాటు కనపడితే ఏమరుపాటు లేకుండా దానిని సరిచేయటం, సంస్కరించటం వెంటనే జరగాలి. అలాకాక ఉపేక్షచేస్తుట్లయితే ఆలోచనల్లో భ్రష్టత, శీలంలో దుష్టత్వం చేటు చేసుకుంటున్నట్లు లెక్క. అధికశాతం వ్యక్తులు పొరపాట్లు చేస్తూ పశ్చాత్తాపపడుతూ కాలం గడిపేస్తారు. తెలిసీ, చేయకూడని పనులకు అలవాటు పడతారు. అటువంటివారికి వీలైనంత దూరంగా ఉండాలి. సామాన్య మానవుల గుంపులో తనూ ఒకడుగా మారిపోతే ఇక మానవ జన్మ గరిమను, గొప్పతనాన్ని పెంపొందించుకునే అవకాశమెక్కడ లభిస్తుంది? కనుక స్థాయి తగ్గకుండా ప్రతి నిమిషమూ పరిశీలన చేసుకోవడం ఎంతో అవసరం.

**స్త్రీకి పాతివ్రత్యమే అందం.**

ధ్యానం యొక్క మరొక ప్రక్రియ ఏకాగ్రత. ఇది సాధన కోసం చేసే కసరత్తు వంటిది. అనవసర విషయాలపై ఆసక్తి చూపిస్తూ తన శక్తిని, కాలాన్ని కోల్పోయే అవకాశాన్ని చంచలమైన మనస్సుకు దొరకనివ్వకూడదు. మన జీవితం మీద అసంయమనం అధికారాన్ని సాగించే అవకాశం అందకుండా జాగ్రత్తపడాలి. అందుకోసం ఇంద్రియ సంయమనం, అర్థసంయమనం, ఆలోచనా సంయమనం, సమయ సంయమనాలను మనసుచుట్టూ వలయంలా ఉంచుకునే ఏర్పాటు చేసుకొనాలి. దానివల్ల శక్తుల దుర్వినియోగం అరికట్టబడుతుంది. ఏకాగ్రత పటిష్టమవుతుంది. మనస్సును జ్ఞానసముపార్జన, భావసాధనల యొక్క ఉచ్చస్థాయి క్రియాపద్ధతిలోనికి నియంత్రించ గలుగుతాము. దేవతా ప్రతిమ మీదగాని, మహానుభావుని చిత్రపటం మీదగాని చిత్తం నిలిపి దానితో తాదాత్మ్యం చెందటం వంటి భావ సాధన కూడా ధ్యానమనే చెప్పబడుతుంది. ఈ విధమైన ధ్యానం రోజూ అనేకసార్లు చేస్తున్నట్లయితే, మనోనిగ్రహశక్తి లభిస్తుంది. అది లభించిన వ్యక్తి లక్ష్యంతో తాదాత్మ్యం చెంది గొప్పగొప్ప విజయాలను సాధించగలుగుతాడు.

ధ్యానానికి చేయవలసిన విధానం ఈవిధంగా ఉంటుంది. ఉదయిస్తున్న సూర్యుని స్వర్ణబింబాన్ని ధ్యానకేంద్రంగా చేసుకొనాలి. కండ్లు మూసుకొని "ప్రభాత కాలంలో ఉదయిస్తున్న సూర్యుని కిరణాలు నా శరీరంపై ప్రసరిస్తున్నవి. అవి నా శరీరంలో బలం, మస్తిష్కంలో, జ్ఞానం, హృదయంలో భావసంవేదనలు నింపుతున్నవి"– అని భావన చేస్తూఉండాలి.

స్థూలశరీరానికి నాభిచక్రం, సూక్ష్మ శరీరానికి హృదయం, కారణశరీరానికి మస్తిష్క మధ్యంలో ఉన్న బ్రహ్మరంధ్రం కేంద్ర బిందువులు. ఈ మూడింటిలోనూ సూక్ష్మాతిసూక్ష్మమైన మూడు గ్రంథులున్నాయి. వాటిని కమలములని అంటారు. సూర్యుడు ఉదయించగానే కమలములు వికసిస్తాయి. పరిసరాలను పరిమళంతో, మధువుతో నింపుతాయి. ఈ ధ్యానం ప్రాతః కాలములోనే చేయాలి. మూడు కమల చక్రాలు, త్రివిధ శరీరాల కేంద్రబిందువులు వికసిస్తున్నట్లు భావిస్తూఉండాలి. ఈ సాధనా ప్రక్రియ ఈ మూడు రకాల శరీరాలనూ వికసింపచేస్తుంది. వాటిని ఓజస్సు, తేజస్సు, వర్చస్సులతో తడిపివేస్తుంది.

ధ్యానానికి ఎన్నో విధానాలున్నాయి. ప్రతి దానికి విభిన్న స్థాయిలలో ప్రయోజనాలు ఉన్నాయి. వీటన్నిటిలో పైన పేర్కొన్న మూడు రకాల ధ్యానధారణలు సర్వోపయోగకరమైనవి.

★★★

## నాస్తికుని ఆత్మానందం

*1936వ సంవత్సరం. అది శ్రావణమాసం. విప్లవ దూత స్వామి దయానంద బరేలీకి వచ్చారు. మున్షీరామ్ తండ్రి శ్రీనానక్ చంద్రకు ఆదేశం వచ్చింది. స్వామి దయానంద సరస్వతి ఉపన్యాసాలు చేసేటప్పుడు ఏరకమైన అల్లరి జరగకుండా ఏర్పాట్లు చేయాలి. తగిన బందోబస్తు చేసేందుకు ఆయన స్వయంగా సభకు వచ్చారు. అక్కడ స్వామీజీ ఉపన్యాసం విని ప్రభావితులైనారు. ఆయనకు ఆయనకు విశ్వాసం కలిగింది. తన పుత్రుడు నాస్తికుడు. ఇప్పుడు స్వామీజీ సత్సంగం వల్ల అతని సందేహాలు నివారణ అయిపోతాయి. ఇంటికి వెళ్ళి ఆయన మున్షీరామ్‌తో చెప్పారు – 'బాబూ మున్షీరామ్! ఒక దండి సన్యాసి వచ్చాడు. గొప్ప పండితుడు. గొప్పయోగి. వారి ఉపన్యాసాలు వింటే నీ సంశయాలన్నీ తొలగిపోతాయి. రేపు నాతోరా.'*

*మున్షీరామ్ ఉపన్యాసం వినేందుకు వెళ్ళేవాడు. అతని హృదయం స్వామీజీ చేత ఆకర్షింపబడింది. సముద్రంలో అటూ ఇటూ తిరుగుతున్న ఓడ వెలుగుస్తంభం యొక్క ప్రకాశాన్ని చూచి వేగంగా దాని వైపు వెళ్ళినట్లుగా అతని పరిస్థితి ఉంది. ఒకనాటి ఉపన్యాసం పరమేశ్వరుని అసలు పేరు అయిన 'ఓంకారం' మీద జరిగింది. ఆ ఉపన్యాసాన్ని గురించి మున్షీరామ్ (ఆయన తరువాత శ్రద్ధానంద అని పిలువబడ్డాడు) ఇలా వ్రాశాడు – 'ఆ మొదటి రోజున నాకు కలిగిన ఆత్మానందాన్ని నేనెన్నడూ మరచిపోలేను. నాస్తికుడనై ఉండి కూడా నేను ఆత్మానందంలో మునిగిపోయానంటే అది ఆ ఋషి సత్తమని పని అయి ఉంటుంది'.*

కురూపికి విద్యయే అందం.

ధారావాహిక : గాయత్రీ మహా విజ్ఞానం-27

# సోహం సాధన

ఆత్మయొక్క సూక్ష్మ అంతరాళము నందు తనంతట తానుగా, పూర్ణజ్ఞానము కూడిఉన్నది. అది తన స్థితిని గురించి ఘోషణను ప్రతి క్షణము వినిపిస్తూనే ఉన్నది. కానీ బుద్ధి అటువైపు తిరగడంలేదు. లేనిచో తన్ను తాను మరువడం జరుగదు. కొంచెం ధ్యానం అటు త్రిప్పితే, ఆత్మయొక్క ఆ ఘోషణను మనం వినవచ్చును. ఆ ధ్వనిపై నిరంతరం ధ్యానం ఉంచితే ఆ ఘోషణ చేయు అమృత భాండాగారమగు ఆత్మ వంకకు చేరవచ్చు.

శ్వాస పీల్చేటప్పుడు గాలి లోపలికి పీల్చడంతోపాటు ఒక సూక్ష్మ ధ్వని వినపడుతుంది. "సో... అని. ఎంతసేపు శ్వాస లోపల ఉంటుందో దాన్ని స్వాభావిక కుంభకం అంటారు. ఆ సమయంలో "అ.." అని విరామ ధ్వని వినవస్తుంది. శ్వాస విడిచేటప్పుడు "హం" అని ధ్వని కలుగుతుంది. ఈ ధ్వనుల పైన ధ్యానమును కేంద్రీకరించడం వల్ల ఆజపా జపము యొక్క "సోహం సాధన" జరుగుతుంది.

ప్రాతఃకాలంలో సూర్యోదయానికి ముందు కాలకృత్యములు తీర్చుకొని, తూర్పువైపు తిరిగి ప్రశాంత స్థలంలో కూర్చోవాలి. వెన్నెముక నిటారుగా ఉండాలి. రెండు చేతులను ధ్యాన ముద్రలో ఒడిలో ఉంచాలి. కనులను మూసికోవాలి. నాసిక ద్వారా గాలి లోపలికిపోయేటప్పుడు జాగ్రత్తగా "సో" అనే సూక్ష్మశబ్దం వస్తున్న విషయాన్ని గమనించాలి. శ్వాస లోపల బంధింపబడి ఉన్నప్పుడు 'అ' అనే సూక్ష్మ ధ్వని వెలువడం జాగ్రత్తగా గమనించాలి. దానితోపాటు హృదయమందలి సూర్య చక్రము యొక్క ప్రకాశ బిందువునందు ఆత్మ యొక్క తేజోమయ స్ఫులింగము నందు శ్రద్ధ నుంచాలి. శ్వాసను లోపలికి పీల్చు సమయంలో, ఆ తేజో బిందువు పరమాత్మ స్వరూపమని, అనగా పరమాత్మయని, అహం అనునది తానేనని అనుభవంలోనికి తెచ్చుకోవాలి. వాయువు బయటకు వెళ్లేటప్పుడు ఆ తేజో బిందువు తానేనని భావించాలి.

'అ' అనే విరామ భావన పరివర్తన అవకాశమునకు ప్రతీక. ఆరంభములో ఆ హృదయ చక్రస్థితీ ప్రకాశ బిందువును "సో" ధ్వని వచ్చే సమయంలో పరబ్రహ్మగా తెలియాలి. "హం" శబ్దం వచ్చే సమయంలో జీవునిగా భావించాలి. ఈ భావపరివర్తన కోసమే "ఆ" అనే అవకాశం, పరివర్తనావకాశం. "ఆ" ధ్వని వినిపించదు. శబ్దము సోహం మాత్రమే వినిపిస్తుంది.

"సో" బ్రహ్మయొక్క ప్రతిబింబము. "అ" ప్రకృతికి ప్రతినిధి. "హం" జీవికి ప్రతీక. బ్రహ్మ, ప్రకృతి, జీవుల సమ్మేళనము ఈ అజపాజపంలో జరుగుతుంది. "సోహం" సాధన యందు మూడు మహాకారణములు ఏకత్రిత మగుటవలన ఆత్మ జాగరణమను స్వర్ణసుయోగము ఒక్కసారిగా ఉపలబ్ద మగును.

"సోహం" సాధనలో ఉన్నతి సాధించిన కొలదీ విజ్ఞాన మయ కోశము యొక్క పరిష్కారం కూడ జరుగుతూ ఉంటుంది. ఆత్మజ్ఞానము పెంపొందుతూ నిదానంగా ఆత్మ సాక్షాత్కార స్థితి దగ్గరకువస్తూ ఉంటుంది. ముందుకు సాగిన కొలదీ శ్వాసపైన ధ్యానము నశించి, కేవలం హృదయస్థితి, సూర్య చక్రమందలి విశుద్ధ బ్రహ్మతేజము యొక్క దర్శనమే కలుగుతుంది. ఆ సమయంలో సమాధిని పోలిన అవస్థ కలుగుతుంది. హంసయోగ పరిపక్వత వలన సాధకుడు బ్రహ్మస్థితికి అధికారి కాగలడు.

స్వామీ వివేకానంద విజ్ఞానమయ కోశ సాధనకొరకు "ఆత్మానుభూతి" విధానాన్ని రూపొందిచారు. ఆయన అమెరికన్ శిష్యుడు శ్రీ రామాచరణ్ ఈ విధిని, 'మెంటల్ డెవలప్‌మెంట్' అనే పుస్తకంలో వివరంగా వ్రాశాడు.

★★★

**ఈ నెలలో కనీసం అయిదుగురు వ్యక్తులను పత్రిక చందాదారులుగా చేర్పించండి.**

**తాపసికి ఓరిమియే అందం.**

ధారావాహిక : నా స్మృతిపథంలో గురుదేవులు-19

# బత్తాయిరసం నాచేత త్రాగిస్తావా?

'ఆనంద్' పర్యటనకు గురూజీతో పాటు బయలుదేరాను. ఆ సమయంలో గురూజీకి జ్వరంగా ఉంది. గురూజీని జాగ్రత్తగా చూసుకోమని మాతాజీ నన్ను హెచ్చరించారు. బరోడా స్టేషను సమీపిస్తుండగా, గురూజీ నన్ను హెచ్చరించారు- అక్కడ స్టేషనుకు వచ్చిన కార్యకర్తలకు గురూజీకి జ్వరమని చెప్పి వారిని కంగారు పెట్టవద్దని. స్టేషను రాగానే - పెద్ద సంఖ్యలో స్త్రీ, పురుషులు గురూజీకి స్వాగతం పల్కడానికి వచ్చారు. అక్కడనుండి ఆనంద్‌కు గురూజీని కారులో ఊరేగింపుగా బయలుదేర తీసారు. ఆ ఊరేగింపు మూడు గంటలు పట్టింది. గురూజీ కారులో కూర్చొనే ఉన్నారు అంతసేపూ. యజ్ఞశాలకు చేరగానే గురూజీ ప్రవచనం ఇచ్చారు. దానితో బాగా అలసటచెందారు. జ్వరం పెరిగిపోయింది. నాకు చాలా కంగారుగా ఉంది. ఆనంద్‌లోని పరివార్ శాఖ చాలా బాగా పనిజేస్తూ ఉంది. గురూజీతో అక్కడకు ఇదివరలో 7,8 సార్లు వెళ్లిఉన్నాను. అక్కడ అందరితో నాకు పరిచయాలు ఉన్నాయి. డా॥ ఆశారామ్‌జీ అక్కడ ఒక కార్యకర్త. అప్పట్లో బాగా పని చేసే కార్యకర్తలు సుమారు పదిమంది మాత్రమే. డా॥ ఆశారామ్‌జీతో గురూజీ జ్వరం విషయం చెప్పి, చూడమన్నాను. నేను చెప్పినట్లు గురూజీకి తెలియకూడదు. వారి పాదాలు తాకినప్పుడు వేడిగా ఉండటంతో తెలిసికొన్నానని చెప్పాలి అన్నాను. ఆశారామ్‌జీ శాంతీభాయ్ ఇంటి వద్దే ఉండిపోయారు నాకోర్కె ప్రకారం. ఆయన గురూజీ పాదాలు తాకి, 'గురూజీ మీకు జ్వరం వచ్చినట్లు ఉంది. పాదాలు వేడిగా ఉన్నాయి. ఇప్పుడు మీరు విశ్రాంతి తీసుకోవాలి'- అన్నారు. గురూజీ మౌనంగా ఉన్నారు. ఆశారామ్‌జీ నాతో బత్తాయిరసం తీసికొని రమ్మన్నారు. దాన్ని గురూజీతో త్రాగించండి, రేపటిదాకా చూసి మందులు వాడదామన్నారు. అలాగే బత్తాయి రసాన్ని తెచ్చి, గురూజీకి ఇచ్చాను. ఒక్క గుక్క త్రాగి, ఉమ్మివేసి నోరు శుభ్రపరచు కొన్నారు. ఆ రసం గ్లాసును విసరివేశారు. కోపంగా నా వంక చూసి, తపోభూమిలో నా శిష్యులకు సరైన మంచినీళ్లు దూరంనుంచి తేవాల్సిఉండగా, నీవు నాచేత బత్తాయి రసం త్రాగిస్తావా- అని కసురుకున్నారు. నాకు భయంవేసింది. మరునాడు ఆశారామ్‌జీ వచ్చి పరీక్షించారు. గురూజీకి ఆస్వస్థత ఏమీ లేదని తేలింది. నేను బయట నిలబడిఉన్నాను. అక్కడివారితో నన్ను పిలువమని చెప్పారు. నేను వెళ్లగానే, 'ఆశారామ్‌కు నా జ్వరం గురించి నువ్వు చెప్పిన సంగతి నాకు బాగా తెలుసు. నాకు ఏ జబ్బూ లేదు. శరీరంలోకి ఏదైనా పరాయిపదార్థం చేరితే జ్వర రూపంలో బయటపడుతుంది. అదే పోతుంది. నువ్వు కంగారు పడి, మిగతా వారిని కంగారు పెట్టవద్ద'ని హితవుచెప్పారు.

## మాయమైన తారాదేవి జబ్బు

ఆనంద్ నుండి అహమదాబాద్ వెళ్లాము. చందూలాల్ జోషీ గృహంలో మకాము. ఆయన భార్య 'తారా బెహెన్' టీ తయారు చేసి ఇచ్చారు. ఆమెను కూడా ఒక కప్పు టీ తీసికొని వచ్చి మాతో కూర్చుని త్రాగమన్నారు గురూజీ. అప్పుడు ఆమె గురూజీతో- 'గత పది సంవత్సరాలుగా నేను టీ తీసుకోవడం లేదు. ఆహారం కూడా తీసుకోవడం లేదు. డాక్టర్ల సలహా ప్రకారం పండ్లరసాలు మాత్రమే తీసుకొంటున్నాను. పొట్టలో ఏదో కురుపు ఉందట. అందుచేత వద్దన్నారు డాక్టర్లు'- అన్నారు. అప్పుడు గురూజీ 'అమ్మా, నీకు ఏ జబ్బూ లేదు. టీ తీసుకొని వచ్చి ఇక్కడ కూర్చుని త్రాగు. నీకేమీ కాదు'- అన్నారు. ఆమె తపోభూమికి చాలా సార్లు వచ్చారు. తనకేమైనా జరుగుతుందేమోనని భయపడ్డారు. 'నీకేమీ జరగదు.

రాత్రివేళ సూర్యుడు కనిపించలేదని కన్నీరు కార్చుతూఉంటే-నక్షత్రాలు సైతం కానరావు -టాగూర్.

టీ త్రాగు'– అన్నారు గురూజీ. భయపడుతూనే టీ త్రాగింది. ఆమెకు ఏమీ కాలేదు. భోజనాలవద్ద ఆమెను మాతోపాటు భోజనం చేయమని గురూజీ చెప్పారు. ఆమె మౌనంగా నిలుచున్నారు. తనమీద నమ్మకం ఉంచి భోజనం చేయమన్నారు గురూజీ. ఆమె చేత భోజనం చేయించారు. భోజనం అనంతరం ఆమెకు ఏమీ కాలేదు. మామూలుగానే ఉంది. అక్కడ మూడురోజులు ఉన్నాము. మూడు రోజులూ ఆమె గురూజీతోబాటే భోజనం చేసింది. ఆమె గురూజీతో, 'మీ ఆశీర్వాదం వల్ల నాకు ఏమీ కాలేదు. భోజనం చేయగానే పొట్టలో విపరీతమైన నొప్పి వచ్చేది. అందుకే డాక్టర్లు భోజనం మానివేయమన్నారు. కాని ఇప్పుడు మామూలుగా భోజనం చేస్తున్నాను, ఏ సమస్యా లేదు,' అన్నారు. గురుదేవుల ఆశీర్వాదం ఉంటే ఎవ్వరికీ ఏ హానీ జరగదు.

ఆతర్వాత పోర్‌బందరులో 1008 కుండీల యజ్ఞం చేయించారు గురూజీ. అప్పుడు గూడా తారాబెహెన్ మాతో బాటే భోజనాలు చేసేవారు. ఆమె పది రొట్టెల దాకా తినేది. ఆమె ఇదివరకటి పది సంవత్సరముల భోజనాన్ని ఇప్పుడు పూర్తిచేస్తున్నారు– అన్నాను నేను. అందరూ నవ్వారు.

## ఋషిత్వం అంటే....

అహమదాబాద్ తర్వాత బరోడాలోని శ్రేయాస్ విద్యాలయంలో యజ్ఞం జరిగింది. ఆ ఉదయం గురూజీ ప్రవచనం కోసం వేదికమీదకు వెళ్లారు. కొంచం సమయందాటాక ఒకరు నాదగ్గరకు వచ్చి, 'మోటా మహరాజ్' గురూజీని కలవాలనుకొంటున్నారు. ఎప్పుడు కలవడానికి వీలు ఉంటుంది.' – అని అడిగారు. గుజరాత్‌లో మోటా మహరాజ్ ఒక ఋషి. ఈ విషయాన్ని గురూజీకి చెప్పాను. దానికి వారు– మోటా మహరాజ్ గారి అడ్రసు తీసుకొంటే తానే వెళ్లి వారిని కలుస్తానన్నారు. వారితో భోజనం చేస్తానని వారి శిష్యునికి చెప్పమన్నారు. బరోడాలో ఒక భాగ్యవంతుని ఇంట్లో మోటా మహరాజ్ విడిదిచేసారు. గురూజీ ఆనతిచ్చిన ప్రకారం, వారి శిష్యులకు చెప్పాను. మోటా మహరాజ్ ఉదయం తొమ్మిది గంటలకు భోజనంచేస్తారు. ఈ నియమాన్ని వారు నిర్దుష్టంగా పాటిస్తారు. గురూజీ చెప్పిన ప్రకారం, మోటా మహారాజ్‌గారితో భోజనాల ఏర్పాట్లు జరిగాయి. కాని ఆరోజు యజ్ఞం దగ్గర కొంత కాలయాపన జరిగింది. అందువల్ల, గురూజీ మోటా మహరాజ్ వద్దకు మధ్యాహ్నం 12 గంటలకు వెళ్లారు. ఆ ఋషివర్యులు ఆరోజు గురూజీ కోసం తన నియమాన్ని ఉల్లంఘించారు. గురూజీ వారిని కలవగానే వారు వచ్చి గురూజీని కౌగలించుకొన్నారు. శ్రీరాముడు, భరతుల కలయిక వలె ఉంది ఆ సన్నివేశం. నాతో బాటు పంద్రెండు మంది ఉన్నారు. ఆరోజున వారిద్దరూ కలసి భోజనాలు చేసారు. మిగతావారితో నేను చేసాను. భోజనాల తర్వాత వారిరువురూ ఒక గదిలోకి వెళ్లి తలుపులు మూసుకున్నారు. ఇద్దరు ఋషులూ ఒకచోట సమావేశమైనారు. మేమంతా బయట కూర్చున్నాము. మిగతావారు నన్ను అడిగారు– 'వారిరువురూ ఏ విషయం పై మాట్లాడుకొంటున్నా' రని. నాకు మాత్రం ఏమి తెలుసు– అదే చెప్పాను. దాదాపు గంట తర్వాత ఇరువురూ బయటకువచ్చారు. మోటా మహ రాజ్ గురూజీతో కారుదాకా వచ్చారు. గురూజీ కారు బయలుదేరుతుండగా వారు వెనుకకు వెళ్లారు. దారిలో గురూజీతో, 'అందరూ మీరు మాట్లాడుకొన్న విషయాల గూర్చి ఆసక్తితో నన్ను అడిగారు'– అన్నాను. గురూజీ, 'ఆ విషయం మీకు అనవసరం. కాని మోటా మహరాజ్ ఒక మహా ఋషి అనే విషయాన్ని గుర్తుంచుకో'– అన్నారు. ఒక ఋషిని గుర్తించేది ఎలా అని అడిగాను. దానికి గురూజీ అన్నారు కదా– ''మోటా మహరాజ్ ఒకరకమైన జబ్బుతో బాధపడుతున్నారు. మేము కలసినప్పుడు, నేను వారితో, 'మనం మాట్లాడటానికి ముందు, మిమ్మలను మీ బాధ

**అపజయాలమీదనుంచి ఎదగడం నేర్చుకో -డా॥ ఎ.పి.జె.అబ్దుల్ కలామ్.**

నుండి విముక్తి చేయనివ్వండి. నాదగ్గర అపారమైన తపశ్శక్తి ఉంది. దానితో మీ జబ్బు నయం జేస్తాను'– అన్నాను. దానికి వారు 'నా జబ్బును నేను నవ్వుతూ భరించగలను. నాకోసం మీరు మీ తపశ్శక్తిని వృథాచేయవద్దు. నేను దానికి తగినవాడిని కాను'– అన్నారు. అంత బాధలో కూడా మోటా మహరాజ్ నవ్వుతూ ఉంటారు. "ఎందరో దురదృష్టవంతులు మనదేశంలో ఉన్నారు. అనేకరకాల బాధలతో వారు ఒకరితో ఒకరు కలహించుకుంటూ ఉన్నారు. వారికోసం నీ శక్తిని ఖర్చుచేయి. నాకోసం వద్దు'– అన్నారు మోటామహరాజ్. వారికి సమాజంలోని దుర్గుణాలకూ, సాంఘిక దురాచారాలకూ చాలా బాధగా ఉంది. ఇదే వారికి ఋషిగా గుర్తింపు ఇచ్చేది"– అని గురూజీ చెప్పారు. కారు దిగిన తర్వాత, నాతో ఉన్నవారితో గురూజీ చెప్పిన విషయాలు చెప్పాను. మోటా మహరాజ్‌ను కలవడం నాకు మొదటిసారి. కాని వారి గూర్చి ఇదివరలో చాలా విన్నాను. తర్వాత గురూజీ మథుర నుండి హరిద్వార్‌కూ, అక్కడి నుండి అజ్ఞాతవాసానికీ వెళ్లారు. తర్వాత నేను గుజరాత్ వెళ్లినపుడు మోటా మహరాజ్ దగ్గరకు వెళ్లి, పాదాభివందనం చేశాను. అప్పుడు వారు 'కుమారా, గురుదేవులు ఒక మహా ఋషి, సమాజ నిర్మాత. వారి పనిలో అడ్డంకులు రానీయకు. డబ్బు కావాలంటే, నీకు కావలసినంత నేను ఏర్పాటు జేస్తాను' – అన్నారు. 'మహరాజ్, నాకు మీ ఆశీస్సులు కావాలి. డబ్బు అవసరమైతే మీతో చెప్తాను. ఇప్పుడు కార్యక్రమాలు బాగానే జరుగుతున్నాయి'– అన్నాను వినయంగా.

## డా॥ రాధాకృష్ణన్ ప్రశంస

గౌరవనీయులు డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారు భారతదేశానికి అధ్యక్షుడుగా ఉన్న సమయంలో గురూజీ తాను అనువదించిన వేదాలను వారికి బహూకరించారు. అప్పుడు వారు "ఈ గ్రంథాలు నా జీవితంలో ఇదివరకు అందిఉన్నట్లయితే, నా జీవిత గమ్యం మరోలా ఉండేది. రాజకీయాల్లో కాకుండా, గురూజీ పాదాలచెంత ఆధ్యాత్మిక చింతనతో ఉండేవాడిని"– అని గురుదేవుల అనువాదాలను అత్యంత భక్తి శ్రద్ధలతో అందుకున్నారు. వారికి గురుదేవులపై మహోన్నతమైన గౌరవం ఉంది.

★★★

## చదువుకుంటే చాలదు

*అరుణి మహామేధావి. విధేయుడైన శిష్యుడు. గురువు ఉద్దాలకుడు ఈ శిష్యునిపైన ఎంతో వాత్సల్యం చూపిస్తుండేవాడు. అరుణుని గొప్ప తత్త్వజ్ఞానిగా చూడాలని ఆయన ఆకాంక్ష. తగిన ప్రయత్నం చేయకుండా ఎవ్వరూ ఇంతవరకూ తత్త్వజ్ఞాని కాలేదు, కాలేరు కూడా. అందుచేత ఆస్థాయిని అందుకోవడం కోసం అరుణి కూడా కఠోర సాధన చేయవలసి వచ్చింది.*

*గురువు అరుణికి 100గోవులను అప్పగించి ఇలా చెప్పాడు – 'వీనిని తీసుకొని అడవికి వెళ్ళు. ఇవి వేయి ఆవులు కానంత వరకు ఇక్కడికి తిరిగి రావద్దు.' తిరిగివచ్చిన తరువాతనే దీక్ష ఇవ్వడం జరుగుతుంది.' అరుణి మందను తోలుకొని వెళ్ళాడు. అభ్యాసం చేసి వాటి గడ్డి, నీరు, పోషణ మొదలైన విషయాల్లో పరిజ్ఞానం సంపాదించాడు. అతని సంరక్షణలో ఆవుల సంఖ్య వృద్ధి అవుతోంది. ఆవులు ఆరోగ్యంగా ఉన్నాయి. ఈవిధంగా కొంతకాలం సాగింది. 10.సం.లలో ఆవులు 100 నుండి 1000 ఐనాయి. వానిని తీసుకొని అతడు గురుకులానికి తిరిగి వచ్చాడు. అతడు అత్యంత ప్రసన్న చిత్తంతో ఉన్నాడు. అతని ముఖమండలం బ్రహ్మతేజస్సుతో ప్రకాశిస్తోంది. అరుణి ముఖం పైన గల తేజస్సును చూసి ఉద్దాలకుడు ఆనందభరితుడైపోయారు. శిష్యునిలోగల పురుషార్థం, విధేయత, సాధనలను మిక్కిలి ప్రశంసించారు. కొద్ది రోజులు గురుసన్నిధిలో వసించి అరుణి అద్వితీయమైన బ్రహ్మజ్ఞాని ఐనాడు. ఇతర విద్యార్థులకు ఆశ్చర్యం వేసింది. వారు చాలా కాలం నుండి అక్కడ ఉంటున్నారు. ఐనా అరుణికి సిద్ధించిన పదవి వారికి లభించలేదు. కులపతి ఉద్దాలకుడు చెప్పాడు– 'అనుభూతి, అభ్యాసం, ఆదర్శజీవనంల వలన మాత్రమే ఎవరైనా తత్వజ్ఞాని అవుతారు. అభిమానము, అధ్యయన– అధ్యాపనాదులు తత్త్వజ్ఞాన ప్రాప్తికి సరిపోవు.' దీనితో విద్యార్థులకు సమాధానం లభించింది.*

**శ్రమ నీ ఆయుధం అయితే, విజయం నీ బానిస అవుతుంది -మహాత్మాగాంధీ.**

ధారావాహిక : దివ్యజీవన దర్శనం-47

# పవిత్రీకరణ ప్రక్రియ-3

### భాగవత ప్రవచనం ద్వారా ధన సేకరణ

శ్రీరామ్ విలక్షణమైన పద్ధతిని అవలంబించారు. తండ్రిగారు చెప్పగా విన్న భాగవత సంఘటనలను ఆయన గుర్తుకుతెచ్చుకున్నారు. ఆ సంఘటనలను వరుసవారీగా మనస్సులో స్థిరపరచుకున్నారు. యమునా నది ఒడ్డున ఉన్న సనాతన ధర్మ మందిరంలో భాగవత మాసం జరుగుతుందని ప్రకటించారు. భాగవత సప్తాహాలు జరపడం పరిపాటి. మాస పారాయణ పద్ధతికూడా ఉంది. అయితే, శ్రద్ధాళువులు దానిని వ్యక్తిగతంగా జరుపుతారు. దానిని సామూహికంగా జరపాలని ఆయన నిర్ణయించారు. "సైనిక్" పత్రిక పనిలో, రాజకీయ కార్యక్రమాలలో మునిగి ఉండడంవల్ల రోజుకు ఆరు గంటలపాటు పారాయణ కోసం కూర్చునే అవకాశం ఆయనకు లేకపోయింది. పారాయణను నెల రోజులకు పొడిగించడంవల్ల ఉద్బోధనను హెచ్చుకాలం పొడిగించవచ్చుననే అభిప్రాయంకూడ ఆయనకు ఉంది.

సనాతన ధర్మ మందిర నిర్వాహకులు కార్యక్రమానికి అనుమతిఇచ్చారు. కార్యక్రమ నిర్వహణలో కూడ సహకరిస్తూ వచ్చారు. అయితే- పారాయణవల్ల వచ్చే దక్షిణను హరిజన ఫండ్‌కు జమచేస్తారని తెలిసి, వారు సహకరించడం మానుకున్నారు. మోసం జరిగిందని ఆరోపించారు. పారాయణకు ఇచ్చిన అనుమతిని ఉపసంహరించుకున్నారు. శ్రీరామ్ సనాతన ధర్మాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని దుష్ప్రచారం సాగించారు. ఆంగ్లేయులు ఆయనకు ఇందు కోసం డబ్బిచ్చారని కూడ వారు ఆరోపించారు. కొందరు మహాత్మా గాంధీని కూడ విమర్శించారు. వాస్తవానికి ఆ రోజుల్లో సనాతనధర్మవాదులు ఇలాంటి ఆరోపణలూ, విమర్శలూ చేయడం మామూలే. శ్రీరామ్ ఆ ఆరోపణలను పట్టించుకోలేదు. మందిరంలో పారాయణజరపడానికి అనుమతిలేకపోవడంతో ఇబ్బంది కలిగింది. మందిరం బయట యమునా నది ఒడ్డున ఆరుబయట కథా ప్రవచనం జరపడానికి ఆయన సన్నాహాలు ప్రారంభించారు. కాంగ్రెసు కార్యకర్తలు అందుకు సహకరించారు. వ్యాస పీఠం, 150 మంది కూర్చోవడానికి ఏర్పాట్లు మూడు రోజుల్లో పూర్తయినాయి.

వ్యాసపీఠం కోసమై ఒక పెద్ద చెక్కబల్లను వేదికమీద ఉంచారు. దానికి నాలుగు మూలలా నాలుగు వెదురు కర్రలు కట్టారు. వాటికి అరటి ఆకులు కట్టారు. పైకప్పు గురించి ఆలోచించలేదు. ఆరుబయటనే కూర్చోవడానికి ఏర్పాటుచేశారు. మాఘ శుక్ల పాడ్యమి నాడు ప్రవచనం ప్రారంభమయింది. మొదట ముప్ఫై మంది వచ్చారు. శ్రీరామ్ తమ ప్రవచనాన్ని ఇలా ప్రారంభించారు-

"భాగవతం అందరినీ పవిత్రంచేయడానికి ఉద్దేశించబడింది. ఉపనిషత్తులనూ, ఇతర శాస్త్రాలనూ అర్థంచేసుకోలేనివారికి ధర్మ తత్వాన్ని బోధించడం కోసం వేదవ్యాస భగవానుడు భాగవతాన్ని రచించారు. ప్రేతాలూ, పిశాచాలూ కూడ భాగవతాన్ని విని ముక్తిపొందుతాయి, ఇక సామాన్య ప్రజల విషయం చెప్పేది ఏముంది?"

ఆయన తమ ప్రవచనంలో సనాతనవాదులను విమర్శించారు. అయితే ఆయా వ్యక్తుల పేర్లను ఉటంకించలేదు. ఈ ఉపోద్ఘాతం తర్వాత ఆయన రోజూ గంటన్నరపాటు ప్రవచనం ఇచ్చారు.

పురాణం విన్న తర్వాత, జనం పైసా, రెండు పైసలు, అణా, నాలుగణాలు దక్షిణ ఇచ్చేవారు. ఈ దక్షిణను మాంగీలాల్ సంబాళించేవారు. ఆయన దళిత

**బాధ్యతలను నిర్వహించే పద్ధతినిబట్టి మనిషి గుణం తెలుస్తుంది.**

వర్గానికి చెందిన వ్యక్తి. పాఠశాలకు వెళ్ళి చదువుకునే అవకాశం ఆయనకు కలగలేదు. అయితే, ఆయన మేధస్సు సునిశితమైనది. చదువురాకపోయినా– జమా ఖర్చుల విషయంలో ఆయన దిట్ట. ఆయన స్వరాజ్య ఉద్యమంలో క్రియాశీల పాత్రను నిర్వహించేవారు. భాగవత ప్రవచన కార్యక్రమంలో ఇబ్బందులు రావడం చూచి, ఆయన ముందుకువచ్చారు. ఆయన తనకుతానుగా శ్రీరామ్ వద్దకు వచ్చి, "శ్రమించే పని, అవసరమైన సామాగ్రిని సమకూర్చే పని నేను చేస్తాను"– అన్నారు. మరి నలుగురు కార్యకర్తలు ఆయనతోపాటు ఉన్నారు. బయట తిరిగే పనీ, ఇతర ఏర్పాట్లూ వీరిద్వారా జరిగేవి.

## ఏర్పాట్ల బాధ్యత దళితులకే

ఆర్థిక ఏర్పాట్ల బాధ్యత తనకు అప్పగించబడినప్పుడు, మంగీలాల్ కొంచం సంకోచించారు. ప్రవచన కార్యక్రమం దళితులకూ, పీడితులకూ సాయపడడానికి ఏర్పాటు చేయబడినదనీ, ఆ వర్గం వ్యక్తులు దాని ఏర్పాట్లు చూడడం సముచితమనీ శ్రీరామ్ ఆయనకు నచ్చజెప్పారు. మాంగీలాల్ సంకోచం తొలగిపోయింది. ఆయన పనిలో నిమగ్నం అయారు.

తొమ్మిది– పది రోజులలోనే ప్రవచనానికి మంచి ప్రతిస్పందన రాసాగింది. సామాన్య ప్రజలతోపాటు కార్యకర్తల స్థాయి వ్యక్తులూ, సాహిత్యవేత్తలూ, పాత్రికేయులూ కూడ మధ్యమధ్యలో ప్రవచనానికి రాసాగారు. ప్రవచనం వార్తను ప్రసారం చేసే పనిని 'సైనిక్' పత్రికలో పనిచేస్తూన్న సహచరులు చేసేవారు. వారిలో కొందరు సాహిత్యంలో అభిరుచి కలిగిన వ్యక్తులను కూడ సంపర్కం చేశారు. అందువల్ల సాహిత్యవేత్తలూ, బుద్ధిజీవులూ తరచు ప్రవచనానికి వచ్చేవారు.

ఒక రోజున బాబూ గులాబ్‌రాయ్‌కూడ ప్రవచనానికి వచ్చారు. సాహిత్య జగత్తులో ఆయనకు మంచి పేరు ప్రతిష్ఠలు ఉన్నాయి. పాత్రికేయుడుగా శ్రీరామ్ ఆయనకు తెలుసు. ప్రవచనకర్తగా శ్రీరామ్ అవతరించడం ఆయనకు కొత్తగా, అపరిచితంగా తోచింది. ప్రవచనం పూర్తికాగానే, ఆయన లేచారు. వ్యాసపీఠంవద్దకు వెళ్ళి రెండు మాటలు చెప్పసాగారు. శ్రీరామ్ యొక్క ప్రవచన శైలి హిమాలయం నుండి దిగి మైదానంలోనికి వస్తూన్న గంగానదివలె వేగంగా, చిత్రంగా, అమాయకంగా, అయితే స్వచ్ఛంగా, నిర్మలంగా ఉన్నదని ఆయన పేర్కొన్నారు. ఆ శైలిలోని అమాయకత్వాన్ని ఆయన నొక్కి చెప్పారు. ఆయన తమ ప్రసంగం చివరలో ముఖ్య విషయానికి వస్తూ ఇలా అన్నారు–

"పాత్రికేయుడుగా, రచయితగా, సామాజిక కార్యకర్తగా శ్రీరామ్ మనకు ఇంతవరకు తెలుసు. ప్రవచన కర్తగా ఆయన పాత్ర క్రొత్తది. ఈ సందర్భంగా నేను ఈయనను 'పండిత జీ' అని పిలుసున్నాను. ఇకముందుకూడా అలాగే పిలుస్తాను. మీలో ఇష్టమున్న వారు కూడా అలా పిలిస్తే నేను సంతోషిస్తాను."

## ఇప్పుడు పండిత శ్రీరామ్ ఆయన

బాబూ గులాబ్ రాయ్ చేసిన ప్రకటనను ప్రవచనం విన్న ప్రజలు హర్ష ధ్వానాలతో ఆమోదించారు. శ్రీరామ్ మత్తకు, శ్రీరామ శర్మ మత్తకు పండిత శ్రీరామ శర్మ 'మత్త'గా అలా గుర్తింపు లభించింది. ఆరోజుల్లో 'పండిత' అనే సంబోధన అంత తేలికగా లభించేది కాదు. శాస్త్రాలపై అధికారం, ధర్మాన్ని గురించిన అవగాహన కలిగిఉండడమే కాకుండా– పవిత్రంగా జీవించినప్పుడే ఒక వ్యక్తిని పండితుడు అని పిలిచేవారు. ప్రతిభా, ప్రతిష్ఠా కలిగిన వ్యక్తికే సమాజంలో ఇలాంటి గుర్తింపు లభించేది. ఆ సంప్రదాయం ప్రకారం– బాబూ గులాబ్ రాయ్ చేసిన ఈ ప్రకటన అధికారికమైన గుర్తింపు. ప్రవచనానికి వచ్చేవారు శ్రీరామ్‌ను 'పండిత జీ' అని పిలువడం ప్రారంభించారు.

హృదయంలో స్వార్థం లేకపోతే - మనస్సుకు వృద్ధాప్యం రాదు.

వరిష్ఠ కార్యకర్తలకూ, వయోవృద్ధులకూ, అతి సన్నిహితులకూ ఆయన ఆతర్వాత కూడ శ్రీరామ్‌గానే మిగిలారు.

మాస పారాయణ ముగిసేసరికి పండిత శ్రీరామ్ సంకల్పంకూడ పూర్తయింది. దక్షిణగా 169 రూపాయలు ప్రోగయింది. కార్యక్రమానికయే ఖర్చును శ్రీరామ్, మాంగీలాల్ మున్నగు కార్యకర్తలు భరించారు. నిర్ణయించుకున్న లక్ష్యాన్ని మించి వచ్చిన డబ్బునుకూడ హరిజన ఫండ్‌కే ఇవ్వాలని వారంతా నిర్ణయించారు. అనుకున్న సొమ్ము ప్రోగయినందుకు అంతగా ఉల్లాసం కలుగలేదు. తమ గ్రామానికి వెళ్లి 20-25మంది సంపన్నులను కలిసినా- ఆ మొత్తం పూర్తయిఉండేది. 250-300మందికి సమాజ పవిత్రీకరణ సందేశాన్ని అందించడమే అసలు సాఫల్యం.

భాగవత ప్రవచనం వార్త తాఈజీకి 15-20 రోజులముందే అందింది. కొడుకు తండ్రి బాటలోకి వస్తూన్నందుకు ఆమె సంతోషించారు. ఆమె ద్వారకాధీశుని విగ్రహం ఎదుట తల ఆనించి ఇలా అన్నారు- "ప్రభూ! నా గారాబు కొడుకును తండ్రి తాతల దారికి తీసుకురా." ఆమె మనసు మారింది. మనస్సులో నిండిన ఉత్సాహపు పొంగువల్ల ఆ భావం వచ్చింది. వెంటనే ఇలా పశ్చాత్తాపం కూడ కలిగింది- శ్రీరామ్‌కు ఏది మంచిదో ప్రభువుకు తెలియదా. ఆయనే అతడిని తన దారికి లాగికొనివస్తాడు. నేను అధైర్యపడకూడదు.

ఈ భావన నిండిన హృదయంతో ఆమె శ్రీకృష్ణ విగ్రహం ఎదుటినుంచి వెంటనే లేచారు. ఈ ప్రార్థన జరిగిన రెండు వారాల తర్వాత ఆగ్రానుండి కబురు వచ్చింది- సమాజం తన ముద్దులకొడుకును 'పండితజీ' అని పిలువసాగిందని. ఆమె ఆనందంతో తలమునుకలు అయినారు.

## తల్లిగారి ప్రతీక్ష

ఆరోజున ఆమె శ్రీరామ్‌కోసం నిజంగా ఎదురుచూచారు. 'పండిత శ్రీరామ్‌ను ఎప్పుడు చూస్తానా, తన చిరంజీవిని ఎప్పుడు 'పండిత' అని పిలుస్తానా'- అని ఆ వార్త విన్న రోజే ఆమెకు ఉత్కంఠ కలిగింది. శ్రీరామ్ ఆగ్రానుండి రావలసిన రోజున ఆమె ఉదయంనుండి పలుమారులు భవంతి ముఖద్వారంవద్దకు వెళ్లివచ్చారు. గతంలో మూడు నాలుగు మారులు జైలునుండి విడదల అయి వచ్చినవెంటనే తన సహచరులతో కులాసా కబుర్లలోనే సమయం గడిపాడుకదా వెర్రినాగన్న! ఈసారి అలా జరగకూడదు. ఈ అనుమానంతోనే ఆమె ముందుగానే కబురుపంపారు- శ్రీరామ్ సరాసరి ఇంటికి రావాలని, ఇంటికి వచ్చిన తర్వాతనే మరో చోటికి వెళ్లాలని. 'నా పిల్లవాణ్ణి త్రోవలో చుట్టుముట్టకండి, మొదట తన తల్లిని కలువనీయండి' - అని శ్రీరామ్ సహచరులకు కూడ చెప్పివేశారు.

తాఈజీలోని ఈ భావోద్వేగాలు కాక - భవంతి లోపల అవ్యక్తమూ, మౌనమూ, అయినా అంత తీవ్రమూ అయిన ఉద్వేగాలు మరో అంతఃకరణలో కూడ చెలరేగుతున్నాయి. ఆ ఉద్వేగాలు పండిత శ్రీరామ శర్మగారి అర్థాంగివి. భవంతిలో అందరూ ఆమెను 'కోడలు గారు' అని పిలుస్తారు. పండితజీ సహచరులు ఆమెను 'వదినెగారు' అని పిలుస్తారు. పండితజీ ఆమెను తమ కుమారుడు 'ఓమ్ ప్రకాశ్' పేరుతో పిలిచేవారు. కూతురు పుట్టిన తర్వాత 'దయా కీ మా' లేక 'దయా' అని పిలుస్తున్నారు. ఆ మౌన సాధకురాలు తన పరిచయాన్నీ, పేరునూ (సరస్వతీ దేవి) అదృశ్యం చేసుకున్నారు. తనను తాను విసర్జన చేసుకోనిదే గృహస్థాశ్రమ సాధన సిద్ధించదు. ఆనాటి సంప్రదాయం ప్రకారం ఆమె పండిత శ్రీరామ్‌ను తమ కుమారుణ్ణి చాటు చేసుకుని పిలిచేవారు. అలా పిలిచే సందర్భాలు ఇంతవరకు

మనస్సును క్షాళనచేయడం గొప్ప తపస్సు.

కొద్ది మాత్రమే. వివాహం తర్వాత పండిత శ్రీరామ్ ఇంటివద్ద ఉన్నది తక్కువ సమయమే. వారు హెచ్చు సమయం స్వరాజ్య ఉద్యమంలో, 'సైనిక్' పత్రిక పనిలో గడిపేవారు. వారు వచ్చినప్పుడు, వారితో మాట్లాడే అవసరం వచ్చినప్పుడు, వారిని పిలిచే అవసరం వచ్చినప్పుడు- ఆమె ఆనాటి సంప్రదాయాన్ని పాటించేవారు. మనస్సులో కూడ ఆమె గృహస్థ ఆశ్రమాన్ని భావితరానికి ప్రతినిధిగా, ప్రతీకగా పరిగణించేవారు. ఆమెలో కూడ తన ఆరాధ్యుని కోసం ప్రతీక్ష ఉంది. ఆ ప్రతీక్ష మరింత వ్యగ్రంగా, మరింత వ్యాకులంగా ఉన్నదేమో కూడ. అయితే, ఆమె తన భావనను తనలోనే ఇముడ్చుకున్నారు.

## కుటుంబంతో సమాగమం

ముఖ ద్వారంవద్ద కలిగిన సంరంభంవల్ల పండిత శ్రీరామ్ విచ్చేసిఉన్నారని ఆమెకు తెలిసింది. తాఈజీ ముఖం ఉల్లాసంతో, ఆనందంతో వెలిగిపోతోంది. వైధవ్యం వల్ల, వార్ధక్యం వల్ల, భారతీయ మహిళ యొక్క వ్యక్తిత్వం మసకబారిపోతుంది. ఆ మసకబారినతనం ఆ సమయంలో తాఈజీ వ్యవహారణలో పూర్తిగా లోపించిపోయింది. సంతానం నిర్ణీత మార్గంలో పయనిస్తూ తొలి విజయం సాధించినప్పుడు, సంతానం తొలి సంపాదన ఇంటికి తీసుకువచ్చినప్పుడు ఉదయించే గర్వ రేఖ తాఈజీ హావ భావాలలో కానవచ్చింది. ఆమె ఇలా చెప్పుకుపోతున్నారు-

"మా శ్రీరామ్ ఇప్పుడు పండిత్ అయాడు. పెద్దపెద్ద విద్వాంసులు తమకు తాముగా నిన్ను 'పండిత్' అని పిలిచారని విన్నాను. నాకు ఏమి తెచ్చావు? కోడలికి ఏదయినా తెచ్చావు కదా. ఓమ్‌కూ, దయకు ఆట వస్తువులు తెచ్చే ఉంటావు."

ఇలా ప్రశ్నల వర్షం కురిసింది ఆమె నోటినుండి. తనకోసం తెచ్చిన చీరెను అందుకోగానే- తాఈజీ కళ్లనుండి ఆనంద బాష్పాలు ఉబికివచ్చాయి. ఈ ప్రేమాశృవులతో పాటుగా- కోడలికీ, పిల్లలకూ తెచ్చిన వస్తువులను చూడాలనే తహతహకూడ వ్యక్తమయింది.

శ్రీరామ్ రోజంతా ఇంటిలో ఉన్నారు. పిల్లలను ముద్దుచేశారు. భార్యను కుశల ప్రశ్నలు వేశారు. ఆమెనుండి ఎలాంటి ఫిర్యాదూ రాలేదు. ఎలాంటి ఆశా వ్యక్తం కాలేదు. ఎలా ఉన్నావని అడిగినప్పుడు- అక్కడ దేనికీ లోటు లేదని ఆమె జవాబు చెప్పారు. తమకు సేవచేసే అవకాశం లభిస్తే, నేను మరింతగా అదృష్టవంతురాలిని అవుతాను- అన్నారు ఆమె. ప్రస్తుత పరిస్థితి విషయంలో ఫిర్యాదులేవీ లేవని ఆమె చెప్పారు.

శ్రీరామ్ ఇలా అన్నారు- "తాఈజీ ఆదేశిస్తే, నిన్ను వెంటనే ఆగ్రా పిలుస్తాను. మధ్య మధ్యలో వస్తూపోతూ ఉంటాను. ఓమ్ కొంచం పెద్దవాడు కావాలి. వాడిని పట్టణంలోని పాఠశాలలోనే చదివిద్దాం. అక్కడ వాడు మన కళ్లముందు ఉంటాడు." ఆ మాట విని ఆమె మౌనం వహించారు. మౌనమే ఆమె అంగీకారం.

## గాంధీజీతో మరోమారు సమాగమం

ఈలోగా గాంధీజీ ఆగ్రా వచ్చారు. కచ్చేరీ రోడ్డువద్ద వారి కార్యక్రమం ఏర్పాటుచేయబడింది. వారు ఆగ్రాలో నాలుగు గంటలు మాత్రమే ఆగుతారు. కార్యకర్తలతో సంభాషణ, సాయంత్రం బహిరంగ సభ- ఈ రెండు కార్యక్రమాలు మాత్రమే నిర్ణయం అయినాయి. కార్యకర్తల గోష్ఠి కాంగ్రెసు కార్యాలయంలో జరిగింది. గోష్ఠిలో గాంధీజీ ఇలా చెప్పారు- స్వరాజ్య ఉద్యమాన్ని సంవత్సరంపాటు ప్రక్కనపెట్టాను. మన సమాజంలోని 80 శాతం ప్రజలు హరిజనులు, వనవాసులు, వెనుకబడినవర్గాలవారు, దళితులు. వారిని పైకి తీసుకురాకపోతే- స్వరాజ్యం వచ్చినా దానికి అర్థం ఉండదు. అలాంటి స్వరాజ్యం 10-15శాతం ప్రజలకే పనికివస్తుంది. అధికసంఖ్యాకులు దీనులుగా, హీనులుగా, దాసులుగా ఉండిపోతారు.

**ఆత్మ నిర్మాణమే అదృష్ట నిర్మాణం.**

గోష్ఠిలో పండిత శ్రీరామ్‌ను గాంధీజీకి పరిచయం చేశారు. హరిజన ఉద్ధరణ రంగంలో ఆయన చేస్తూన్న సేవను పాలీవాల్‌జీ ప్రస్తావించారు. భాగవత ప్రవచనంలో వచ్చిన దక్షిణ గురించి కూడ ఆయన పేర్కొన్నారు. గాంధీజీ నవ్వారు; ఇలా అన్నారు– దక్షిణ భగవంతునిది అవుతుంది. భగవంతుని సొమ్మును ఆయన దాసుల (హరిజనుల) కోసం వినియోగించాలనే ఆలోచన విలక్షణమైనది. సాయంత్రం జరిగే సభకు మంచి విషయం దొరికింది. ఇలా చెపుతూ చెపుతూ– గాంధీజీ నవ్వారు.

బహిరంగ సభలో గాంధీజీ ఉపన్యాసం వినడానికి సుమారు వేయిమంది వచ్చారు. అప్పుడు ఆగ్రా జనాభా 25–30వేలు ఉండవచ్చు. ఆ అనుపాతం ప్రకారం చూస్తే– సభలో పాల్గొన్నవారి సంఖ్య సంతృప్తికరంగా ఉంది. శ్రీరామ్ చేసిన భాగవత ప్రవచనాన్ని తమ ఉపన్యాసంలో పేర్కొని గాంధీజీ ఇలా అన్నారు– ఆలయాలకూ, ధార్మిక కార్యక్రమాలకూ వినియోగించే ధనాన్ని కొంతకాలంపాటు హరిజన ఉద్ధరణకు వినియోగించాలి. పండిత శ్రీరామ్ భాగవత ప్రవచనంద్వారా కొంత సొమ్ము సేకరించారు. అది నాకు ఎంతో సంతోషం కలిగించింది. ఆ డబ్బు ఎంత అన్నది నేను పరిగణించను. ధార్మిక కృత్యాలలో ఆయన ప్రజలకు దారి చూపడమే గణనీయమైన అంశం. ఆయనను 'పండిత' అని పిలచిన సజ్జనులు మంచి పని చేశారు.

## పండిత శ్రీరామ్‌ను అభినందించిన గాంధీజీ

గాంధీజీ తమ ఉపన్యాసంలో హరిజనోద్ధరణ కోసం చేయదగిన పనులను ఇలా వివరించారు– హరిజనులను ఆలయాలలోనికి రానివ్వాలి; వారిని ఉమ్మడి బావులలో నీళ్లు తోడుకోనివ్వాలి; సభలలో వారిని ఇతరులతో సమానంగా కూర్చోబెట్టాలి; హరిజనుల ఇళ్లకు రాకపోకలు సాగించాలి.

సభలో హరిజన ఫండ్‌కు విరాళం ఇచ్చే సమయం వచ్చింది. కార్యకర్తలు శ్రీరామ్‌ను గాంధీజీ ముందు నిలిపారు. గాంధీజీ ఇలా అన్నారు–

"ఈ పట్టణం తరఫున దానం ఇవ్వడానికి ఒక పండిట్ ముందుకువస్తున్నారు. ఇది సంతోషకరమైన విషయం. సవర్ణులమని చెప్పుకుంటూన్న మనం ఇలా ముందుకురావాలి. మన పూర్వులు చేసిన పొరపాటును సరిదిద్దడానికి మనం ఉద్యమిస్తే– హరిజనుల ఉద్ధరణ జరగడానికి ఒక సంవత్సరం అయినా పట్టదు."

హరిజన్ ఫండ్‌కు ఆగ్రా పట్టణం తరఫున విరాళం ఇవ్వడానికై పండిత శ్రీరామ్ తమను సమీపించినప్పుడు, గాంధీజీకి భావావేశం కలిగింది. ఆయన లేచి శ్రీరామ్ రెండు చేతులనూ తన చేతిలోకి తీసుకున్నారు. బిగించిన ఆయన గుప్పిలిని తన ముక్కుకు తాకించారు. వయోవృద్ధులు పిల్లల తల నిమిరిన విధంగా– ఆయన పండితజీ పట్ల వాత్సల్యాన్ని వ్యక్తపరచారు. ఆతర్వాత గాంధీజీ ఇలా అన్నారు–

"భాగవత శాస్త్రం అందరి కోసమే కదా! కేవలం హృదయం మాత్రమే కలిగిఉన్నవారి కోసం అది ఉపదేశించ బడిందనీ, బుద్ధితో, తర్కంతో, తాము గొప్పవాళ్లమనే అహంకారంతో తిరిగేవారి కోసం కాదనీ నేను విన్నాను. అది నిజమేనా?"

గాంధీజీ చూపిన ఈ ఆత్మీయతతో, ఈ వాత్సల్యంతో శ్రీరామ్ పరవశించిపోయారు. ఆ ప్రశ్నకు జవాబుచెప్పడం ఆయనకు సాధ్యపడలేదు. మీరు చెప్పింది నిజమే– అని ఆయన చెప్పాలని అనుకున్నారు. కాని, అంగీకారసూచకంగా తల ఊపారు. అంతే.

ఆతర్వాత గాంధీజీ మరో ప్రశ్న అడిగారు– "హరిజన్ ఫండ్‌కు మీరు స్వయంగా ఏమయినా ఇచ్చారా? 169 రూపాయలు ప్రవచనంలో వచ్చిన దక్షిణ కదా. నీ దంటూ విరాళం ఏదైనా ఉందా?"

పండిత శ్రీరామ్‌లోని భావోద్వేగం అప్పటికి చల్లబడింది. ఆయన ఇలా జవాబిచ్చారు– "నేను దాన్ని

**కార్యశీలత లేని జీవితం బరువు.**

రహస్యంగా ఉంచగోరుతున్నాను. మీరు ఆదేశిస్తే చెపుతాను– అయితే మీ చెవిలో చెపుతాను. అదైనా – దాన్ని ప్రకటించము అని మీరు మాట ఇస్తేనే.”

గాంధీజీ మాట ఇచ్చారు. పండిత శ్రీరామ్ ఆయన చెవిలోనే చెప్పారు. ఆ మాట విన్న గాంధీజీ ముఖం నవ్వుతో వెలిగిపోయింది. ఆయన నెమ్మదిగా పండిత శ్రీరామ్ మెడమీద చరచారు– ప్రేమగా.

తమ తండ్రిగారు లాల్చీకి పెట్టుకునే బంగారపు గుండీని తాము హరిజన ఫండ్‌కు ఇచ్చామని ఈ సంఘటన జరిగిన చాలా సంవత్సరాలతర్వాత పూజ్య గురుదేవులు చెప్పారు. ఆ గుండీని తేవడానికే వారు ఆవల్‌ఖేడా వెళ్లారు. తన కుమారుని వాటాలో వచ్చిన ఆ గుండీని తాఈజీ కోడలికి ఇచ్చారు– దాచిఉంచమని. శ్రీరామ్ దాన్ని దానం ఇచ్చారని తెలిసినప్పుడు ఆమె తన కుమారుని త్యాగ ప్రవృత్తికి గద్గదం అయినారు.

గాంధీజీ ఇలా అన్నారు– “అయినా నీ దగ్గర ఏదో మిగిలి ఉంది. నీవు దాన్ని దాటి ఉంచావు. దాన్ని కూడా ఇవ్వు.”

పండిత శ్రీరామ్ గాంధీజీ ముఖం చూస్తూ ఉండిపోయారు. “ఏమీ దాచి ఉంచలేదు” – అన్నారు. “నీ లాల్చీ జేబులో చూడు. ఇక్కడ కూర్చున్న నాకు కనిపిస్తోంది. చూడు. నీ లాల్చీ జేబులో ఉన్న నాణెం మెరుస్తోంది. అది రూపాయి నాణెం కావచ్చు.”

శ్రీరామ్ తన లాల్చీ జేబులో చెయ్యి పెట్టారు. గాంధీజీ తీక్ష్ణ దృష్టి, వినోద ప్రవృత్తి, అరమరికలు లేని సంభాషణ ఆయనకు నవ్వు తెప్పించాయి. ఆయన నవ్వుతూ రూపాయి బయటికితీశారు. దాన్ని గాంధీజీ చరణాలవద్ద ఉంచారు. గాంధీజీ చేయి ఎత్తి ఇలా అన్నారు–

‘‘ఇప్పుడు సరిపోయింది. బ్రాహ్మణుడు భగవంతునిపై నమ్మకం ఉంచాలి. తన బ్రతుకు దెరువు గురించిన ఆలోచనను వదులుకోవాలి. నేను నావద్ద దేన్నీ ఉంచుకోను. నా దుస్తులకు జేబులయినా ఉండవు. నేను వైశ్యుడనే. అయినా అపరిగ్రహ వ్రతాన్ని స్వీకరించాను.”

పండిత శ్రీరామ్ వెంటనే ఇలా అన్నారు– “అపరిగ్రహం నా వ్రతంకూడా, బాపూ. నేనుకూడా నా చింతను భగవానునిపై వదలివేస్తాను. ఆయనే నిభాయించుకోవాలి.”

★★★

## సుందరమైన పనులు చేసేవాడే సుందరుడు

*విక్రమాదిత్య మహారాజు, కాళిదాసమహాకవి ఇరువురూ ఉద్యానవనంలో విహరిస్తున్నారు. విక్రమాదిత్యుడు కాళిదాసుతో ఇలా అన్నాడు – ‘కవివర్యా, మీరు గొప్ప మేధావులు, ప్రతిభాశాలురు. భగవంతుడు ఎందుకు చేశాడో తెలియదు. మీకు అందమైన శరీరాన్ని ఇవ్వలేదు. అద్వితీయమైన మీ బుద్ధి కౌశల్యంతో పోల్చి చూస్తే మీది అందవిహీనమైన రూపం.’ కాళిదాసుకు వ్యవహార కౌశల్యం ఎక్కువ. వెంటనే సమాధానం చెప్పటం భావ్యం కాదని ఆయన ఊరుకున్నాడు.*

*రాజభవనానికి తిరిగి వచ్చిన తరువాత కాళిదాసు రెండు పాత్రలు తెప్పించాడు. ఒకటి మట్టిపాత్ర. ఇంకొకటి బంగారుపాత్ర. రెంటిని మంచినీటితో నింపారు. కొంతసేపైన తరువాత కాళిదాసు విక్రమాదిత్యుడిని అడిగాడు – ‘రాజా! రెండు పాత్రల నుండి నీరు త్రాగి చూడండి. ఏ పాత్రలో నీరు ఎక్కువ చల్లగా ఉంది?’ రెండింటిలో నుండి ఒక గ్రుక్క త్రాగి విక్రమాదిత్యుడు చెప్పాడు – ‘మట్టిపాత్రలో నీరే చల్లారి ఉంది.’ కాళిదాసు మందహాసం చేస్తూ ఇలా అన్నాడు – ‘నీటి చల్లదనం పాత్రపై ఆకారం మీద ఆధారపడి ఉండదు. అలాగే మహారాజా! ప్రతిభ అనేది కూడా శరీరాకృతి మీద ఆధారపడి ఉండదు. అది ఆత్మకు సంబంధించిన విషయం.’*

*ఇది విన్న మహారాజుకు తన పొరపాటు తెలిసింది. ఆయన కాళిదాసు గొప్పతనానికి, సమయస్ఫూర్తికి జేజేలు పలికాడు. అటు తరువాత ఎన్నడూ కాళిదాసు అందవిహీనమైన శరీరాన్ని గురించి వ్యంగ్యంగా మాట్లాడలేదు.*

**అచేతనమనస్సుకు ప్రభావితంచేసే ఆలోచనలు శీలాన్ని సంస్కరించగలుగుతాయి.**

నావారితో నామాట : నాలుగేండ్లలో శతజయంతి-10

# పరిశోధనల విస్తరణకు పథకం

## వైజ్ఞానిక అధ్యాత్మవాదం

పరమపూజ్య గురుదేవులు ప్రపంచానికి అందించిన మహత్తర సిద్ధాంతం వైజ్ఞానిక అధ్యాత్మవాదం. ఆధ్యాత్మిక మానవతావాదం ఆ సిద్ధాంతానికి మరో పేరు. ఈ సిద్ధాంతం ఆధారంగా 21శతాబ్దపు సమాజం నిర్మాణం కావలసి ఉంది.

విజ్ఞానం, అధ్యాత్మ పరస్పర పూరకములని గురుదేవులు చెపుతూవచ్చారు. విజ్ఞానం ద్వారా సంస్కరించబడిన అధ్యాత్మ ప్రతిపాదించబడాలి. విజ్ఞానం ద్వారా లభించే ఫలితాలను ఆధ్యాత్మిక వ్యవస్థ అదుపుచేయాలి. అప్పుడే సమాజం సర్వతోముఖంగా ప్రగతి పొందుతుంది. ఇదీ వారు ఇచ్చిన సూత్రం.

విజ్ఞానం, అధ్యాత్మ సహచరులు. ఒకదానిపై మరొకటి ఆధారపడినవి. ఒకే నాణానికి బొమ్మా, బొరుసూ. విజ్ఞానంయొక్క శిఖరాగ్రం చేతన విజ్ఞానం, అతిచేతన విజ్ఞానం- అధ్యాత్మ. ఈ అధ్యాత్మ ఆధారంగా ధర్మాన్ని వ్యాఖ్యానించాలి. అప్పుడు ధర్మం అందరూ గ్రహించదగినదీ, అందరికీ అన్ని కాలాలకూ వర్తించేదీ అవుతుంది. కనుక వైజ్ఞానిక అధ్యాత్మవాదం మన ఆలోచనా విధానంలో అంతర్భాగం కావాలి. మనం ఈ సిద్ధాంతం ఆధారంగా నేటి భౌతికవాద యుగంలోని సమస్యలను పరిష్కరించాలి.

పరమపూజ్య గురుదేవులు “పరివర్తన్ కె మహాన్ క్షణ్” (పరివర్తన జరిగే మహత్తర క్షణం) అనే గ్రంథంలో ఇలా వ్రాశారు-

“ఆదర్శాల అనుశాసనాన్ని తిరస్కరించడంవల్ల భౌతిక విజ్ఞానం వినాశకర ఫలితాలను ఇస్తోంది. అలాగే, నకిలీ అధ్యాత్మ ప్రవేశించడంవల్ల అధ్యాత్మయొక్క ప్రామాణికత, ఉపయోగం ప్రమాదంలో పడ్డాయి.”

దీనికి పరిష్కారాన్ని వారా గ్రంథంలో ఇలా సూచించారు-

“భౌతిక విజ్ఞానాన్ని అధ్యాత్మ తత్వజ్ఞానంతో జోడించాలి. ప్రత్యక్షవాదపు పరీక్షకు నిలబడగలిగేవిధంగా అధ్యాత్మయొక్క స్వరూపాన్ని సవరించాలి.”

భవిష్యత్తులో విజ్ఞానం జీవించి ఉంటుందనీ, అయితే భౌతిక విజ్ఞానం అని కాక అధ్యాత్మ విజ్ఞానం అని అది పిలువబడుతుందనీ వారా గ్రంథంలో పేర్కొన్నారు.

## అఖండజ్యోతి, బ్రహ్మవర్చస్‌ల పరిశోధన కార్యం

“అఖండ జ్యోతి” పత్రిక నలభై సంవత్సరాలుగా వైజ్ఞానిక అధ్యాత్మవాదాన్ని ప్రతిపాదిస్తోంది. నేటి వైజ్ఞానిక యుగంలో అధ్యాత్మను ఎలా ఆచరణలో పెట్టాలో సరళమైన భాషలో తెలుపుతోంది.

అలాగే, అధ్యాత్మబలం కలిగిన మహామానవుల కొత్తతరం ఎలా తయారుకావాలో బ్రహ్మవర్చస్ శోధ సంస్థాన్ పరిశోధిస్తోంది. అధ్యాత్మప్రధానమైన జీవితాన్ని గడపడం పూర్తిగా ఆచరణయోగ్యమనీ, ప్రయోజనకరమనీ, వైజ్ఞానికమనీ నిరూపించే లక్ష్యంతో ఆ సంస్థ పనిచేస్తోంది. బ్రాహ్మీ చేతన, జ్యోతిర్ విజ్ఞానం, పర్యావరణ శాస్త్రం, మానవ శరీర వ్యవస్థ మున్నగు అనేక విషయాలపై అది సిద్ధాంతపరమైన పరిశోధనలను జరిపింది. వాటి సంఖ్య 80,000. ఈ పరిశోధనలు మహత్తర ఫలితాలను సాధించాయి.

## పాఠ్య ప్రణాళికలోనికి

దేవ సంస్కృతి విశ్వవిద్యాలయం ఈ సంవత్సరం వైజ్ఞానిక అధ్యాత్మవాదాన్ని తన పాఠ్య ప్రణాళికలో అనివార్య విషయంగా ప్రవేశపెట్టింది. ఇందువల్ల విద్యార్థుల ఆలోచనా విధానంలో, జీవన సరళిలో, భవిష్యత్తుపట్ల దృక్పథంలో మార్పు వస్తుంది. విద్యా రంగంలో విప్లవం వస్తుంది. మన యోగం, ఆయుర్వేదం, కర్మకాండ, ఉపాసనా విజ్ఞానం, మానసిక చికిత్స, సంస్కృతి మున్నగు రంగాలలో విజ్ఞానాన్ని జోడించడంవల్ల ఆయా సిద్ధాంతాల పట్ల శ్రద్ధ పెరుగుతుంది. నైతిక విలువలు వికాసం పొందుతాయి. ఈ సిద్ధాంతాల ప్రకారం జీవించే విద్యార్థులు సమగ్ర వ్యక్తిత్వాన్ని రూపొందించుకుంటారు; మతోన్మాదంనుండి విముక్తి పొందుతారు; జాతీయవాద వాతావరణంలో పెరుగుతారు; ఆత్మ విశ్వాసాన్నీ, స్వావలంబననూ అలవరచుకుంటారు. క్రమంగా అన్ని విశ్వవిద్యాలయాలకూ, మన విశ్వ విద్యాలయానికి అనుబంధంగా స్థాపించబడే కళాశాలలకూ ఈ శిక్షణ మూలాధారం అవుతుంది.

**జీవన ఉద్ధరణకు సరళమూ, సులభమూ, సుగమమూ, శ్రేష్ఠమూ అయిన మార్గం -స్వాధ్యాయం.**

## జర్మన్ సంస్థతో ఒప్పందం

ఇటీవల దేవ సంస్కృతి విశ్వవిద్యాలయం జర్మనీలోని అంతర్జాతీయ వైదిక విజ్ఞాన సంస్థతో ఒక ఒప్పందం చేసుకున్నది. దాని ప్రకారం రెండు సంస్థలూ కలసి ఈ కార్యాన్ని ప్రపంచమంతటా వ్యాప్తిచేస్తాయి. యోగ విజ్ఞానం, వైదిక సిద్ధాంతాలు, అధ్యాత్మ తత్వ జ్ఞానములలోని సనాతన సత్యాలపై విస్తృత స్థాయిలో వైజ్ఞానిక పరిశోధన జరుగుతుంది. దేవ సంస్కృతి విశ్వ విద్యాలయంలోని వైజ్ఞానిక అధ్యాత్మవాద విభాగంలో అత్యాధునిక యంత్రాలతో, అంతర్జాతీయ స్థాయి పత్రికలతో, పరిశోధన గ్రంథాలతో కూడిన అంతర్భాగం ఏర్పాటయింది. జర్మనీలోని పై సంస్థతో, దేశ విదేశాలలోని అన్ని సంస్థలతో ఇది 'ఆన్ లైన్' సంబంధం కలిగి ఉంటుంది. ఇది విశ్వవిద్యాలయాలన్నింటికీ ప్రశిక్షణను ప్రదానం చేస్తుంది. సంస్కృతీ విస్తరణ రంగంలో మహత్తరమైన ముందడుగు ఇది.

## ఆర్ అండ్ డి సెంటర్

దేవ సంస్కృతి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పరిశోధన, వికాస విభాగం యొక్క విరాట్ భవనం నిర్మాణం అవుతోంది. ఇందులో భారతీయ వైద్య విధానాల వైజ్ఞానిక ఆధారాలపై పాశ్చాత్య పద్ధతులలో అధ్యయనం జరుగుతుంది. యోగం, ఆయుర్వేదం, ప్రత్యామ్నాయ వైద్య విధానాల ప్రకారం చికిత్స కూడ ఇక్కడ లభ్య మవుతుంది. 15 ఎకరాల స్థలంలో నిర్మాణం అవుతున్న ఈ నాలుగంతస్థుల భవనంలో వైద్యం, స్థాపత్యం, జ్యోతిర్ విజ్ఞానం, బ్రహ్మాండ భౌతిక విజ్ఞానం, పర్యావరణం మున్నగు భారతీయ విద్యలపై విరాట్ స్థాయిలో పరిశోధన జరుగుతుంది. స్వస్తిక్ ఆకారంలో ఉండే ఈ భవనం స్థాపత్య రంగంలో ఒక అభినవ ఉదాహరణగా నిలుస్తుంది.

## బహుముఖ పరిశోధన

ఈ భవనంలో 150 పడకల ఆసుపత్రి పనిచేస్తుంది. అందులో నర్సింగ్ కాలేజి, ఫార్మసీ కాలేజి, ఫిజియోథెరపీ ఇన్స్టిట్యూట్ మున్నగునవి కూడ ఉంటాయి. సంస్కారాలు–ప్రారబ్ధాలు ఆధారంగా విశ్లేషణచేయబడిన రోగాలపై పరిశోధన, వాటి చికిత్స జరుగుతాయి. ముందుముందు ఇది భారతీయ వైద్య కళాశాలగా రూపొందుతుంది. ప్రధానంగా యోగం, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యం, రేకీ మున్నగు పూరక ఆధ్యాత్మిక చికిత్సా విధానాలు ఇందులో అమలుజరుగుతాయి. సంస్కృతి పరంపరలు, యజ్ఞ విజ్ఞానం(యజ్ఞోపతీ), శబ్ద శక్తి, మంత్ర విజ్ఞానాలలోకూడ పరిశోధన జరుగుతుంది. 2012 నాటికి ఈ సంస్థ పూర్తి వికాసం పొందుతుంది. ఈ కేంద్రం ప్రపంచంలో ఒక అద్వితీయమైన సంస్థగా రూపొందుతుంది. దీని శాఖలు ప్రస్తుతం వివిధ స్థలాలలో నడుస్తూన్న మెడికల్ కాలేజీలలో, పరిశోధన సంస్థలలో ఏర్పాటుచేయబడతాయి.

## విశ్వమంతటా విస్తరించాలి మన సంస్కృతి

దేశంలో సాంస్కృతిక, వైజ్ఞానిక విప్లవంతో ముడిపడిన సంస్థలతో సంబంధాలను స్థాపించి, సాంస్కృతిక విలువలను ప్రామాణికంగా, వైజ్ఞానికంగా ప్రపంచమంతటా వ్యాప్తి చేసే పథకం రూపొందుతోంది. ధార్మిక, ఆధ్యాత్మిక, వనౌషధి చికిత్సా ప్రధానమూ, సంస్కార ప్రధానమూ అయిన పర్యటన విభాగాన్ని విశ్వవిద్యాలయంలో తీర్చిదిద్దుతారు. వివిధ మతాల, భాషల ప్రశిక్షణ దీనితోపాటు జరుగుతుంది.

పరమపూజ్య గురుదేవుల సాహిత్యంలోని ప్రధానమైన 40 గ్రంథాలను అనువదింపజేసి 2012నాటికి ప్రపంచం నలుమూలలకూ పంపుతారు.

## పరిశోధన కార్య విస్తరణ

ప్రస్తుతం విశ్వవిద్యాలయంలో 80మంది పరిశోధక విద్యార్థులు వివిధ విషయాలపై పరిశోధన జరుపుతున్నారు. ఈ విషయాలు అపురూపమైనవి, సమాజానికి అద్భుతంగా ఉపకరించేవి. ఎడబ్లియుజిపి డాట్ ఆర్గ్ (awgp.org) వెబ్సైట్కు వెళ్లి డి.ఎస్.వి.వి.పై క్లిక్ చేసి, ఈ విషయాలను చూడవచ్చు. ఈ పరిశోధకులు ఇప్పుడు తమ పరిశోధనను ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలతో, పరిశోధన సంస్థలతో పంచుకొనగోరుతున్నారు. తద్వారా ఈ మహత్తర జ్ఞానయజ్ఞం ప్రపంచీకరణచెందుతుంది. ప్రపంచంలో, మన దేశంలో జరుగుతూన్న పరిశోధన కృషికి కొత్త మలుపు వస్తుంది. ఈ పరిశోధనల ఫలితంగా వివిధ సామాజిక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది; వైజ్ఞానిక అధ్యాత్మవాదం విశ్వమంతటా విస్తరిస్తుంది.

ఈ జ్ఞాన విప్లవం పూజ్యవరుల యుగ నిర్మాణ యోజనను అమలుజరుపుతుందనీ, కృతయుగం తిరిగివస్తుందనీ, జ్ఞానమూలక సమాజం ఏర్పడుతుందనీ, ఒకే విశ్వం, ఒకే సంస్కృతి, ఒకే భాష, ఒకే ధర్మం అనే సిద్ధాంతం సాకారం అవుతుందనీ ఆశిస్తున్నాము.

★★★

**సోమరితనం చెడ్డది. మానసిక సోమరితనం మరీ చెడ్డది.**

సద్గురు లీలామృతం

# బాంబుల వర్షంనుండి పరిజనులకు రక్షణ

1965లో పాకిస్తానీ నౌకలు జోధ్‌పూర్ మీద భారీయెత్తున బాంబుల వర్షం కురిపించాయి. మేము గాబరాపడ్డాము. గురుదేవులనుండి ఉత్తరం వచ్చింది- నిశ్చింతగా ఉండమని యుగ నిర్మాణ్ పరివార్‌లోని ప్రతి సభ్యునికీ వెళ్లి చెప్పండి; ఎన్ని బాంబులు పడినా, మన వాళ్లకు ఎలాంటి హానీ జరగదు అని. ఆ తర్వాత 200 బాంబులు పడ్డాయి. పరివార్ సభ్యులలో ఎవ్వరికీ చిన్న గాయంకూడ కాలేదు, ఆర్థిక నష్టం జరగలేదు.

1956లో శతకుండీ యజ్ఞం కోసం మథుర వచ్చాను. ఆరువేలమంది పాల్గొన్నారు. అస్సాం, మద్రాసుల నుండి కూడ భక్తులు వచ్చారు. గురుదేవులు వివిధ కార్యక్రమాలలో నిమగ్నులై ఉన్నారు. వచ్చినవారిని కుశల ప్రశ్నలు వేయడానికయినా వారికి తీరిక చిక్కలేదు. వారు వచ్చినవారికి దర్శనం ఇచ్చారు. అంతే. నేను పలువురిని అడిగాను- మీరు ఇంత ఖర్చు చేసి ఇంత దూరం నుంచి వచ్చారు కదా; గురుదేవులతో మాట్లాడడానికయినా మీకు అవకాశం లేకపోయింది; వచ్చినందువల్ల మీకు లాభం ఏముంది? అందరూ ఒకే సమాధానం ఇచ్చారు- మాకు లాభం ఎప్పుడో అందింది. ఇక మిగిలింది వారిని దర్శనం చేసుకోవడమే. దాన్ని పూర్తి చేసుకోవడానికే వచ్చాము.

చాలా సంవత్సరాల క్రితం నాకు తీవ్రమైన కడుపునొప్పి వచ్చింది. గ్లాసెడు పాలయినా అరిగేవి కావు. కడుపు రాయిలా తయారయింది. నాకిక బ్రతికే ఆశ లేదని డాక్టర్లు తేల్చిచెప్పారు. అప్పుడు గురుదేవులను పిలిచాను. మందులు వేసుకోకుండానే జబ్బు నయమయింది. 1951లో మళ్లీ అలాంటి కడుపునొప్పి వచ్చింది. గురుదేవులు మరోమారు కాపాడారు.

మా నాల్గవ కుమారుడు పద్మసింగ్‌కు జబ్బు చేసింది. టి.బి ఆస్పత్రిలో చేర్చాము. మూడు రోజులపాటు నోటినుండి రక్తపు వాంతులు ఎడతెరిపి లేకుండా వచ్చాయి. అతణ్ణి కూడా గురుదేవులు కాపాడారు. అతడు మూడు నెలలలో ఆసుపత్రి నుండి విడుదల అయాడు.

నా మేనల్లుని మీద హత్యకేసు నడిచింది. నిర్దోషి అయిన మా సోదరుణ్ణికూడా ఆ కేసులో ఇరికించారు. బెయిలు దొరకలేదు. ప్రతివాదులు పోలీసువారు. వారి సిఫార్సుకూడ బలమైనది. మేము గురుదేవులకు వాస్తవాలను నివేదించాము. వారి కృపవల్ల కేసు వీగిపోయింది. ముద్దాయిలందరూ విడుదల అయారు.

-మాన్‌సింగ్ టాక్, జోధపూర్

## దుఃఖితురాలి ఒడిని నింపారు

శ్రీరామచంద్రసింగ్ శాంతికుంజ్‌లో 30 సంవత్సరాలు గురుదేవుల సమక్షంలో జీవించారు. గురుదేవులు అనేకమందికి అనేక విధాలుగా అనుగ్రహించిన అపురూప ఘట్టాలు అసంఖ్యాకంగా ప్రత్యక్షంగా వీక్షించారు. వాటిలో ఉదాహరణకు ఒకే ఒకటి.

శ్రీరామచంద్రసింగ్ గారి గ్రామానికి ప్రక్క గ్రామం హరనా. హరనా గ్రామంనుండి దుఃఖితురాలైన ఒక మహిళ శాంతికుంజ్‌కు వచ్చింది. అవిరళంగా జాలువారుతున్న అశ్రువులతో గురుదేవుల పాదాలు కడిగింది. ఆమె కుమార్తె గీతకు ఒక పుత్రుడు జన్మించి మరణించాడు. ఆమెను ఓదార్చలేకపోతున్నానని వాపోయింది. గురుదేవుల నోటినుండి బ్రహ్మవాక్యం వెలువడింది. “అదే బాలుడు గీత ఒడిలో త్వరలోనే ఆడుకుంటాడు.”- అని ఓదార్చి పంపించారు.

1989లో శాంతికుంజ్‌నుండి ఒక బృందం హరనా గ్రామానికి వెళ్లింది. అదేరోజు 1000దీపాలతో దీపయజ్ఞం జరిపించారు. గీత దీపయజ్ఞంలో పాల్గొంది. అదేరోజు రాత్రి గతంలో పుట్టిపోయిన బాలుని పోలికలతోనే మరొక్క బాలు డుదయించాడు. ఆ కుటుంబంవారి ఆనందానికి అవధులు లేవు.

పరమపూజ్య గురుదేవులు ఎప్పుడూ అంటూ ఉంటారు- ఎవరైతే నిండు మనస్సుతో గాయత్రీ తీర్థానికి వచ్చి వేడుకుంటారో, వారికి నా తపశ్శక్తి తప్పనిసరిగా సహాయం చేస్తుంది.” అని.

★★★

**అమృతంగా, దైవ ప్రసాదంగా భావించి- భోజనాన్ని స్వీకరించు.**

దేవసంస్కృతి విశ్వవిద్యాలయం

# హైదరాబాదు దూరవిద్యా కేంద్రంలో కోర్సులు

దేవసంస్కృతి విశ్వవిద్యాలయం (www.dsvv.org) దేశమంతటిలో 24 దూరవిద్యా కేంద్రాలను నిర్వహిస్తోంది. ఆ కేంద్రాలలో ఆరునెలల కోర్సులు అయిదు నిర్వహించబడుతున్నాయి. కోర్సులలోని పాఠ్యాంశాలు వేదమూర్తి తపోనిష్ఠ పండిత శ్రీరామశర్మ ఆచార్య గారి గ్రంథాలూ, భావాలూ ఆధారంగా రూపొందించబడ్డాయి. ఈ కోర్సుల ద్వారా వ్యక్తులు తమ ఇళ్లలోనే ఉండి, జీవించే కళలోని మహత్తర అంశాలను అధ్యయనంచేసి సర్టిఫికెట్లు పొందగలుగుతారు. తమ జీవితాలలో ఆరని వెలుగులను నింపుకోగలుగుతారు. యుగఋషి భావ గంగలో మునకలువేసి, తమ జీవితాలను సార్థకం చేసుకోగలుగుతారు.

## అయిదు కోర్సులు

1. వ్యక్తిత్వ వికాసం
2. యోగ ప్రవేశిక (యోగ విద్య, యోగ చికిత్స, ప్రత్యామ్నాయ చికిత్స)
3. కుటుంబ నిర్మాణం
4. భారతీయ సంస్కృతి
5. ఆరోగ్య పరిరక్షణ

హైదరాబాదులోని దూరవిద్యా కేంద్రం ప్రస్తుతం పై అయిదు కోర్సులలో మొదటి రెండు కోర్సులను నిర్వహిస్తోంది.

కోర్సులలో చేరడానికి విద్యార్హత ఇంటర్మీడియెట్. ఇవి ఆరు నెలల కోర్సులు. వ్యక్తిత్వ వికాసం కోర్సుకు రుసుము రూ॥ 500 లు. వయోపరిమితి లేదు. యోగ ప్రవేశిక కోర్సుకు వయోపరిమితి 18–35 సంవత్సరాలు. దీనిలో 15 రోజుల యోగాభ్యాసం (Practical Training) ఉంటుంది.

పాఠ్యాంశాలు హిందీలో ఇవ్వబడతాయి. అనుబంధ అంశాలు ఇంగ్లీషులో, తెలుగులో కూడ ఇవ్వబడతాయి. ఎసైన్‌మెంట్‌లు, ప్రాజెక్టులు, ఫైనల్ పరీక్ష– వీటిద్వారా విద్యార్థుల మూల్యాంకన జరుగుతుంది.

కోర్సులలో చేరగోరేవారు తమ దరఖాస్తులతో దిగువవాటిని జతపరచాలి–

1. మూడు ఫోటోలు. 2. రూ॥ 22 ల స్టాంపులతో స్వంత చిరునామా కలిగిన కవరు. 3. Deputy Registrar (D.E), Dev Sanskriti Vishwavidyalay పేరుమీద స్టేట్ బ్యాంకు / పంజాబ్ నేషనల్ బ్యాంకు డ్రాఫ్టు ద్వారా కోర్సు రుసుము. 4. విద్యార్హతలను తెలిపే సర్టిఫికెట్లు. 5. రూ॥ 5 ల స్టాంపు అతికించిన స్వంత చిరునామా గల 9" X 4" సైజు కవరు. స్వంత చిరునామా గల కార్డు.

దరఖాస్తులు పంపడానికి చివరి తేదీ 21–01–2008. ఈ తేదీని ఫిబ్రవరి 10 వరకు పొడిగించే అవకాశం ఉంది. తర్వాతి కోర్సు జూలై నెలలో ప్రారంభం అవుతుంది.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ : www.dsvv.org

అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్టరు చేసుకుని, ఆ నంబరును హైదరాబాదులోని దూరవిద్యా కేంద్రం కో ఆర్డినేటర్‌కు పంపవచ్చు. చిరునామా :
డాక్టర్ కస్తూరి లక్ష్మి, ప్లాట్ నం. 338, వసంతనగర్, హైదర్‌నగర్, హైదరాబాదు– 500 072.

మరిన్ని వివరాలకు సంప్రదించండి–
casturiluck@yahoo.com
9849421114, 9391174194, 9392442237

★★★

## భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్షకు రాష్ట్ర విద్యాశాఖ ఆమోదం

భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్షకు రాష్ట్ర విద్యాశాఖ ఆమోదం తెలిపింది.

గాయత్రీ పరివార్ రాష్ట్ర సంయోజకులు శ్రీ అశ్విని సుబ్బారావు పంపిన లేఖకు సమాధానంగా ఈ ఆమోదం వచ్చింది. శ్రీ అశ్విని సుబ్బారావు పంపిన లేఖపై తగు చర్యలు తీసుకోవలసిందిగా రాష్ట్రంలోని జిల్లా విద్యాశాఖ అధికారులందరికీ వ్రాసినట్లు పాఠశాల విద్యా శాఖ డైరెక్టరు తెలిపారు.

## గమనిక

జిగురు సరిగా అంటకపోవడం వల్ల కొన్ని పత్రికలు తిరిగివచ్చాయి. పత్రికలు అందని చందాదారులు కార్యాలయానికి ఆ సంగతి తెలుపగలరు. వారికి పత్రికలను పంపుతాము.

ధర్మంవైపు, ధర్మం కొరకు, ధర్మమే గమ్యంగా సాగుతూన్న జీవితం ధర్మోత్తర జీవితం.